VISALAANDHRA VIJAYAWADA Phone No. 376

రిజిష్టర్డు నెం. 6097. 8 పేజీలు : రెండణాలు

విశాలాంధ్ర

705543

సంపుటి 3 ★ విజయవాడ: శనివారం; మే 1; 1954 ★ సంచిక 27

మాతా కాఫీ హౌస్
కాఫీ హోటల్ అండ్ బేకరీ
ఏలూరు రోడ్డు ★ విజయవాడ-2
ఫలహారములన్నియు రుచిగాను, శుచిగాను చేయబడును
బిస్కట్లు, కేక్సు, కాఫీ, టీ లకు మా ప్రత్యేకత.
తల్లిపెట్టును మరిపించే మా హోటలును మరువకండి.
ప్రొ॥ గారపాటి
M. N A.

అజంతా హోటల్
ఏలూరురోడ్డు సెంటరు :: విజయవాడ - 2.
నూతన మేనేజిమెంటుతో
అనుభవముగల పనివాండ్రతో, పదార్థము లన్నియు
పరిశుభ్రముగాను, రుచిగాను చేయబడును.
సకల సౌకర్యములుగల గదులు అద్దెకు ఇవ్వబడును.
M. N. R.

జన విముక్తికై శ్రామికోద్యమ శపథంపట్టే మేడే నేడే!

కార్మిక వర్గానికి కమ్యూనిస్టుపార్టీ మేడే సందేశం

నేడే, మేడే! ప్రపంచకార్మిక వర్గపుసమైక్యతను, అంతర్జాతీయ కార్మికసోదరభావాన్ని వీరోచిత ప్రతిఘటనా శక్తినీ వ్యక్తం చేసే మేడే నేడే! ఈ పవిత్ర మే దినోత్సవ సందర్భాన, మన ప్రియతమ మాతృదేశపు కార్మిక వర్గాన్ని, భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ హృదయపూర్వకంగా అభినందిస్తోంది!

తమ, తమ మాతృదేశాలలో పరపీడన, వంచన, దోపిడీలను మచ్చుకైనా లేకుండా నిర్మూలించి, సుఖప్రదమైన ఆనందకరమైన, మహోన్నత సామాజిక జీవితాన్ని సృష్టించుకుంటున్న సోవియటు రష్యా, చైనా, తదితరప్రజాతంత్ర దేశాల ప్రజానీకానికి యివే మా అభివందనాలు! పెట్టుబడిదారీ, వలస దేశాలలోని ప్రజలు తమ తమ దేశాలలో యింకా సాగుతున్న స్వదేశీ విదేశీ దోపిడీ విధానాలను తుద ముట్టించ వీరోచిత పోరాటాలను సాగిస్తున్నారు. అట్టి పవిత్ర పోరాటాలను సాగిస్తున్న పెట్టుబడిదారీ వలసదేశ ప్రజలకు భారత కమ్యూనిస్టుపార్టీ తన శుభాకాంక్షలను, అభివందనాలను అందజేస్తోంది.

యుద్ధ జ్వరపీడితులైన అమెరికా గుత్తవ్యాపారస్తులు కావిస్తున్న వినాశకర యుద్ధ సన్నాహాల మధ్య, ప్రపంచశాంతికీ, ప్రపంచ ప్రజల స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకూ విఘాతం కలిగించే అత్యంత ప్రమాదకరమైన యుద్ధ సన్నాహాల మధ్య, ఈ ఏడాది మే దినోత్సవం జరగబోతున్నది.

ఇండో-చైనాలో జరుగుతున్న యుద్ధాన్ని యింకా విస్తృతం చేసి, ప్రజా చైనాపై దాడి సలిపేందుకు అమెరికా గుత్త వ్యాపారస్తులు కుట్రలు పన్నుతున్నారు. తమ చేతిలో హైడ్రోజను బాంబు కలదని దానిని ప్రయోగించి ప్రపంచ ప్రజలను భయపెట్టాలని ప్రపంచాన్ని భీతావహం చేయాలని అమెరికా గుత్త వ్యాపారస్తుల కుటిల ప్రయత్నం. కొరియా ఇండో-చైనా సమస్యలు పరిష్కరించేందుకు ఏ సమావేశం జయప్రదం కావాలని ప్రపంచ ప్రజలు తహతహలాడుతున్నారో అట్టి జెనీవా సమావేశాన్ని విఫలం చేయడానికి అమెరికా గుత్త వ్యాపారులు పన్నాగాలు పన్నుతున్నారు. ప్రపంచశాంతికి దోహదపడే ప్రతీ ప్రయత్నాన్నీ మొగ్గలోనే త్రుంచివేయాలని, పగటి కలలు కంటున్నారు.

తమ యుద్ధ సన్నాహాలను ఓడించడంలో భారతదేశం ఎనలేని పాత్రను సహించగలదనే భీతితో, సామ్రాజ్యవాదులు తమ క్రోధాగ్నిని భారతదేశం వైపుకుమళ్లించారు. పాకిస్థానును తమ యుద్ధ రథానికి కట్టివేసి తమతోపాటు యుద్ధానికి యీడ్చుకు పోవడం, భారతదేశంలోగల విదేశ స్థావరాలను భారతదేశంలో విలీనీకరణ కాకుండా ఫ్రెంచి, పోర్చుగీసు సామ్రాజ్యవాదులకు వెనకనుండి మద్దతు యివ్వడం ఇవన్నీ సామ్రాజ్యవాదుల కుట్రలోని అంతర్భాగాలే! అనేక విధాల వొత్తిడి తెచ్చి తమ అడుగుజాడలలో నడిచేటట్టు, తమ కాళ్ళముందు పడేటట్టు భారతదేశాన్ని చేయాలని సామ్రాజ్యవాదులు ప్రయత్నిస్తున్నారు.

మన భారతదేశ స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకూ, శాంతి భద్రతలకూ వొకవంక బయట నుండి అంతర్జాతీయ గుత్తవ్యాపారస్తులు ముప్పు తెస్తూంటే, యింకొక వంక వారి ప్రచ్ఛన్న నీడలన దగువారు, మన దేశంలో అధిక లాభాల కోసం కార్మిక వర్గంపై పదేపదే దాడులు చేస్తున్నారు; తమ పీడనా విధానాన్ని తీవ్రతరం చేస్తున్నారు.

కార్మికుల జీతాల తగ్గింపు, బోనసుల నిరాకరణ, పనుల నుండి తొలగింపు దేశంలో నిరుద్యోగం దారిద్ర్యం తాండవిస్తున్న పరిస్థితులలో ఈ యేడు మే దినోత్సవం జరగబోతున్నది. కార్మికులు అనేకవీరోచిత పోరాటాల ద్వారా సముపార్జించుకున్న సౌకర్యాలు, సాధించుకున్న హక్కులు కబళింప బడుతున్నవి. కార్మిక యూనియనులపై కార్మికుల ప్రజాస్వామిక హక్కులపై దాడులు విపరీతమవుతున్నాయి.

కాని యిదే దశలో తమపై జరుగుతున్న క్రూర నిర్బంధ విధానాలను, విపరీతమైన దాడులను భారత కార్మిక వర్గం ఎదిరించి వాటిని త్రిప్పికొట్టి తాను అజేయమైన శక్తిగా నిలబడ గలిగింది. పోరాటంలో ముమ్ముందుకు పురోగమించ గలిగింది. పురోగమిస్తున్న భారత కార్మికవర్గం, కొన్ని అద్భుత విజయాలను సాధించింది. ఫ్యాక్టరీలను మూసివేసినప్పుడు, కార్మికులను పనినుండి తొలగించినప్పుడు, వారికి నష్ట పరిహారం యివ్వాలనే ఆజ్ఞనన్నుసాధించ గలిగింది. ప్లాంటేషన్ను యాక్టులోని కొన్ని సూత్రాలు అమలులో ఉపసంహరింప బడినప్పుడు వాటిని తిరిగి ఆచరణలో అనుసరింప జేయాలని భారత కార్మిక వర్గం సమైక్యతతో పోరాడి విజయం పొందింది. అనేక చోట్ల కార్మికులకు పని భారాన్ని హెచ్చు చేసినపుడు, జీతాలను తగ్గిస్తున్నపుడు వాటిని యెదిర్చి పోరాడడానికై భారతదేశ కార్మికులు ప్రదర్శించిన సమైక్యత అనన్యం. ఈ విజయాలన్నిటినీ కార్మికులు తమ అసమాన సమైక్యతా బలంతో పోరాటాలతో సాధించ గలిగారనేది మరువలేని విషయం.

పరస్పర మైత్రితో, సమైక్యతతో తమ ప్రతి ఘటనా శక్తిని కూడదీసుకుని కార్మిక వర్గం నిలబడినపుడు అదివొక అభేద్యమైన కంచుకోటవలె వర్ధిల్ల గలదనీ తమ హక్కులను సాధించ గలదనీ జ్ఞాపకం పెట్టుకోవాలి. కార్మిక వర్గంలో, పొరపాటున ఎట్టి చీలికలు కలిగినా, ఎట్టి విభేదాలు పొడచూపినా, అవి కార్మికవర్గ శత్రువులకి మాత్రమే ఉపకరించగలవు.

కార్మిక వర్గ సంక్షేమం కోసం కార్మిక వర్గ సమైక్యత కోసం, భారత కమ్యూనిస్టు పార్టీ సదా కృషి చేయ గలదని ఈ మే దినోత్సవ సందర్భంలో ప్రతిజ్ఞ తీసుకుంటున్నది. తమ హక్కులను సాధించడంతో పాటు నిజమైన సంపూర్ణ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకై భారతదేశ ప్రజలు సాగిస్తున్న ఉద్యమానికి కార్మికవర్గం నాయకత్వం వహించేందుకై కావలసిన సమైక్యతను సాధించేందుకు భారత కమ్యూనిస్టుపార్టీ నిరంతర కృషిని సలపగలదు.

తమ తమ హక్కుల కోసం ఎడతెరిపిలేని ఆందోళన సలుపుతున్న, పోరాటాలను కావిస్తున్న రైతులను, విద్యార్థులను, ఉపాధ్యాయులను, తదితర మధ్య తరగతి ఉద్యోగులను భారత కమ్యూనిస్టు పార్టీ హృదయపూర్వకంగా అభినందిస్తోంది. అశేష పేద ప్రజానీకం తన అస్తిత్వంకోసలం స్వాతంత్ర్యం కోసం, హక్కులకోసం సలుపుతున్న పోరాటాలను బలపరచ గలదని భారత కమ్యూనిస్టుపార్టీ ప్రతిజ్ఞ తీసుకుంటున్నది. ఇదివరకువలెనే, యిప్పుడూ, ప్రజల అండనే నిలబడి ప్రజల విశ్వాసాన్ని ప్రేమనూ పొందేటందుకు భారత కమ్యూనిస్టుపార్టీ సర్వవేళలా సంసిద్ధమై వుంటుంది.

ప్రపంచశాంతి రక్షణకు, హైడ్రోజను బాంబు తదితర ప్రజావిధ్వంసక మారణాయుధాల నిషేధానికి, ఇండో-చైనా యుద్ధ పరిసమాప్తికై కొరియాలో శాంతి వాతావరణ స్థాపనకు ప్రపంచ ప్రజలు సాగిస్తున్న మహోద్ధృత ఉద్యమానికి అండగా నిలబడేటందుకు భారత కార్మిక వర్గాన్ని, ప్రజలను కమ్యూనిస్టుపార్టీ సంఘటితపరచ గలదని ఈ మేదినోత్సవ సందర్భంలో మళ్ళీ ప్రకటిస్తున్నది.

భారతదేశ కార్మికవర్గ సమైక్యత చిరస్థాయి అగుగాక!

ప్రపంచ కార్మికుల అంతర్జాతీయ సౌభ్రాతృత్వం చిరస్థాయి అగుగాక! మేడే, వర్ధిల్లుగాక!

నవ వసంతం

నేడు మే దినం. ప్రపంచ శ్రామికులంతా ఒకే ఘనకుటుంబం అనే భావానికి జన్మదినం. శ్రామిక జనుల సంఘీభావం పల్లవించిన దినం. తమ హక్కులను పోరాడి సాధించుకోవాలన్న చైతన్యం కుసుమించిన దినం. తమ భవిష్యత్తు రూపురేఖలను తామే దిద్దుకోవాలన్న కార్మికజన ఆశయం ఫలించిన దినం మే దినం. నేడు మే దినం.

ప్రపంచ శ్రామికులంతా అరవై నాల్గవపర్యాయం నేడు మే దినోత్సవం జరుపుకుంటున్నారు. అంతర్జాతీయ సౌభ్రాతృత్వానికీ, సామరస్యానికీ, సమరాలకూ యీ మే దినాన్ని మహోజ్జ్వల దీక్షాదినంగా పరిగణిస్తున్నారు.

అరవైనాలుగు సార్లు, అరవైనాల్గు సంవత్సరాలు ప్రపంచ కార్మికుల కంఠాలు ఒక్కటై నినదించాయి.

ఈ మే దినానికి సంకుచితత్వాలు లేవు. సన్నని పరిధులులేవు. అందుకనే ఈ మే దినానికి ఇంతటి సత్సంప్రదాయం ఏర్పడింది. లక్షలాది కార్మికులు తమ స్వాతంత్ర్యంకోసం, సౌఖ్యంకోసం నిరంతరం సాగించే సమరాలకు బాసటా అయి నిలిచిందీ మేదినం.

గత మేదినంనుండి - ఈ మేదినం వరకూ కార్మికులు సాధించుకొన్న ఘన విజయాలను బేరీజు వేసుకొనేదినం ఈ మేదినం.

కార్మిక పోరాటాలకు చికాగో కార్మికులుచేసిన అంకురార్పణ ఒక నూతన చరిత్రను నిర్మించింది. నాటి నుంచీ అంతర్జాతీయ కార్మికవర్గం సాధించిన విజయాలు, యావత్ప్రపంచ కార్మికులకూ నూతన ఆశాపథాన్ని చూపించాయి. ప్రజలు తమ సృజనాత్మక శక్తిద్వారా ప్రపంచంలో తెచ్చిన పరిణామాలు నాటినుంచీ ద్విగుణీకృత వేగంతో సంభవిస్తున్నాయి.

లోకడ ప్రపంచ కార్మికులు చారిత్రాత్మకమైన ఘన కార్యాలను సాధించారు. యుద్ధాన్ని నిరసిస్తూ ఎలుగెత్తారు. జనవినాశక మారణాయుధాలను ప్రతిఘటించారు. దురాక్రమణ కూటాలు ఏర్పడరాదు అని పోరాటాలు సాగించారు.

ఈ ప్రయత్నాలు ఎంతవరకూ సఫలమైనవో చరిత్ర నిరూపించవలసింది. శాంతి సాధనకు కార్మికవర్గం పూనినదృఢప్రతిజ్ఞ అంతర్జాతీయ ఉద్రిక్తతను చాలా వరకూ తగ్గించింది. ప్రపంచంలో సాటిలేని మేటిబలవంతులు ఈకార్మికులు అని నిరూపించింది.

అయితేఇంకా కనుచూపుమేరలో కారు మేఘాలు కానవస్తూనే వున్నాయి. ఇతరులపై తమ పెత్తనాన్ని రుద్దాలని ఆశించే వారి చేతుల్లో ఇంకా కావలసినన్ని ఆయుధాలు ఉన్నాయి.

ఈ ఇరవదియవ శతాబ్దంలో మానవుడు సాధించిన వైజ్ఞానిక రహస్యం అణుశక్తి అయితే మానవుడు సాధించిన మహాశక్తి మరొకటి ఉన్నది: అది సోవియటు సోషలిస్టు విధానంవల్ల పుట్టిన అపార సృజనాత్మక ప్రజాశక్తి. నిజమయిన ప్రజాతంత్రం అంటే ఏమిటో, దానివల్ల సాంఘికంగా ఆర్థికంగా ఈసమాజం ఎంతెంత పెద్దపెద్ద అంగలువేస్తూ పురోగమిస్తుంవో సోవియట్ యూనియన్ ప్రత్యక్షంగా చూపించింది. ప్రజానీక జీవన స్థాయినీ, సంస్కృతీ విజ్ఞాన స్థాయినీ కళాస్థాయినీ ఎంతత్వరగా పెంచవచ్చునో నిరూపించింది.

అందుకని మానవ భవిష్యత్తుపైన సోవియట్ యూనియన్ ఆదర్శం గాఢముద్రవేయడం సహజం. నేడు 50 కోట్ల జనాభాగల చైనా, అనేక ఇతరదేశాలు పెట్టుబడిదారీ విధానాన్ని శాశ్వతంగా మట్టుపెట్టి సోవియట్ యూనియన్ చూపిన అభ్యుదయ పథాన పయనిస్తున్నాయి. ఇకఅటు పెట్టుబడిదారీప్రపంచం సాధించిన దేమిటి?

జపానుపై అటంబాంబు ప్రయోగం. ఇండోచైనా, కొరియా, మలయాలలో మారణ యుద్ధాలు సాగించడం.

ఆయుధాలను పెంచి, కార్మికవర్గాన్ని దోచుకొని, తినడంలో పోటాపోటీలు పడడం - అంతే.

ఇటు సోషలిస్టుప్రపంచం సాధించినదేమిటి?

జనవినాశక మారణాయుధాలను నిషేధించాలని పట్టు విడవక పోరు సాగించడం.

అంతర్జాతీయ ఉద్రిక్తతను సడలించడం కోసం పట్టు విడువక పోరు సాగించడం.

తన ప్రజల సాంఘిక, ఆర్థికాభివృద్ధి కోసం నిర్మాణకార్యక్రమాలను సాధించడం - ఇవి.

మనయుగంలో కలిగిన ఈ అంతర్జాతీయ పరిణామాలను - సందిని పంది చేయడంలో అభ్యుదయనిరోధకుల ప్రచారం కొంతవరకూ పనిచేసింది. అయితే బూర్జువా దేశాలలోగల ప్రజలు ఈ మహాసత్యాలను చూడకుండా చేయ కలిగాయా ఆ అబద్ధాల పుట్టలు?

లేదు.

నూత్న ప్రపంచాదిత్యుడు నడినెత్తిన జాజ్వల్యమానంగా ప్రకాశిస్తున్నాడు. ఆ చండ సూర్యునివేడి కిరణాలు ప్రతి మూలకూ చొరుకొనిపోయి కలుష వాతావరణాన్ని పరిశుభ్రం చేస్తున్నాయి కోట్లాది సామాన్య ప్రజానీకాన్ని తట్టి లేపి, నీ శక్తిని గుర్తించు! నీబలాన్ని పోల్చుకో! అని ఉపదేశిస్తున్నాయి.

ప్రతి దేశంలోను ఆయా కార్మిక ప్రజల ప్రధాన సమస్యలను ప్రతిబింబించే నినాదాలు ప్రతి మే దినసానా ప్రతిధ్వనించాయి. అయితే ఈ నినాదాలు వేర్వేరు అనడానికి వీలులేదు. ప్రతి వీటా తొలకరిలో మొలకెత్తి శిశిరంలో వాడిపోయినా వేళ్ళ మాత్రం చెక్కు-చెదరని మొక్కలలాంటివీ నినాదాలు. ఆయేటికాయేడు మే దిన సంఘటనలు దృఢపడుతున్నాయి.

ప్రతి వసంతంలోను కొత్త చిగుళ్ళు తొడిగి కొత్త రెమ్మలు పెరిగి మూల వృక్షానికి జీవశక్తినీ, జిగినీ, బిగినీ పెంచినట్లుగా కార్మిక ప్రజల ప్రపంచ వ్యాప్త విముక్తి ఉద్యమం ప్రతి మే దినచర్యతోను మోజులెత్తి తీగెలువారుతోంది.

లోకడ నేల నాలుగు చెంగులా కార్మిక ప్రజలు పేదిన సందర్భంలో నినదించే మూల నినాదం శాంతి పోరాటం. శాంతి రక్షణ భారాన్ని ప్రజలు తమ భుజాలపై వేసుకొంటున్నారు. కడకంటా ఆ బాధ్యతను వహించడానికి వారు కృత నిశ్చయులై యున్నారు.

నేడు యావత్ప్రపంచ ప్రజల రాజకీయ కార్యక్రమంలోనూ తొలి అంశం శాంతి. ఈ శాంతి అనే అక్షరాలు నేడు మే దినోత్సవ పతాకాలపై మిలమిల మెరుస్తున్నాయి.

నూత్న జీవితం అనే సూర్యుడు నడినెత్తిన వెలుగుతున్నాడు. అతడి కిరణాలు అన్ని మూలలకు దూసుకొని పోతున్నాయి. నవ వసంతం వస్తోంది. అది మానవజాతి నవవసంతం.

—— ఇ. ఆలెక్జ్రాయేవ్

మేడే సెలవు

నేడు మే దినోత్సవం. మా కార్యాలయానికి సెలవు. అందుకని "విశాలాంధ్ర" వెలువడదు. పునర్దర్శనం మే 3 వ తేదీ సోమవారంనాడు.

— మేనేజరు.

ప్రతిజ్ఞ

శ్రీ బోధాయన

మేడే పండుగ
మేదిని జరిగేదీనాడే
కార్మిక కర్షక
ప్రపంచ పీడిత
ప్రజలందరకు
మేడే పండుగ ఈనాడే
మేదిని జరిగేదీనాడే!
పీడిత తాడిత
ప్రజాకోటికి
సేవలుచేసే
పత్రాలన్నీ
పిడికిలి బిగించి
ప్రతిజ్ఞ చేసే
గంటల కొరకు
జీవన భృతికి
సరిపడ కూలి
శెలవు దినాలు
నెలవుకు నీడా
వంటికి వలువా
బిడ్డకు విద్యా
జబ్బుకు మందు
హక్కులు కోరిందీనాడే!
పారిశ్రామిక
కార్మికులడిగిన
మాటలు వినకను
ప్రభుత్వ యంత్రం
ఫిరంగి పేల్చగ
కార్మికు లొరిగిందీనాడే!
చికాగో నగరపు
నెత్తురు టేరులో
తడిసిన చిహ్నం
నాటికి నేటికి
పీడిత ప్రజలకు
ఆశాజ్యోతిగ
అవతరించినది
అరుణపతాకం!
మాస్కో, పెకింగ్
వార్సా, ప్రేగ్‌లో
బెర్లిన్, బొంబే
నగర వీధులలో
కార్మిక కర్షక
ప్రజా వాహినులు
అంబర వీధిని
అరుణ పతాకం
ఎగురవేసేదీ నాడే
హైడ్రోజన్, అటంబాంబులు
యుద్ధోన్మాదుల
ప్రయోగ పరీక్షలు
అంట్లాంటిక్ పసిఫిక్సంధులు
పాకమెరికా సైనిక సంధులు
చెల్లనేరవని
కట్టిపెట్టమని
జనసందోహం
జవాబుచెప్పే
మేడే పండుగ యీనాడే!
శాంతినికోరే
స్వేచ్ఛనుకోరే
సోదరులారా!
పిడికిలి బిగించి
ప్రతిజ్ఞ చేదాం
సుస్థిర శాంతిని సాధిద్దాం
సమతాసౌధం నిర్మిద్దాం!

విముక్తి పొందిన నవచైనాలో శ్రమజలమోడ్చే నవమానవులు
చీకూ చింతాలేని చైనా కార్మికుల జీవితాలు

చైనా నూతన ప్రజాస్వామ్యంలో కార్మికుని జీవితం, పాటుపడే మానవుల బ్రతుకులు ఎలా వికసించాయో చాంగ్ చెన్ జీవితగాథవల్ల మనకు బోధపడుతుంది. చెన్ యు — అనే పత్రికా రచయిత చాంగ్ చెన్ అనే కార్మికుని కలుసుకొని ఆ కార్మికుడు చెప్పిన స్వీయగాథను ఈ వ్యాసంలో వివరిస్తున్నారు.

రచయిత :

చెన్ - యూ

"కార్మికుల జీవితం సంగతి తెలుసుకోవాలని ఉందా" అని షిహ్‌చిక్ షాన్ విద్యుత్ కేంద్ర ట్రేడుయూనియన్ కార్యదర్శి కుమారి యువాన్ అడిగింది నన్ను. నేను ఔనన్నట్లు చిరునవ్వుతో సమాధానం యిచ్చాను.

"విముక్తికి పూర్వం కష్టకాలంలో బ్రతుకు ఎలా వుండేదో ఇప్పుడెలా వుందో తెలుసుకోవాలంటే మా కర్మాగారంలో ఫర్నేస్ స్టోకర్ చాంగ్ చెన్‌ను కలుసుకోండి. 31 సంవత్సరాలకు పూర్వం ఎప్రెంటిస్‌గా చేరాడు. అతడి కథ తెలుసుకొంటే చాలును చైనా కార్మికుల గాథలన్నీ మీకు తెలుస్తాయి" అందావిడ.

షిహ్‌చిక్‌షాన్ విద్యుత్కేంద్రం నుంచే విద్యుచ్ఛక్తి పెకింగుకీ, చుట్టుప్రక్కల గ్రామాలకూ సరఫరా ఔతుంది. ఈ విద్యుత్కేంద్రం కార్మిక సంఘ కార్యదర్శి కుమారి యువాన్.

యువాన్ నన్ను వెంటనే చాంగ్ ఇంటికి బయలుదేర తీసింది.

"నేను ఇంటర్ వ్యూకు వస్తున్నానని ముందుగా ఆకట్టి ఆ తర్వాత వెళ్ళడం మంచిది కదా" అన్నాను నేను.

"ఆఁ అలాంటిదేమీ అక్కరలేదు. పత్రికలవాళ్ళంటే మా కార్మికులకు కొత్త లేదు." అంది యువాన్. మేం ఇద్దరమూ చాంగ్ ఇంటికిబయలుదేరాం. చాంగ్ ఇల్లు అక్కడకు దగ్గరలోనే ఉంది.

యువాన్ చెప్పిన మాట నిజమే. చాంగ్ మమ్మల్ని చూడగానే చిరునవ్వుతో స్వాగతం ఇచ్చాడు. చాంగ్ భార్యకూడా మాకు ఎదురువచ్చి లోపలికి తోడ్కొని పోయింది. నేనూ, చాంగూ, యువాన్ కూర్చున్న తర్వాత ఆమె మాకు ఆతిథ్యం ఇవ్వడం కోసం టీ సరంజామాలో మునిగిపోయింది.

చాంగ్ ఇల్లు

చాంగ్ కళ్ళల్లో తొణికే హాస్యరేఖ, పెదవులపై పారాడే చిరునవ్వు, చూస్తూవుంటే అతను విముక్తికిపూర్వం అనేక కష్టాలు నష్టాలు సహించినవాడని ఎవరూ అనుకోలేరు. చాంగ్ భార్య అంత ఎత్తరికాదు. మనిషి ఆరోగ్యంగాను, దుస్తులు శుభ్రంగానుఉన్నాయి. వాళ్ళమ్మాయి అరేళ్ళది. ఏదో వింతగా మావేపు చూస్తూ నిల్చింది. కాని కొత్తవాళ్ళను చూస్తే అనవసరంగా సిగ్గుపడ్డట్టు కనిపించలేదు.

"అంతా బాగా చూడండి" అన్నాడు చాంగ్ నవ్వుతూ నేనిటూ అటూ పరకాయించి చూడ్డం కనిపెట్టి. "మేం ఎంతహాయిగా బతుకుతున్నామో చూడండి" అని చేతులు తిప్పుతూ ఇల్లంతా చూపించాడు. అతిడలాఅన్న తర్వాత నేను సంకోచంవిడిచి ఇల్లంతా కలయచూశాను. టీ టేబులూ, వాలుకుర్చీ, అద్దాలబీరువా, ఎస్తుబల్లమీద గడియారం, పూలకుండీ. పసిడి చాపల గాజు కుండీ, రేడియో ఇదంతా చూస్తూవుంటే చైనా విముక్తి పొంది మూడేళ్ళయింది కాని లేకుంటే ఈ ఇల్లు ఏ జమీందారుదో అనుకొని వుండేవాణ్ణి. భేదంఅల్లా ఒక్కటే. గోడకు మావ్ సేటుంగ్ చిత్రపటంవుంది; బీరువాలో సగం సగం చెదలు తిన్న పాతపురాణాలకు బదులు కొత్తపుస్తకాలు అమర్చివున్నాయి.

"మేం ఇక్కడ ఏడాదినుంచీ వుంటున్నాం" అని చాంగ్ మొదలు పెట్టాడు ప్రసంగం. "ఈ ఇంటికి 1951 నవంబరులో మారాం."

ఇంతలోకి చాంగ్ భార్య వేడివేడి టీ తెచ్చింది. చాంగ్ ఆ టీని కప్పులలోకి పోస్తూ అందుకొన్నాడు.

"ఇక్కడికిమారడానికిముందు అదుగో అటు పడమట వున్నాయి చూశారూ ఆ గుడిసెలు! అందులో వుండేవాళ్ళం. అప్పుడు మీరు మమ్మల్ని చూడ్డానికి వచ్చివుంటే ఇలా బాగా వంగుని ఇంట్లోకి రావలసి వచ్చేది" అని చాంగ్ నాలుగుకాళ్ళమీద నడుస్తున్నట్లు నేల మీద పాకుతూ అభినయించి చూపించాడు.

చాంగ్ పూర్వంవున్న గుడిసెలన్నింటినీ పడకొట్టి అక్కడ కొత్తభవనాలు కడుతున్నారని ట్రేడ్‌యూనియన్ కార్యదర్శి యువాన్ అంది. విముక్తి సాధించిన నాటినుంచి ఇప్పటికి 500 గదులు నిర్మించారనికూడా ఆవిడ చెప్పింది.

చాంగ్ మళ్ళీ ప్రసంగంలోకి దిగాడు:

"మేం ఈ ఇంటికి వచ్చినప్పుడు మాకున్నదల్లా ఒకమంచం, ఒక టేబిలూ. బియ్యం [illegible] కొనేందుకు ఒకతట్టా; అంతేమా సామాను. కాని ఈ ఏడాది ఎంతసామాను కొన్నామో చూడండి! ఇప్పుడు దీన్ని "ఇల్లు" అని పిలిచినా అందంగానే."

అంతట్లో చాంగ్ భార్య మమ్మల్ని సైగలతోనే తమ పడకగదిలోకి తీసుకొని వెళ్ళింది. రంగురంగుల బుటేదారీ పనిచేసిన బొంతలూ, పరుపులూ దిండ్లూ ఎన్నో ఉన్నాయక్కడ.

"ఇదుగో ఇటుచూడండి!" అని ఆవిడ రెండు కావడిపెట్టెలను చూపించింది.

"ఈ పెట్టెలనిండా మా బట్టలున్నాయి. మాకు కావలసినన్ని బట్టలున్నాయి. అందులో మేలురకం దుస్తులుకూడా వున్నాయి. నిజము పూలజాకెట్లూ, గౌన్లూ మా అమ్మాయికే మాత్రమే ఉండేవి. ఇప్పుడు అవి నాక్కూడా ఉన్నాయి. నన్ను పెళ్ళికూతుర్ని చేసినప్పుడుకూడా ఇంత మంచిబట్టలు చూసి ఎరగను" అని ఆవిడ సగర్వంగా తన గౌను మడతలు సాఫుచేసుకొంది.

నిజమే 40 ఏళ్లుపైబడ్డ పల్లెటూరి ఇల్లాలు ఇంత చక్కనిదుస్తులు వేసుకోవడం నిజంగా ఒక విప్లవమే మరి. అయితే దేశవిముక్తి తర్వాత చైనాస్త్రీలలో ఇలా దుస్తులు వేసుకోవడం పెద్దవిశేషం కాదని ఆవిడ నమ్మకం.

చాంగ్ చదువు

మా ప్రసంగం అలా అలా చదువు సాములమీదికి మళ్ళింది. మొన్నమొన్నటివరకూ చాంగ్ కూడ నిరక్షరకుక్షి. చాంగ్ పుస్తకాల బీరువాలో బాలశిక్షకూడా వుంది. కాని విద్యుత్కేంద్రం కార్మికులు తీరికసమయాల్లో ఏర్పర్చుకొన్న శిక్షణ తరగతుల్లో చేరి చాంగ్ తన సాంకేతిక నైపుణిని బాగా పెంచుకొన్నాడు. ఇప్పుడతను నాల్గవ తరగతి నిపుణుడు. (షిహ్‌చిక్‌షాన్ విద్యుత్కేంద్రంలో కార్మికుల నిపుణతను బట్టి వారిని ఎనిమిది తరగతులుగా విభాగించారు) చాంగ్ ఇప్పుడు బాగా చదవగలడు. మావ్ సేటుంగ్ రచనలను అర్థంచేసుకోగలడు. మావ్ సేటుంగ్ రచనల ప్రతి అచ్చు అయిన వెనువెంటనే అన్నీ అమ్ముడుపోయాయి. చాంగ్ అదృష్టవశాత్తూ ఒక ప్రతి సంపాదించాడు. చాంగ్ పుస్తకాల బీరువాలో ఇంకా రాజకీయాలు, సాంకేతిక వ్యవహారాలకు సంబంధించిన పుస్తకాలు చాలా వున్నాయి. ఆధునిక చైనా కార్మికుడు తన వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకొనడానికి అవశ్యపఠనీయ గ్రంథాలవి.

నన్నూ, కుమారియువాన్‌నీ భోజనానికి ఉండమన్నాడు చాంగ్. "ఇప్పుడు మేం అతిథులను ఆహ్వానించే స్థితిలో వున్నాం" అని చాంగ్ దంపతులు సగర్వంగాఅన్నారు. ఆ కార్మికదంపతుల ఆహ్వానాన్ని మేం అంగీకరించాం. చాంగ్ భార్య భోజనం ఏర్పాట్లకోసం వంటింట్లోకి పోయింది. మేం తాపీగా కూర్చుని గతకాలపు కష్ట జీవితానికీ, నేటి సుఖమయ జీవితానికీ గల తారతమ్యాల మీదికి కబుర్లు మళ్ళించాం.

చైనా విముక్తికి పూర్వం చాంగ్ దాదాపు ఒకటిన్నర ఇంపీరియల్ మణుగుల మేలురకం పిండిని సంపాదించేవాడు. ఐతేఅది అతడికుటుంబానికేమాత్రమూ చాలేదికాదు. అందుకని ఆపిండిని అమ్మేసి సాధారణంగా పశువులకు పెట్టే ఉలవలూ, జొన్న పిండీ కొనుక్కునేవాడు. ఇక జపాను ఆక్రమణ రోజులలో ఆకూ అలమా తెచ్చుకొని అదే ఉడకేసుకొని తినేవాళ్ళం. చాంగ్ భార్య పగలంతా వెంట తుప్పల వెంట తిరిగి బొగ్గులు యేరుకు వచ్చి వాటిని అమ్మి, ఇరుగువారికి పొరుగు వారికి ఎన్నో ఇంటి చాకిరీ చేసిపెట్టి, కన్నీళ్ళను చన్నీళ్ల తోడుగా సంసారాన్ని గడిపేది. ఆ రోజులలో కొత్త బట్టలు కొనడం అనేది కలలో కూడా ఊహించరానిమాట. విముక్తికి పూర్వం చాంగ్ దంపతులు ఏడు సంవత్సరాలలో ఒక గజం బట్టకూడా కొనుక్కోలేక పోయారు. వాళ్ళ తాత చచ్చిపోయినతరువాత పాతబట్టలనుచింపి, వాటితో పిల్లలకు బట్టలుకుట్టేది చాంగ్ భార్య. ఒక గోనెగుడ్డపరుచుకొని మరో గోనెసంచి కప్పుకొనేవారు. అదే వారి పర్యంకం. అలాంటిస్థితిలో చాంగ్ దంపతులకు పుట్టిన ఆరుగురు పిల్లలలోనూ నలుగురు తిండిలేక కడుపులో బల్లలు పెరిగి చనిపోయారు. ఇప్పుడు వారికి మిగిలినవాళ్లల్లో షుమన్ అనే 15 ఏళ్ళ కొడుకూ, ఆరేళ్ళ కూతురూ ఇద్దరే. షుమన్ ఒక బోర్డింగుస్కూల్లో చదువుకొంటున్నాడు. చిన్నమ్మాయి వాళ్ళ అయ్య పనిచేసే ఫ్యాక్టరీ నడిపించే బాలోద్యాన పాఠశాలలో చదువుతోంది.

మేం మాట్లాడుతూ వుంటే చిన్నమ్మాయి వాళ్ళ అయ్యకాళ్ళను వాటేసుకొని అల్లనేరేడుపళ్ళలాంటి కళ్ళు ఎత్తి మావేపు ఆదోలాచూస్తూవుంటే నిజంగా మంచిపోంకం గల దంతపుబొమ్మ అనిపించింది.

"అమ్మాయిమంచి అదృష్ట వంతురాలు, సరైన సమయంలో పుట్టింది" అని చాంగ్ తన "చిట్టిదెయ్యం" తల నిమురుతూ అన్నాడు. చాంగ్ వాళ్లమ్మాయిని ముద్దుగా "చిట్టిదెయ్యం" అని పిలుస్తాడు.

విందుభోజనం

అప్పటికి చాంగ్ భార్య పళ్లెంలో అన్నం పెట్టుకొని వంటింట్లోంచి వచ్చింది. మాంసం వేపుడు, బంగాళా దుంప మాంసం పులుసు కూర, కోడిగుడ్డు పులుసు, కూరగాయలు తీసుకొనివచ్చి పెట్టింది. దీనికి తోడు రెండు మూడు రకాల పిండివంటలు కూడా వున్నాయి.

"ఇదేమిటి పెద్ద విందుచేస్తున్నారు" అన్నాను నేను ఆ పదార్థాలన్నీ చూసి కొత్తగా ఇదౌతూ.

"అబ్బే మీకోసం కొత్తగా మేం ఏమీ చేయలేదు. మేం రోజూ తినే అన్నమే మీకు పెట్టాం అంతే" అన్నాడు చాంగ్. యువాన్ కూడా ఆమాటే అంది.

విముక్తి తర్వాత సన్నబియ్యం, గోధుమపిండి తినగలుగుతున్నామని, అంతకుపూర్వం అవి పండగనాడు కూడా దొరికేవి కావని, చాంగ్ భార్య అన్నది.

"మాంసం, కోడిగుడ్లు, చాపలు ఇప్పుడు మానిత్యభోజన పదార్థాలు. అప్పుడప్పుడు కోళ్లు కూడా" అంది చాంగ్ భార్య. పూర్వపు రోజులలో అయితే కూరగాయల్లో నాలుగు మాంసం ముక్కలు వేసుకొని ఉగాది పూటకూడా తినడం సాధ్యం అయ్యేదికాదని ఆవిడ చెప్పింది.

ఈదశలో మా కబుర్లు కుటుంబ ఆదాయ వ్యయాలమీదికి మళ్ళాయి. 1951 లో పనివారి జీతాలను పునర్నిర్ణయించిన నాటినుంచీ చాంగ్ జీతం తొమ్మిది ఇంపీరియల్ మణుగుల మేలురకం గోధుమపిండికి పెరిగింది. అంటే 1949 లో విముక్తికి పూర్వం నాటి జీతాల కన్నా ఈజీతం మూడు రెట్లు అన్నమాట.

సౌకర్యాలు

ఈజీతంలో దాదాపు మూడవవంతు తిండికి సరిపోతుంది. ఇంటి అద్దెకు కాని, గొళాయికి కాని, విద్యుద్దీపాలకు కాని, ఒక్క దమ్మిడీకూడా ఇవ్వవలసిన అవసరం లేదని చాంగ్ భార్య చెప్పింది. కొసకు వారికి కావలసిన బొగ్గులోసగం వారి ఫ్యాక్టరీవారే సరఫరా చేస్తారట. మిగతా సగం మాత్రం వారు కొనుక్కుంటారు.

1952 లో ప్రజా ప్రభుత్వం వారు నిర్ణయించిన విద్యావిధానంవల్ల చాంగ్ దంపతుల కుమారుడు చదివే స్కూలులో స్కూలు ఫీజు ఇచ్చుకొనవలసిన అవసరం లేకుండా పోయింది. ఇక అతడి భోజనానికీ, ఇతర చిల్లర ఖర్చులకూ అంతా కలిసి ఆరమణుగు పిండి విలువ కూడా అవసరం లేదు. ఇంక చిన్నమ్మాయి చదివే బాలోద్యానపాఠశాలను ఫ్యాక్టరీవారే నడిపిస్తున్నారు. కాబట్టి అక్కడ ఖర్చు అనే మాటే వుండదు. పోతే ఇంక చాంగ్ స్వేచ్ఛగా డబ్బు ఖర్చుపెట్టేదల్లా రెండే రెండింటికి. ఒకటి సిగరెట్లు, రెండు టీ. వీటికి ఎంత ఖర్చుపెట్టినా పావుబస్తా పిండి ఖరీదు మించదు. సబ్బు మున్నగు పదార్థాలకు అందులో సగం ఖర్చు అవుతుంది.

చాంగ్‌చెన్ తన జీతంలో నూటికి ఒకవంతు తన ట్రేడ్ యూనియన్‌కు చందా ఇస్తాడు. ఇక చిల్లర ఖర్చులన్నీ కలిసి ఆరమణుగు పిండి ఖరీదు కూడా కాదు. స్నానాల గదులు, అభ్యంగన శాలలూ ఫ్యాక్టరీలోనే ఉన్నాయి. వాటికి ఒక్క దమ్మిడీ కూడా చెల్లించవలసిన అవసరం లేదు.

నెలకు నాలుగుసార్లు చాంగ్ దంపతులకు ట్రేడు యూనియన్‌వారు సినిమా టిక్కెట్లు ఉచితంగా యిస్తారు. అలాగేవారు చదువుకోడానికి పుస్తకాలు కూడా ఉచితంగానే ఇస్తారు. ఇలాగ మొత్తం నెలసరి ఖర్చు వారి జీతంలో నూరింట 70 పాళ్ళతో సరిపోతుంది. మిగతా 30పాళ్లను ఆదంపతులు బ్యాంకులో దాచుకొంటారు. అయినా చాంగుదంపతులు తమ కాలూ చెయ్యి వంగనినాడు ఉపయోగిస్తుందని ఇప్పటినుంచీ దాచుకోవలసిన అవసరం నిజానికి లేదు. కార్మికులందరికీ ఉచిత వైద్య సౌకర్యం జబ్బుపడ్డరోజుల్లో పూర్తిజీతం ఇవ్వాలని ప్రజాప్రభుత్వం శాసనం చేసింది.

అలాగే ముసలితనంలో అక్కరకొస్తుందనే వుద్దేశంతో కూడా దాచుకొనవలసిన అవసరంలేదు. కార్మికునికి 60 సంవత్సరాలు వచ్చిన తర్వాత అతడి జీతంలో నూటికి 60 వంతులు జీవితాంతంవరకూ పింఛను ఇవ్వాలని ప్రజా ప్రభుత్వ శాసనం వుంది.

"ఇంతికీ నేను పనినుంచి విరమించుకొంటేనే అది." అన్నాడు చాంగ్ మా ప్రసంగాన్ని మధ్యలో ఆపుతూ. "వృద్ధాప్యంలో కూడా నేను పనిచేయ తలుచుకొంటే నాకు పూర్తి జీతం యివ్వడమే గాకుండా నా జీతంలో నూటికి 20 వంతులు వృద్ధాప్యపుపింఛను కూడా వస్తుంది. ఇంకా నేను కొంత కాలం పని చేయగలను కాదూ ?" అన్నాడు చాంగ్ తన దండలూ కండలూ చూసుకొని మురిసిపోతూ.

"ఇంతకీ నా భవిష్యత్తును గురించి నాకు చింతలేదు. మా ఆలోచనల్లా ఒక్కటే. అది, మాకింత సౌకర్యం కలిగించిన ఈ దేశానికి ఏంచేయగలమా అనే నేను మా సహచరులూ అహర్నిశలు ఆలోచిస్తూ వుంటాం" అన్నాడు చాంగ్.

సాముదాయక జీవితం

ఫ్యాక్టరీ సాముదాయక జీవితంలో చాంగ్ వహించే పాత్రమీదికీ, అతని భార్య నిర్వహించే పాత్రమీదకి మా చర్చలు దొర్లాయి.

చాంగ్‌చెన్ తమ ట్రేడ్‌యూనియన్‌లో బాయిలర్ విభాగం తరఫున ప్రతినిధిగా వున్నాడు. అంటే తనతోటివారిబాగోగులూ వారిచదువుసాములూ, సాంకేతిక నైపుణి పెంపుదలా అంతా అతడు చూడాలన్నమాట. ఒకొక్కరే సంపాదించిన సాంకేతిక నైపుణిని అమలుపరిచి, మొత్తం ఉత్పత్తిని ఎక్కువ చేయడానికి వారంతా పాటుపడతారు.

చాంగ్ భార్య ఆదర్శ గృహిణి. అయినా ఆవిడకు తమ కుటుంబ వ్యవహారాలతో మాత్రమే కాకుండా ఇతర వ్యవహారాలుకూడా వున్నాయి. కార్మిక కుటుంబాలలో పరస్పర సహకార, సహాయాలకు ఆవిడ పేరు పొందింది. ఎవరికైనా పురుడు వచ్చినా జబ్బు చేసినా అక్కడావిడ పెద్ద దిక్కుగావుంటుంది. పత్రికా పఠన కూటాలను ఏర్పరుస్తూ వుంటుంది.

(మిగతా 7 వ పేజీలో)

గత సంవత్సరం మే దినోత్సవ సందర్భంలో చైనా అధ్యక్షుడు, మావోకు యువజన సంఘ సభ్యులు పూలగుత్తులను సమర్పిస్తున్న దృశ్యం.

నేడే మేడే

శ్రీ వీరంశెట్టి అప్పారావు

మేడే పండుగ వచ్చిందీ
మన మేడే పండుగ వచ్చిందీ
కూలీ పండుగ రైతుల పండుగ !
కాలుసగట్టిన చికాగోలో
మన కార్మిక యోధుల రక్తంబు
ప్రాణాలెన్నో అర్పించి
ప్రజలకు మార్గం చూపిన మేడే!
కష్టపడే మా జాతికంతకూ
కావలెను [illegible] అంటూ
యంత్రాలతో పనిచేసే మాకూ
ఎనిమిది గంటల పని అంటూ

శ్రామిక ఫలితం దోచుకుతినే
కసాయి ప్రభుత్వ మూనాడే
కూటికిలేని నిరుపేదల్పై
కాల్పులు కాల్చినదీనాడే !
ఎంతకాలమీ పిశాచపాలన
సహించదింకే ప్రజానీకము
నశింప చేయగ నిలచామని
ప్రతిజ్ఞ చాటినదీ మేడే !
మేడే పండుగ వచ్చిందీ
మన మేడే పండుగ వచ్చిందీ
కూలీపండుగ, రైతులపండుగ !

చిన్నపిల్లల కథ

జిత్తులమారి నక్కా కుందేలూ

అనగా అనగా ఒక అడవిలో ఒక కుందేలూ, ఒక నక్కా నివసిస్తూ ఉండేవి. కుందేలును ఎలాగైనా నోటికి చిక్కించుకోవాలని మాయజిత్తుల నక్క ఎన్నాళ్ళనుంచో తలపోస్తూ సమయంకోసం కనిపెట్టుకు కూచుంది. ఒకనాడు కుందేలు అడవిలో కనిపించే సరికల్లా, దాని వెంట తరుముకు వెళ్ళసాగింది. తరుముకు వస్తోన్న నక్కకు అందకుండా కుందేలు ఛంగుఛంగునపరుగెత్తుకొచ్చింది. నక్కదాని వెంట తగులుతూనే వుంది. కుందేలు దొరక్కుండా ముందుకు గెంతులు వేస్తూ తప్పించుకుంటూనే వుంది. నక్క యిక ఎంత సేపని పరుగెత్తుతుంది! ఎంత దూరమని పరుగెత్తుతుంది! కుందేలు సునాయాసంగాపరిగెత్తిపోతోంది. నక్కను దగ్గరకు రానిచ్చినట్టే రానిచ్చి పట్టుకు దొరక్కుండా పారిపోతోంది. నక్క గిరగిర రింగటాలు తిరిగింది. వొళ్ళంతా చెమటలు పోశాయి. కాళ్ళు పీకాయి.

దారిలో ఒక మూల పెద్ద పరిక్కంప కనిపించేసరికి కుందేలు చట్టుక్కున ఆ తుప్పలోకి దూరిపోయింది. నక్క, తుప్పచెంతకు వచ్చి కుందేలుకోసం పరకాయించి చూసింది. తుప్పలమధ్య చిన్న బొరియచేసుకుని కుందేలు హాయిగా విశ్రాంతి తీసుకుంటోంది.

బహుశా కుందేలు యీ ముళ్ళతుప్పలమధ్య చిక్కుకుపోయి వుండవచ్చునని నక్క కలలు కంటూ, వెనకాముందూ ఆలోచించుకోకుండా ఆ ముళ్ళతుప్పల మీద గభాలున దూకింది. దూకేసరికి యిక నేముంది! తుప్పలనిండా పెద్ద పెద్ద ముళ్ళు; గాలపుకొక్కెల్లా నక్కను బంధించివేశాయి. వొళ్ళంతా గీసుకుపోయింది. నెత్తురు ధారగా కారసాగింది. అటూఇటూ దొర్లేసరికి మరీ బాధపెట్టసాగాయి. భూమికీ ఆకాశానికీ మధ్యన తుప్పలమీద ముళ్ళకంపలలో చిక్కుకుని నక్క అరవసాగింది; కుందేలును తిట్టసాగింది: "దొంగముండా కుందేలూ ! నువ్వొట్టి బందిపోటు దొంగవి. రౌడీవి; వంచకుడివి. నన్నీ సైనిక వలయంలో బంధించివేస్తావా ? కేవలం ఆయుధశక్తిమీదనే నువ్వాధారపడుతున్నావేం? అమ్మమ్మమ్మ.. చూడు చూడు, నా నెత్తురు ఎలా కారిపోతోందోను! నీకు రక్తదాహం జాస్తీ. ఏమోఅనుకున్నాను, కాని నీ అంత పితూరీ రాయుడు మరిలేడు ! నట్టి టెర్రరిస్టువి ! నాలాంటి తగు మనుషులిలాగ చిక్కుల్లో పడితే అది అవకాశంగా తీసుకుని నీవంటి విప్లవవాదులు కుట్రలుపన్నేస్తూ వుంటారు ! నీకు దేవుడూ దెయ్యం పాపం గీపం బొత్తిగా లేవు ! నిరీశ్వరవాదివి ! ఛ ఛ!" అని అరుస్తూ నక్క, కుందేలును తూలనాడజొచ్చింది.

తుప్పలోంచి బయటకు వచ్చి కుందేలు రబ్బరు బంతిలా ముందుకు గెంతుతూ పరుగెత్తిపోయింది. నక్క గావుకేకలు విని కుందేలు ఆగి "నీ తిట్లన్నీ అయిపోయాయా ? యింకా వున్నాయా ? నీకు తిట్ల పురాణాలు మహాబాగా వచ్చును ! అవన్నీ నీవంటి బందిపోటు దొంగలకే వర్తిస్తాయి ! ఇంత సేపూ నిన్ను నువ్వే యెంత చక్కగా వర్ణించుకున్నావ్ ! ఇక నువ్వు అక్కడ ఆ తుప్పల మధ్య అలాగే వుండు ! నేను వెళ్ళొస్తాను! గుడ్ బై!" అంటూ చిరునవ్వు నవ్వింది !

ఫెంగ్ హూ-ఫెంగ్

రచయితలు - నాడూ నేడూ

నాడూనేడూ రచయితలలోగల తారతమ్యాన్ని గురించీ రచయితలూ, విమర్శకులు, పాఠకుల మనః ప్రవృత్తులను గురించీ ఇల్యా ఎహ్రెన్‌బర్గ్ విమర్శపూర్వకంగా వ్రాసిన వ్యాసంలో ఇది రెండవ భాగం.

కళలు వికసించి, వీరోచితమైన సామరస్యం ఏర్పడి అద్భుతరచనలు అనేకంగా వెలువడిన కాలం ప్రతి సమాజానికీ ఒకప్పుడు వుంటుంది. అలాంటి కాలాన్ని మహోన్నత దశ అంటాము. సోవియట్ సమాజం అభివృద్ధిలో ఇప్పుడే ఉన్నత కాలం ఆరంభమయింది. చరిత్రలో కొన్ని దశాబ్దాలు కొన్ని గంటలు మాత్రమే. మా రచయితలు వేగులవంటివాళ్ళు (Scouts). అందుచేతనే మా కింకా పుష్కిన్‌లూ, టాల్‌స్టాయ్‌లూ లేరు. కాని తప్పకుండా అలాంటి రచయితలు అవతరిస్తారు. మా సమాజపు ఆ మహోన్నతదశ ఇంకా ముందువుంది.

ఫ్రాన్సుకు నేడు బాల్జాక్, స్టెంధాల్, హ్యూగో, ఫ్లాబర్ట్, జోలాలులేరు. ఇంగ్లండుకు నేడు డికెన్సు, బైరన్, షెల్లీలులేరు. మరొక కొత్తస్టెంధాల్ లేక డికెన్సు ఉదయించాలంటే ఆ దేశాలలో చాలా మార్పు రావాలి. ఈలోగా వారికి వెనుకబడి వుండక తప్పదు.

పాఠకుడు సాయంత్రం ఓ పుస్తకాన్ని తెరచి చదవడం ప్రారంభించాడనుకోండి. అతిడేదో [illegible] చేసినట్లు అతనికి కన్పించవచ్చు. గ్రంథంలోని పాత్రలు ఆదే పట్టణంలో అదే వీధిలో ఉన్నప్పటికీ. పాఠకుని గమ్యస్థానం ఏమిటి ? ఈ పుస్తకంలో తాను కనిపెట్టాలనని అతడు ఆశించేదేమిటి ?

చరిత్రకు సంబంధించిన నవల అయితే అది విజ్ఞానాన్ని విస్తృతం చేయవచ్చు. చరిత్ర పుటలకు జీవం పోయవచ్చు. పీటర్‌ను గురించి అలెక్సీటాల్‌స్టాయ్ వ్రాసిన నవల నుంచి పీటర్ ది గ్రేట్ కాలాన్ని అధ్యయనం చేయడం కష్టం కాని పీటర్ కాలంనాటి భావనలను ఈ నవల వ్యక్తపరుస్తుంది.

పాఠకునికి తెలియని స్థలానికి సంబంధించిన నవల లేక అతనికి తెలియని వాతావరణం చిత్రించే నవల, అతనికి బోధచేయడానికి పనికి వస్తుంది. పాఠకుడు తన భూగోళ జ్ఞానం మెరుగుచేసుకోడం జరుగుతుంది. ఒకరు మరొకరి జీవిత విధానాన్ని తెలిసికోడానికి ఉపయోగపడుతుంది. "అండ్ క్వయిట్ ఫ్లోస్ ది డాన్" అనే నవలలో కొస్సాక్కుల జీవితాన్ని యెంత విస్తృతంగా చిత్రించినప్పటికీ, అందులోని ప్రకృతిదృశ్యాలు ఎంత మనోహరంగావర్ణించినప్పటికీ, అనిషోలొకావ్ తన పాత్రల ఆంతరంగిక ప్రపంచాన్ని చిత్రించడానికన్నా ఎక్కువఉపయోగపడవు. ఆనవలలోని గ్రిగరీ కథమీదనే పాఠకునిదృష్టి అంతా కేంద్రీకరింపబడి వుంటుంది.

ఇల్యా ఎహ్రెన్‌బర్గ్

ఈ కృషి ఎలా చేయాలనే దానికి లేక ఆధునికకథనిర్మాణం తెలుసుకోవడానికి పాఠకుడు ఆయాప్రవీణులవద్దకు వెళతాడు. కాని ఈవిషయంలో "భోగట్టాను ప్రోగుచేసిన" లేక ప్రవీణులుచెప్పిన విషయాన్ని దాదాపు హృదయపూర్వకంగా ఇముడ్చుకున్న రచయిత వద్దకు వెళ్ళడు. ఒక నవలా రచయితకన్నా అనుభవంగల వ్యవసాయదారుడు వ్యవసాయ విషయాలగురించి చెప్పగలడు. ఎంతో కష్టపడి వ్రాసే నవలా రచయిత కన్నా సైనిక [illegible] స్టాలిన్‌గ్రాడ్ యుద్ధాన్ని గాని, కుర్స్క్ వంపువద్ద జరిగిన యుద్ధం గురించిగాని బాగా చెప్పగలడు.

అయితే తనతోటి పౌరులకన్నా, సమకాలికులకన్నా బాగా రచయిత తెలుసుకోవలసిన సంగతి ఇంకొకటివుంది. అది మానవుని అంతరంగిక ప్రపంచం. ఒక పాత్ర ఆకారాన్ని అతనిపరిసరాలను వర్ణించాలంటే, అతని ఇల్లుకాని అతడు పనిచేసే ప్రదేశం గాని కావాలి. కాని అది అంతముఖ్యమైన పని కాదు. అలాంటి వర్ణనలు సాధనాలే కాని లక్ష్యాలు కావు.

చనిపోయిన పాత సమాజపు ఆచారాలను గురించి తెలుసుకోడానికే గాక, మానవ మనోవికారాల (Emoti ns) క్లిష్ట స్వభావాన్ని అర్థం చేసుకోడానికి టాల్‌స్టాయ్ నవలను ఆధునిక పాఠకుడు చదవడానికి ఉపక్రమించడు.

టాల్‌స్టాయ్ అతిక్రమించలేని సామాజిక వైరుధ్యాలను లెనిన్ అద్భుతంగా చిత్రీకరించాడు. రష్యా అవలంబించ వలసిన మార్గాలేవో లెనిన్‌కు స్పష్టం. కాని టాల్‌స్టాయ్ వాటిని చూడలేక పోయాడు. టాల్‌స్టాయ్ తత్వశాస్త్రంలోని నిరర్థకతను బయటపెట్టడానికి మాత్రమే కాదు అతని రచనలను లెనిన్ చదివింది. మానవుని ఆంతరంగిక ప్రపంచాన్ని సంపూర్ణంగా అవగాహనం చేసుకొనేందుకు ఈ మహారచయిత లెనిన్‌కుతోడ్పడ్డాడు.

ట్రెఖ్ గోర్న్యా మిల్స్‌లో పనిచేసే ఒక కార్మికయువతి సోవియట్ రచయితల మహాసభలో అన్న మాటలు ఇక్కడ జ్ఞప్తికి తెస్తున్నాను.

టెక్స్‌టైల్ కార్మికులు గురించి కథలను నవలలను వ్రాయలేదని ఆమె నిందించింది. ఇదిజరిగి ఇరవైఏండ్లయింది. టెక్స్‌టైల్ కార్మికులే కథానాయకులుగాగల పుస్తకాలు ఆ రోజుల్లో చాలామంది వ్రాశారు. కాని మిల్లు లైబ్రరీలోని ఈ పుస్తకాలకోసం కార్మికులు ఎక్కువ ఆసక్తి చూపేవారు కాదు. అక్కడి స్త్రీలకు తమ సమకాలికులను వర్ణించడం కన్నా లెవిన్, వ్రాన్‌స్కీలు అంటే ఎక్కువ అభిరుచి వుంటుందా ? ఉండదు. దానిని బట్టి టెక్స్‌టైల్ కార్మికులను గురించివ్రాసిన ఆ నవలలు అక్కడి యంత్రాలను వర్ణించాయి కాని ప్రజలను వర్ణించలేదు. ఉత్పత్తిక్రమాన్ని వర్ణించాయి కాని మానవుని భావనలనుగాదు.

కోట్లకొలది సోవియటు ప్రజలకు ఉక్కు ఎలా తయారు చేయడమో తెలుసు. యాపిల్ పండ్లలో అనేక రకాలను ఆ తోటల నిపుణులు ఎలా ఉత్పత్తి చేస్తారో వారికి తెలుసు. అనేక అంతస్తుల పెద్ద పెద్ద మేడలను ఎలా కడతారో వారికి తెలుసు. కాని నవలలను ఎలా ఉత్పత్తిచేస్తారో అందరు పాఠకులకూ తెలియదు. సృజనాత్మక కళ యొక్క మానసికతత్వాన్ని (సైకాలజీ) చాల తక్కువమంది అధ్యయనం చేశారు.

(మిగతా 7 వ పేజీలో)

చైనాప్రజారిపబ్లిక్ పట్ల అమెరికా దురాక్రమణ విధానం

జెనీవా మహాసభలో సోవియట్ విదేశాంగమంత్రి మాలటోవ్ విమర్శ

అయిదు అగ్రరాజ్యాల ప్రథమ సమావేశాన్ని తక్కువ అంచనా వేయరాదని హెచ్చరిక

జెనీవా, ఏప్రిల్ 29

చైనా ప్రజారిపబ్లిక్ పట్ల అమెరికా బహిరంగంగా దురాక్రమణ విధానాన్ని అవలంబించుతోందని జెనీవాసభలో నేడు సోవియట్ విదేశాంగ మంత్రి మాలటోవ్ స్పష్టపరిచాడు.

జెనీవా సభలో మాలొటోవ్ ప్రసంగించడం ఇదే మొదటిసారి.

మాలొటోవ్‌కు ముందు ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి కేసీ మాట్లాడాడు.

మాలొటోవ్ ఇలా అన్నాడు:

"చైనాకు వ్యతిరేకంగా అమెరికా దురాక్రమణ చర్యలను ఒకదాని వెంట మరొకటిచేస్తూ వచ్చింది.

"అమెరికా ఫార్మోజాను వశపరచుకొంది. జపానును పునరాయుధం చేస్తోంది. చైనాను బెదిరించుతోంది.

"ఇప్పుడు చైనాలో ప్రజా రిపబ్లిక్ ఏర్పడి ప్రజాతంత్రమైన ప్రజా ప్రభుత్వం గట్టి పునాదులపై నిలబడివుంది. ఈ విషయాన్ని గమనించక పోవడం చాలా అసంబద్ధంగా వుంటుంది.

"చైనాలో సామాజిక, ఆర్థిక, రాజకీయ మార్పులు మన కళ్ళెదుటనే జరుగుతున్నాయి. ఈ విషయాన్ని గుర్తించక పోవడం అంటే ఒక గొప్ప చారిత్రక ప్రాముఖ్యతనే గుర్తించకపోవడం అన్నమాట.

కొరియా సమస్యా పరిష్కారానికి ఉత్తర కొరియా సూచనలను ప్రాతిపదికగా తానంగీకరించుతున్నానని మాలొటోవ్ అన్నాడు.

ఆసియాలో జరిగే పరిణామాలను సమీక్షిస్తూ మాలొటోవ్ యిలా అన్నాడు. "30 కోట్లకు పైగా జనాభాకల భారతదేశం ఒక చారిత్రక రంగంలో ప్రవేశించినదన్న విషయాన్ని ఎవరు కాదనగలరు? భారతదేశం మొన్న మొన్నటివరకు వలసదేశం మాత్రమే.

"తమ జాతీయస్వాతంత్ర్యాన్ని రక్షించుకొనే దేశాలలో ప్రముఖ స్థానాన్ని భారతదేశం ఆక్రమించుతోంది. అంతర్జాతీయ వ్యవహారాలలో ప్రముఖస్థానం వహించడానికి అది ప్రయత్నించుతోంది. ఇది ఎవరూ కాదనలేరు.

"ఇండోనీషియా, బర్మా మొదలైన దేశాల ప్రాముఖ్యత దినదినం హెచ్చుతోంది.

"కొరియా విముక్తి చెందిన తర్వాత సైనిక కారణాలవల్ల రెండు భాగాలుగా విభజింపబడింది.

"జెనీవా సభ అతి ప్రధాన కర్తవ్యాలలో ఒకటి, కొరియా ఐక్యత ఏర్పడటానికి ఆ ప్రజలకు సహాయపడటం.

"కాని అమెరికా ఒత్తిడి వలన ఐ. రా. స. ఒకపక్షాన్ని మాత్రమే బలపరచింది."

ఆ తర్వాత కొంతసేపు ఆసియాలోని ప్రధాన రాజకీయ మార్పుల గురించి మాలొటోవ్ మాట్లాడాడు. అందులో చైనా అతి ప్రాముఖ్యస్థానం వహించిందని అన్నాడు.

మాలొటోవ్ యింకా యిలా అన్నాడు:

"ఇండియా, ఇండోనీషియా, బర్మా పాకిస్తాన్‌లాంటి ఆసియా దేశాలు ఈ సభలో పాల్గొనడంవల్ల చాలా లాభకారిగా వుండేది. కాని అవి ఇక్కడ పాల్గొనలేకపోవడం విచారకరం.

"అగ్రరాజ్యాలన్నీ అనగా ఫ్రాన్సు, బ్రిటన్, అమెరికా, చైనా, సోవియట్‌లు మొదటిసారిగా సమావేశమవుతున్న విషయాన్ని తక్కువ అంచనా వేయరాదు.

"ఈ సందర్భంలో ఆసియాలో అగ్రరాజ్యమైన చైనా ప్రజా రిపబ్లిక్ మన యీ సభకు చాలా తోడ్పడగలదు.

"చైనాతో మామూలు సంబంధాలను నెలకొల్పకుండా అనేక దేశాలను అడ్డగించారు. అమెరికా చైనాపట్ల దురాక్రమణ విధానం అవలంబించుతూంది. ఆసియా అంతటా దీని ప్రభావం వుంది."

చైనాపై అమెరికా విధించిన నిషేధాలు, ఐ. రా. స. నుండి వెలివేయడాలు, కొరియానుండి, ఫార్మోజా నుండి చైనా సరిహద్దులపై దండయాత్ర చేయడానికి బెదిరింపులూ మొదలైనవాటిని మాలొటోవ్ పేర్కొన్నాడు.

పసిఫిక్ దీవులలోను పాకిస్తాన్‌లోను సైనిక స్థావరాలు ఏర్పరచడాన్ని అమెరికా పాలకవర్గాలు దురాక్రమణ చేసేగ [illegible]యని, [illegible] అనడం వింతగా వుందని మాలొటోవ్ అన్నాడు.

మాలొటోవ్ ఇంకా ఇలా అన్నాడు.

"ఇండోచైనాలోని కీలుబొమ్మ ప్రభుత్వాన్ని రక్షించే సాకుతో ఆగ్నేయ ఆసియాలో ఇటీవల సైనిక కూటమి నిర్మించడానికి అమెరికా ప్రయత్నించుతోంది.

"కాని ఆసియాదేశం ఒక్కటికూడా ఈకూటమిలో చేరడానికి ఇష్టపడటం లేదు.

"తమ సమస్యను తామే పరిష్కరించుకొనడానికి ఆసియా ప్రజలకు హక్కుండాలనే ప్రాతిపదికపై పనిచేస్తే కొరియా సమస్య పరిష్కారం అవుతుంది.

"జెనీవాసభ విజయం పొందితే, ఆసియాకు చెందని ఇతర సమస్యను కూడా పరిష్కారం కాగలవు.

"ఆసియాలో శాంతి సాధించేందుకు ఆసియా దేశాల ప్రయత్నాలను ఐక్యపరచాలని చైనా ప్రధాని అన్నాడు.

"ఈ అభిప్రాయంతో సోవియటు పూర్తిగా ఏకీభవించుతోంది. యూరప్‌లోను, ఆసియాలోను, ప్రపంచమంతటా శాంతి స్థిరపడటానికి అవసరమైన చర్యలు తీసుకోడానికి యూరప్ దేశాలు ఆసియా దేశాలు కూడా ప్రయత్నించాలి."

ఉత్తర కొరియా సూచనలకు ఆస్ట్రేలియా విముఖత

జెనీవా సభలో

జెనీవా, ఏప్రిల్ 29

జెనీవా సమావేశంలో నేడుకూడా కొరియాపై చర్చ జరిగింది. కొరియాపై ఇది మూడవ సమావేశం. నేటి సమావేశానికి సయామ్ విదేశాంగ మంత్రి వాన్ వరాధిప్ అధ్యక్షతవహించాడు.

ఆస్ట్రేలియా విదేశాంగమంత్రి రిచర్డ్ కేసీ మొదట మాట్లాడాడు.

కేసీ ఇలా అన్నాడు.

"కొరియా అంతటా ఎన్నికలు జరగడానికి దక్షిణ కొరియా అంగీకరించుతుందని ఆశించుతున్నాను.

"ఉత్తర కొరియా సూచనలను చాల జాగ్రత్తగా పరిశీలించాలి. కాని అనేక అంశాలలో ఉత్తర కొరియా సూచనలు సమగ్రంగా లేవు.

"ఉత్తరకొరియా సూచించిన సమిష్టి కమిషన్ ఏ ప్రాతిపదికపై నిర్మింపబడుతుంది? ఉత్తర, దక్షిణ కొరియాల జనాభానుబట్టి ఎన్నుకోబడిన శాసన సభా ప్రాతినిధ్యాలను అనుసరించా? లేక మరో విధంగానా?"

ఆరు నెలలలో విదేశ సైన్యాలన్నీ [illegible] పోవాలనే సూచన "మోసపుచ్చే సూచన" అని కేసీ అన్నాడు.

కేసీ ఇంకా ఇలా అన్నాడు:

"చైనా సైన్యాల ఉపసంహరణ అంటే అయిదు మైళ్ళకు మాత్రమే. ఐ. రా. స. సేనల ఉపసంహరణ అంటే, 5 వేల మైళ్ళ దూరంపోవాలి.

"ఐక్య ప్రజాతంత్ర కొరియా ఏర్పడేవరకూ కొరియాలో ఐ. రా. స. సేనలుఉండాలి. అయినప్పటికీ సంతృప్తికరమైన ఒడంబడికకు ప్రాతినిధ్యాలలో ఏర్పడాలని కోరుతున్నాను. అంతర్జాతీయ పర్యవేక్షణ లేకుండా ఎలా స్వేచ్ఛా ఎన్నికలు జరుగుతాయి? కొరియా ప్రజలు తమలో తాము పరిష్కరించుకోవాలనే [illegible] గాదు. ఇటీవల ఏర్పడిన [illegible] ద్వేషభావం [illegible] ఈ సూచన పనికిరాదు."

ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేయడానికి ఎంతకాలం పడుతుందో ఉత్తరకొరియా ప్రతినిధి తెలియజేయలేదు, ప్రత్యర్థి [illegible] సూచనలు [illegible] కేసీ అన్నాడు.

కొరియా సమస్య పరిష్కారానికి డల్లెస్ విముఖత

"ప్రవదా" విమర్శ

లండన్, ఏప్రిల్ 29

జెనీవా సమావేశంలో కొరియా సమస్యపై అమెరికా విదేశాంగమంత్రి చేసిన సూచనలు కొరియాలో శాంతియుత పరిష్కారాన్ని కోరని వ్యక్తులు చేసేవి మాత్రమేనని, నేడు సోవియట్ కమ్యూనిస్టుపార్టీ పత్రిక "ప్రవదా" వ్రాసింది.

"ప్రవదా" పత్రిక జెనీవా విలేఖరి వ్రాసిన వ్యాసాన్ని సోవియట్ వార్తా సంస్థ "టాస్" ప్రచురించింది.

ప్రవదా ఇంకా ఇలా వ్రాసింది:

"కొరియా యుద్ధంలో జోక్యం కలుగచేసుకొని దీర్ఘకాల యుద్ధంలో లక్షానలక్షలవేలమంది సైనికులను నష్టపోయినఅమెరికాసైన్యం సాధించజాలని విషయాన్ని, జెనీవాలో సాధించగలమని డల్లెస్ అనుకొంటున్నాడంటే అతనికి మతిపోయిందని భావించాలి."

కొరియా ప్రజారిపబ్లిక్, చైనా ప్రజారిపబ్లిక్, సోవియట్ యూనియన్‌లకు వ్యతిరేకంగా దురాక్రమణ చేయడానికి దక్షిణ కొరియాను ఒక వేదికగా తయారుచేయాలని డల్లెస్ కోరుతున్నాడని "ప్రవదా" విమర్శించింది.

బొంబాయి, ఏప్రిల్ 29

వేతనాల విషయంలో ఫ్యాక్టరీ కార్మికునికి, వ్యవసాయ కూలీకి మధ్య, స్త్రీ - పురుష కార్మికులకు మధ్య విచక్షణ చూపరాదని లేబర్ అప్పెలేట్ ట్రిబ్యునల్ నిన్న తీర్పు చెప్పింది.

పంచదార ఫ్యాక్టరీల విషయంలో ఈ తీర్పు చెపుతూ, ట్రిబ్యునల్ పై విధంగా పేర్కొన్నది.

నిజ మెరుపు

శశవిషాణం

చిట్టీత పండెరుపు
చిలక ముక్కెరుపు
పసిపాప నవ్వెరుపు
పాలబుగ్గెరుపు

తొలిచూపు తాకిన
ఎలనాగ చెకిట
సిగ్గుదొంతర లెరుపు
సిందూర మెరుపు

పొగడాల దండెరుపు
పొద్దుపొడు పెరుపు
రానున్న రేపెరుపు
ప్రాణశక్తెరుపు

మూడులోకాలలో
మూడుకాలాల
నిలిచుండు నిజ మెరుపు
నిండు మనసెరుపు

శ్రమఎరుపు క్షమఎరుపు
శాంతిసుఖ మెరుపు
పాటుపడువారి
పోరాటాలు ఎరుపు

స్నేహభావము ఎరుపు
జిజ్ఞాస ఎరుపు
తెంపరితన మెరుపు
తెలుగుతన మెరుపు

నిండు గుండెలలోన
నిత్యసత్యము పుంచి
రానున్న రేపుకప్పిన
పచ్చడము చించి

పాటుపడువారి
పోరాటాలలోనుంచి
[illegible] ఎగిరేటి
బావుటా ఎరుపు !

ఎరుపన్న ఎందుకో
నీకింత బెరుకు ?
వెలుగన్న ఎందుకో
నీకింత ఉలుకు !

మోకాలు అడ్డితే
వేకువాగేనా
మూకుడు మూసితే
నిజము దాగేనా ?

ఎలనాగ నునుసిగ్గు
ఏ భూమిదోయి ?
పసిపాప చిరునవ్వు
ఏ జాతిదోయి ?

పొద్దుపొడుపునకు
సరిహద్దెక్కడోయి ?
నిత్య సత్యంపుట్టు
కేప్పూరభాయి ?

శ్రామికుల నుదిటి
స్వేదాంబు మౌక్తికమాల
ఏ రేవునుంచి
ఓడెక్కెనో చెపుతావ ?

నరజాతి ఆశ;
అంబరసీమ నెగిరేటి
ఎర్రన్ని బావుటా
ఎవరిదో నంటావ !

ఎర్రజండానాది
ఈభూమినాది
నిండు హృదయం నాది
స్నేహితము నాది

[illegible]
పాలబుగ్గ[illegible]
[illegible]
భవిష్యత్తు నాది !

భారతదేశ సైనిక రహస్యాల భోగట్టా సేకరిస్తున్న అమెరికన్ గూఢచారులు

జర్నలిస్టుఅని వ్యవహరిస్తున్న స్త్రీ ఉదంతం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30

అమెరికన్ గూఢచారులు అనేకరూపాల్లో భారతదేశానికి వచ్చి మన సైనికరహస్యాలనూ, మనదేశానికి సంబంధించిన ఇతర భోగట్టాను సేకరించుకొని వెడుతున్నట్లు ఇటీవల ఇక్కడ బయటపడిన ఒక అమెరికన్ యువతి ఉదంతంవలన తెలియవచ్చింది.

ఈనెల 12వ తేదీన ఢిల్లీలోని పశ్చిమ కమాండ్ మిలిటరీ ప్రాంతంలో ఒక అమెరికన్ స్త్రీ ఒక ఆఫీసునుండి మరొక ఆఫీసుకు తిరుగుతూ ఉండగా ఒక కెప్టెన్ చూడడం సంభవించింది. ఆమె అంతకు ముందు మూడు గంటలుగా ఆ ప్రాంతంలో తిరుగుతున్నా ఎవరూ ప్రశ్నించలేదు. అనుమతి పత్రం లేకుండా సివిలియన్ లెవరూ మిలిటరీ ప్రాంతంలోకి రాకూడదు. కెప్టెన్ పేరడిగితే ఆమె చెప్ప నిరాకరించింది. ఏ పనిమీద వచ్చినది కూడా వెల్లడించడానికి నిరాకరించింది. తనకు ఒక జనరల్‌తో సన్నిహిత పరిచయమున్నదని ఆమె చెప్పగానే పేరు చెప్పమని ఒత్తిడి చేయకుండానే ఆ కెప్టెన్ ఆమెను పంపించి వేశాడు.

కాపలావాని చేతిలో వందరూపాయల నోటు

ఈ వార్తను బయట పెట్టిన పార్లమెంటు సభ్యుడు శ్రీ గురుపాదస్వామి మాట్లాడుతూ ఆమెను చూసిన కెప్టెన్ ఆమె తన పేరు చెప్పేటట్లు ఎందుకు చేయలేకపోయాడని తన ఆశ్చర్యాన్ని వెలిబుచ్చారు. ముఖ్యంగా అనుమతిపత్రం లేనప్పుడు పేరు బయట పెట్టకుండా వదలిపెట్టకలసింది కాదన్నారు.

అదే రోజున మిలిటరీ ప్రాంతానికి కాపాలా కాస్తున్న సెంట్రీ ఒకడు మరునాడు కాంటీన్‌లో వందరూపాయలు నోటు మార్చడాన్ని తాను చూశానని శ్రీ గురుపాదస్వామి తెలిపారు.

ఈ విషయమంతా ప్రధాన మంత్రి దృష్టికి తీసుకొని రాబడింది. ఆయన ఈ వ్యవహారాన్నంతటినీ విచారణ జరిపిస్తానని వాగ్దానం చేశారు.

ఆనాటినుండి ఈ అమెరికన్ యువతి ఎవరా అని అందరూ ఆశ్చర్యపడుతున్నారు. విచారించగా ఆమెపేరు బెట్టీజెన్ సుడార్డ్ అని తెలిసింది. తాను ఒక పత్రికా రచయితనని చెప్పుకొంటూ తిరుగుతోంది. భారత సేవక్ సమాజ్ కేంద్ర కార్యాలయంలో గౌరవ సేవకురాలుగా పనిచేస్తున్నదని కూడా తెలియవచ్చింది.

సాగిస్తున్న "కార్యక్రమం"

సేవక్ సమాజ్ కార్యాలయంలో భోగట్టా చేయగా ఆమెను గురించిన మరికొన్ని వివరాలు తెలిశాయి. ఆమె తనకుగల అందచందాలు, చొరవ ద్వారా సమాజ్ పత్రిక అయిన "సేవక్"కు చందాదారులను చేర్పించుతూ వుండటం మూలంగా సమాజ్ అధికారుల విశ్వాసాన్ని సంపాదించుకొన్నది. కాని ఆమె చేర్పించిన చందాదారులకు పంపించిన పత్రికలు ఆఫీసుకే తిరిగి పంపించబడటంతో సేవక్ సమాజ్ మేనేజర్లలో సందేహాలు బయలుదేరినాయి. ఈమె చేర్పించిన న్యూఢిల్లీలోని మరికొంతమంది చందాదార్లు తాము చందాకట్టనేలేదని ఆఫీసుకు తెలియచేయడం సంభవించింది. దీనినంతటినిబట్టి ఈ అమెరికన్ యువతి తన స్వంత జేబులోనుండే కొన్ని పేరులకు చందాలు కట్టి ఎంతో చొరవతో పత్రికకు చందాదార్లను చేర్పించుతున్నానని సమాజం అధికారుల మన్ననలను బడసి ఆ విధంగా వారి విశ్వాసాన్ని పొందడానికి యత్నిస్తున్నట్లు బయటపడింది.

డైరీ తెలుపుతున్న భోగట్టా

తన డైరీ నొకదానిని పొరపాటున సేవక్ సమాజ్ ఆఫీసులో వదలిపెట్టి వెళ్ళినందుకు అమెరికా యువతి అసలు వ్యవహారం చాలవరకు బయటపడింది.

ఆ డైరీని పరిశీలించితే ఆమెకు మన రక్షణశాఖతో చాలసంబంధం ఉన్నట్లు బయటపడుతోంది. ఈ డైరీలో చాల మంది భారతీయ మిలిటరీ ఆఫీసర్ల అడ్రసులేగాక, కొంత మంది కాంగ్రెసు పార్లమెంటు సభ్యుల అడ్రసులు కూడా ఉన్నాయి.

అందచందాలతో చొరవతో తిరిగే ఈ అమెరికన్ యువతికి మన రక్షణ శాఖలోగల అంతరంగిక పరిచయానికి నిదర్శనం డైరీ సేవక్ సమాజం ఆఫీసులో పడిపోయిన మరునాడే కనబడింది.

మన సైన్యంలో ఒక కమాండ్‌కు చెందిన ఒక కెప్టన్ ఆదరాబాదరా సేవక్ సమాజం ఆఫీసుకు పరుగెత్తుకొనివచ్చి ఆ డైరీ ఇచ్చి వేయమని కోరాడు. అలా కోరడమేకాదు; ఇవ్వకపోతే ఏమి చేస్తానో చూడు అని బెదరించాడు కూడా. దానిపై ఆఫీసర్లు ఆ డైరీ కేంద్ర మంత్రివర్గ సెక్రటేరియట్‌కు పంపించబడిందనీ, దానిని అక్కడ నుండి తీసుకోవచ్చునని జవాబు చెప్పగానే ఆ కేప్టన్ కాలికి బుద్ధి చెప్పాడు.

ఆ డైరీని బట్టి ఆమె యుగోస్లోవేకియా, టర్కీ, పాకిస్తాన్, ఇరాన్‌లలో పర్యటించి ఇండియాకు వచ్చినట్లు తెలుస్తోంది. సింహళం, బర్మా, ఇండోనీషియాలు వెళ్ళాలని ఆమె ఉద్దేశించినట్లుకూడా ఆ డైరీ తెలుపుతోంది.

జాగ్రత్త తీసుకోవలసిన ఆవశ్యకత

డైరీకోసం వచ్చిన కెప్టన్ సోదరుడు సేవక్ సమాజంలో ఒక పెద్ద ఆఫీసరు. ఆయన వుద్యోగాన్నుండి వెంటనే తొలగించబడ్డాడు. కెప్టెన్‌కు, అతనితోపాటు మరికొందరికి త్వరలో ఉద్వాసన జరుగవచ్చు.

అమెరికా సామ్రాజ్యవాదులు ఇండియాను ఏదోరకమైన యుద్ధంలోకి ఈడ్వాలని కుట్రసలుపుతున్నట్లు ఈ ఉదంతం తేటతెల్లం చేస్తోంది. భారత ప్రజలందరికీ ఇదొక హెచ్చరిక. అమెరికా నుండి ఇండియాకు వచ్చే ప్రతి ఒక్కడినీ క్రైస్తవ మతగురువులు, సాంఘిక సేవకులు, విద్యావేత్తలు, పర్వతారోహకులు - ఏ పేరుతో, ఏ వంకతో వచ్చినా అత్యంత జాగ్రత్తతో ఒక కంట కనిపెట్టి ఉండాలని ఈ సంఘటన హెచ్చరించుతోంది.

అమెరికన్ యువతి బెట్టీజేన్ తన ఉదంతం బయట పడిన తరువాత ఇండియానుండి ఏదోవిధంగా బయటకు ఉడాయించాలని ఆత్రంతో అవకాశం ఎదురుచూస్తోంది. (పి. పి.)

ఉత్తర ప్రదేశ్‌లో ప్రస్తుతం 118 అమెరికన్ మత ప్రచార సంస్థలున్నవని ముఖ్య మంత్రి గోవిందవల్లభపంత్ తెలిపారు.

◆ ◆ ◆

కేంద్ర ఆహార మంత్రి శ్రీ రఫీ అహ్మద్ కిద్వాయి రంగూన్ నుంచి గురువారంనాడు మద్రాసు చేరుకున్నారు.

ఆగ్నేయ ఆసియా సభలో పాకిస్తాన్ అడ్డుపుల్లలు

ఇండోచైనా సమస్యపై ఒడంబడిక విఫలత

కొలంబో, ఏప్రిల్ 29

ఇండోచైనా సమస్యపై ఆగ్నేయ ఆసియా ప్రధానుల సభ నేడు పాకిస్తాన్ ప్రతికూలత మూలంగా ఒక ఒడంబడికకు రాలేక విఫలమైంది.

ఇండోచైనా సమస్యపై ప్రతిపాదించిన తీర్మానానికి పాకిస్తాన్ కట్టుబడి వుండదని ప్రధాని మహమ్మదాలీ స్పష్టపరచినందున ఈ తీర్మానం విఫలమైందని తెలుస్తుంది.

ఇండోచైనాలో జోక్యంకలుగచేసుకోరాదని అమెరికా, సోవియట్ యూనియన్, బ్రిటన్, చైనాలు ఒక ఒడంబడిక చేసుకోవలసినదిగా ఆగ్నేయ ఆసియా ప్రధానుల సభ అభ్యర్థించాలనే విషయమై, పాకిస్తాన్ ప్రధాని విభేదించాడు.

ఇండోచైనాలో ఇతరులజోక్యంపనికిరాదని మొదట జరిగిన చర్చలలో సూత్రప్రాయంగా పాక్ ప్రధాని అంగీకరించినా పైన చెప్పిన నిర్దిష్ట ప్రతిపాదనవచ్చేసరికి అతడు వ్యతిరేకించాడు.

తొలి వార్తలు

కొలంబో, ఏప్రిల్ 29

ఇండోచైనా, హైడ్రోజన్ బాంబు, వలసవిధానం, కమ్యూనిజం మొదలగు సమస్యలపై నేడు ఆగ్నేయ ఆసియా ప్రధానులసభ చర్చించింది. ఇవాళ సభ ముగిసిన తర్వాత వెలువడిన అధికార ప్రకటన, రేపుకూడా ఈవిషయాలపై చర్చించుతారని తెలియజేసింది.

ఉదయం ఇండోచైనాపై మాత్రమే చర్చించారు.

ఈ చర్చలలో ఒక ప్రక్క పాకిస్తాన్‌కు మరో ప్రక్క భారతదేశం, ఇండోనీషియా, బర్మాలకు అభిప్రాయ భేదం కల్గినట్లు తెలుస్తాంది. తక్షణ యుద్ధ విరమణ, ఇండోచైనాకు స్వాతంత్ర్యం ఈయాలి అనే విషయాలపై ఏకాభిప్రాయమేవుంది. ఇతరుల జోక్యం పనికిరాదనే విషయంలో పాకిస్తాన్ ప్రధాని ఆభాగానికి అభ్యంతరపెట్టారు. దానిపై చర్చ ఇంకా ముగియకముందే సభ మరునాటికి వాయిదాపడింది.

వలస విధానం అంతరించాలని,వలస పరిపాలనను ఉపసంహరించాలనిఅందరు అంగీకరించారు. అలాగే హైడ్రోజన్, ఆటంబాంబుల ప్రయోగాలను కూడ నిలిపివేస్తూ యథాస్థితి ఒడంబడిక చేసుకోవాలన్నదానికి కూడా అంగీకరించారు. కమ్యూనిజంపై తీర్మానంలో మాత్రం అభిప్రాయభేదాలు వచ్చినట్లు తెలుస్తాంది.

కమ్యూనిజంపై తీర్మానాన్ని సింహళం తయారుచేసింది. పాకిస్తాన్ దానిని ప్రతిపాదించింది. ఆ తీర్మానం యిలా వుంది:

"అంతర్జాతీయ కమ్యూనిజం, ఈ ప్రాంతంలోని ప్రజాస్వామ్య విధానానికి అత్యంత ప్రధానమైన ప్రమాదకారి. దానిని ఎదుర్కోవాలంటే ప్రజాతంత్రంలో విశ్వాసాన్ని ప్రకటించాలి. అంతర్జాతీయ కమ్యూనిజం జోక్యం కల్పించుకోకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలి. ఈవిషయమై ఈ సభ జెనీవా తీర్మానాన్ని అమలు పెట్టేందుకు పరస్పరం భోగట్టాను తెలియజేసుకోడం."

ఈతీర్మానాన్ని భారతదేశం, ఇండోనీషియాలు వ్యతిరేకించాయి. ఏ అగ్రరాజ్యకూటమితోనూ చేరబోమని చెప్పిన విధానానికి ఈ తీర్మానం విరుద్ధమని భారతప్రధాని నెహ్రూ చెప్పిన దానిని ఇండోనీషియా ప్రధాని బలపరచాడని తెలుస్తూంది.

వలసవిధానంతో పోల్చిచూస్తే, కమ్యూనిజమే ఎక్కువ ప్రమాదకరమని మహమ్మదాలీ వాదించాడట. అలిగి ఈ తీర్మానాన్ని రేపటిసభలో చర్చించుతారు.

కామన్వెల్తుదేశాలకు ఈడెన్ లేఖ

కొలంబో, ఏప్రిల్ 29

భారతదేశ, పాకిస్తాన్, సింహళ ప్రధానులకు బ్రిటిషు కమిషనర్ నేడు బ్రిటిషు విదేశాంగ మంత్రి ఈడెన్ వ్రాసిన లేఖను అందించాడు.

ఆగ్నేయ ఆసియాదేశాల సభను గురించి, ఇండోచైనా గురించి ఈడెన్ ఈ లేఖలో వ్రాసినట్లు తెలుస్తాంది.

జెనీవా సభలో తీసుకునే నిర్ణయాలను అమలు పరచుటలో పశ్చిమ దేశాలకు కామన్వెల్తు దేశాలు తోడ్పడాలని ఈడెన్ కోరాడని తెలుస్తాంది. జెనీవా సభ విషయాలను ఎప్పటికప్పుడు ఈ దేశాలకు తెలియజేస్తామని కూడా ఈడెన్ వ్రాశాడట.

ఇండోచైనా గురించి జరిగే శాంతి ఒడంబడికలకు కామన్వెల్తుదేశాలు హామీ ఇస్తాయా అని ఈడెన్ అడిగినట్లు తెలుస్తాంది.

ఆంధ్రదేశ మంతటా
2వ వారం

బూరెల మూకుడు

కొంటె కృష్ణయ్య

రాజయోగం
ఆబాలగోపాలంచే కొనియాడబడుతున్న
ప్రకాశ్ వారి పిల్లల చిత్రం
బాలానందం

ప్రకటన

1-5-54 తేదీనుండి తీసుకొను జీవిత భీమా దరఖాస్తులపై చెల్లించవలసిన ప్రీమియములు విశేషముగా తగ్గింపబడినవని తెలియజేయుటకు సంతసించుచున్నాము.

మార్కెట్టులోకి అనుభవములో కలిగిన అనుకూల పరిస్థితుల వలనను, హెచ్చు వడ్డీలు వలన కలిగిన ప్రయోజనము వలనను ఈ సౌకర్యము మా క్రొత్త పట్టాదారులందరకు అందజేయగలుగుచున్నాము.

భూపతి సుబ్రహ్మణ్యం
జనరల్ మేనేజరు

తీరు - తెన్నులు

పాకిస్తాన్ పాలకులు తమ దేశాన్ని ఆంగ్లో అమెరికన్ గూఢచారులకు ఇక్కాని వేటభూమిగా ప్రసాదించారు. ఆంగ్లో - అమెరికన్ సామ్రాజ్యవాదులు పాకిస్తాన్‌పై పెత్తనం ఎవరుసాగించాలనా అని పోటీలు పడ్డారు. లియాఖత్ అలీ ఖాను హత్యకు యీ కుట్రలాటే కారణం. అంతటితో ఆగక హత్యకు కారకులెవరో పరిశోధించేందుకు "మేమంటే మే మని" స్కాట్లండుయార్డు (ఇంగ్లండు) గూఢచారులు, అమెరికన్ యఫ్. బి. ఐ. గూఢచారులు కుస్తీలు పట్టారు.

"యాంకీ" (అమెరికా) అన్న ముందు జాన్‌బుల్ (ఇంగ్లండు) ఎప్పుడూ చిత్తవుతూనే వున్నాడు. అట్లాగే యఫ్. బి. ఐ. ముందు స్కాట్లాండు యార్డు పరాజయం పొందింది. దొంగ చేతికే తాళంచెవిచ్చినట్లు పాకిస్తాన్ పాలకులు దేశాన్ని బాకుపోట్లకూ బందిపోటుకూ పేరుమోగిన యఫ్. బి. ఐ. చేతుల్లో పెట్టారు.

ఇక యఫ్. బి. ఐ. రాజ్యం విచ్చలవిడిగా సాగుతోంది. ప్రతిరాజకీయవేత్త ప్రతిపక్షసభ్యుడూ యఫ్. బి. ఐ. నిఘాకు గురవుతున్నాడు. ఎప్పుడు ఎక్కడబడితే అక్కడ ఏ యింటినిబట్టినా సోదా చేయవచ్చు. చివరకు ప్రధాన మంత్రి మహమ్మదాలీకి అంగరక్షకుడుగా కూడా యఫ్. బి. ఐ. వాళ్ళే వుంచారు.

ప్రజలకు దూరమైన పాకిస్తాన్ నవాబులు దేశాన్ని అమెరికన్ సామ్రాజ్యవాదుల పాదాక్రాంతం చేస్తున్నారు. సోవియట్, చైనా, ఇండియాలకు మధ్యస్థంగానున్న పాకిస్తాన్‌ను యాంకీ సామ్రాజ్యవాదులు తమ కుట్రలకు రంగస్థలంగా చేసుకుంటున్నారు. కన్నుల పండుగగా రకరకాలుగా ప్రతినిధి వర్గాలు వచ్చిపోతున్నాయి. పాలక యంత్రంలోనూ సైనిక యంత్రంలోను గోతులు తవ్వుతున్నారు. "పార్లమెంటరీ ప్రజాస్వామిక మున్న" సామ్రాజ్యవాదులతో తగాయిదా పెట్టుకోవద్దనీ, పొత్తుపెట్టుకోమనీ కోరే ప్రజా-సోషలిస్టులూ, అంబేద్కర్లూ, ఆచార్య రంగా మన దేశానికీ యిదే దుర్గతి పట్టాలంటారు!

◆ ◆ ◆

నేటికీ కాంగ్రెసుకు పుట్టిల్లుగా నున్న ఉత్తర్ ప్రదేశ్‌లో పంతు మంత్రివర్గం గృహచ్ఛిద్రంతో క్రిందిట్టు మీదిట్టవుతోంది. పంతు సంపూర్ణానందు ముఠాలమధ్య ఘర్షణతో మంత్రుల శాఖలు చేతులు మారుతున్నాయి.

పోలీసుమంత్రి సంపూర్ణానందు కుంభమేళా విషాదాంతానికి ఆధ్వర్యం వహించిన సమర్థుడు. దేశంగగ్గోలు పెట్టిం తరువాత విషయం బయటికొచ్చింతరువాత పోలీసుశాఖా ఉన్నతోద్యోగులంతా రాజీనామా లిచ్చారు. ఇందుకుతోడు మార్చి 31 న గోరక్‌పూర్ దగ్గరలో మందుగుండు పదార్థం ప్రేలి రైలుపెట్టెలోని 40 మంది చనిపోయారు. ఈమందుగుండు సామానును భారత కమ్యూనిస్టులు నేపాలు కమ్యూనిస్టులకో సంచేరవేస్తుంటే ప్రేలిందని ఒక కట్టంటు వేసి తప్పించుకో ప్రయత్నించారు సంపూర్ణానందు. కాని యీ స్టంటు పారలా. యేలినవారి పోలీసులే ఆ ప్రేలుడు పదార్థాన్ని రైల్వే అధికారులకుగూడా చెప్పకుండా కనీస జాగ్రత్తలు పాటించకుండా తీసుకుపోతూంటే ఈ ఘటన జరిగినట్లు బయటపడింది. ఈ నుసుడే కమ్యూనిస్టు వ్యతిరేకబూటకప్రచారసంస్థ ఒకటి బొంబాయి నుంచి అచ్చువేసిన చెత్తంతా వాస్తవం అని సాక్ష్యం చెబుతున్నాడు.

పోలీసు మంత్రిత్వం నుంచి ఈయన్ని తొలగించాలని కాంగ్రెసు శాసనసభ్యుల్లోనే కలవరం బయలుదేరింది. పంత్ ముఠాకు కలిసివచ్చింది. ఈయన చేతుల్లోంచి యీ శాఖను ఎత్తివేయబోతున్నారు.

◆ ◆ ◆

మన పాలకులూ ప్రజా సోషలిస్టులూ యీ మధ్య భూదానం, శ్రమదానం, బుద్ధి దానం, భుక్తి దానం అని అష్టాదశ మహాదానాలు ప్రచారములో పెడుతున్నారు.

ఇందులో ఏ దానమూ లభ్యం గావటంలేదు. పాడుబడ్డ భూమినిచ్చి దానంచేసే సాధువు కనపడలేదు. ఐనా ఏ కాంగ్రెసు ప్రభుత్వమూ శాసనం ద్వారా భూదానాన్ని అమలు జరపటానికి పూనుకోలేదు. కాగా శ్రమదానాన్ని నిర్బంధంగానైనా అమలు జరిపి అగ్రతాంబూలం సంపాదించాలనుకున్నది పంతు మంత్రివర్గం. సంవత్సరానికి 24 రోజులు విధిగా 60 సంవత్సరాల లోపు వయసుగలవారంతా గ్రామ ఉమ్మడిపనిలో పాల్గొనాలనీ లేకుంటే రోజుకు రెండురూపాయలు చొప్పున చెల్లించాలనీ పంచాయితీ సవరణ బిల్లు నొకదానిని శాసన సభలో ప్రవేశపెట్టారు.

నిర్బంధంతో "శ్రమదానం" సంపాదించే ఈ "ప్రజాస్వామికత్వాన్ని" మానసి కాంగ్రెసు శాసనసభ్యులే గుండెలు బాదుకుంటున్నారు. ఒక కాంగ్రెసు శాసనసభ్యుడు, వెట్టిచాకిరీ చేయనందుకు తనతండ్రిని జమీందారీగూండాలు చావచితకకొట్టిన ఉదంతంచెప్పి యీ "వెట్టిచాకిరీబిల్లును" ఎత్తివేయాలని కాంగ్రెసు పార్టీలో గోలపెట్టాడట.

భళీ! కాంగ్రెసుమార్కు ప్రజాస్వామికం ఎంత మహోన్నతిస్థాయి నందుకుంటోంది!

◆ ◆ ◆

మనమూ ప్రణాళికలపై ప్రణాళికలు వేసుకొని పురోగమిస్తున్నాం. మొదటి పంచవర్ష ప్రణాళిక పని పూర్తి అయినట్లే అంచనా వేసి రెండవ పంచవర్ష ప్రణాళిక ఫలితాలు జూపి ఆర్థిక మంత్రి దేశముఖ్ "సర్వేజనాస్సుఖినోభవంతు" అంటున్నారు.

ఇదంతా పేలపిండి కథలా వున్నది. మొదటి ప్రణాళికకే యింతవరకూ ముక్కూ మొఖంలేదు. మొదట ప్రణాళిక ప్రకారం 2244 కోట్ల రూపాయలు అయిందేండ్లలో ఖర్చు పెట్టాలి. ఈ మొత్తంలో దేశంలో దొరికే డబ్బు సగానికి సగమే. విదేశీ పెట్టుబడి 230 కోట్లే సాధ్యపడ్డదంటున్నారు. పోతే మిగతా 900 కోట్ల డబ్బు ఎక్కడనుంచి రావాలని ప్రశ్నవస్తే కరెన్సీ అచ్చు గుద్దుదామనుకొంటున్నారు. నోట్ల ముమ్మరంతో ధరలు పెరిగి జీవితాలు తారుమారు గావటం అనుభవించే వున్నాంగదా!

అసలు యీ నిర్మాణ కార్యక్రమాలకు బడ్జెటులో డబ్బు కేటాయించటమే గాని ఖర్చుపెట్టటం నిర్మించటం జరగటం లేదనికూడా పార్లమెంటు చర్చలు వెల్లడిస్తున్నాయి. 1952-53 వ సంవత్సరంలో అనుకున్న దానికంటే 52 కోట్లు తక్కువ ఖర్చు జేశారు. ఇక 53-54 లో ఆ రకంగా ఎంతున్నదో యింకా తేల్చి చెప్పలేదు. గత మూడు ఏళ్ళ పంచవర్ష ప్రణాళిక కాలంలోనూ 9 వందల కోట్లకు మించి ఖర్చుజేయలేక పోయిన ప్రభుత్వం, వచ్చే రెండేళ్ళలో 1344 కోట్లు ఎక్కడనుంచి తెస్తుంది? నోట్లు అచ్చుగుద్దితే మాత్రం యింత ఖర్చుపెట్టి నిర్మాణ కార్యక్రమం ఎలా కొనసాగింప కలుగుతుంది? కృష్ణపై ఒక పెద్దప్రాజెక్టు కడతామన్నారేగాని యింతవరకు కట్టేచోటే నిర్ణయించలేదుగదా! ప్రణాళికంతా యీ రకంగానే పూర్తవుతుందా? భారత ప్రభుత్వం అంచనాల నిచ్చెనవేసి ఆకాశ సౌధాన్ని విహారిస్తోంది.

◆ ◆ ◆

వినువీధుల విహరించటంలో అఖిల భారత ప్రభుత్వంకంటె రెండాకు లెక్కువే చదివింది ఆంధ్ర ప్రభుత్వం. ఇంతో అంతో వాళ్ళకొక ప్లానయినా వుంది. మనవాళ్ళకు అదీ వున్నట్లు కనబడదు.

ఆరునెలల జీవితంలో ఆంధ్రప్రభుత్వం అనేక వాగ్దానాలూ, శంకుస్థాపనలూ చేసింది అడిగిన దేనికదిగా విచారణకమిటీలనునిపుణులకమిటీలనుకొల్లలుగా వేసింది. ఈ వాగ్దానాలతోనూ, నియామకాలతోనూ అనేక సమస్యల్ని దాటవేసుకుంటూ వచ్చింది. శాసనసభలో గడ్డు సమస్య వచ్చినప్పుడల్లా అంబులపొది నుండి ఒక వాగ్దానాన్నో కమిటీనో ప్రయోగించి గండం గడుపుకుంటూ వచ్చింది.

ఆచరణ శూన్యంగా ఆరు నెలలు కాలం గడిచిపోయింది. ఇంకెంత కాలం సాగుతుందీ పురోగమనం? బహిరంగంగా చేసిన వాగ్దానాలు పరీక్షకూ, వేసిన కమిటీల రిపోర్టులు పరిశీలనకూ వచ్చేసరికి మన మంత్రివర్గం తిరోగమనం చిత్తగించాల్సిన స్థితి వస్తోంది. చుక్కకుంకుతోంది.

రాజధాని తీర్మానంమీద పబ్బం గడుపుకునేందుకు చేసిన వాగ్దానం నెరవేరకపోయేసరికి హైకోర్టు తీర్మానం తల్లక్రిందులైంది. నీరా యిస్తామనీ, రామమూర్తి కమిటీ రిపోర్టును శాసన సభ ముందుపెట్టి సభా తీర్మానాన్ని అమలు పరుస్తామనీ వాగ్దానం చేసి క్రితంసారి ఎక్సైజు డిమాండు ప్యాసు చేయించుకున్నారు. కాలచక్రం గిర్రున తిరిగి మళ్ళీ శాసనసభా సమావేశం మీద పడుతోంది.

ఇంతలో ఒక ప్రకటనలో ఉప ముఖ్యమంత్రి సంజీవరెడ్డిగారు యీ కమిటీలు వేయటం అంతా నాటకమే ననే సారాంశం తేల్చిచెప్పారు. "ఒక్క రామమూర్తి కమిటీకేమిటి? కాంగ్రెసు సాంప్రదాయంలో అన్ని కమిటీలకూ అదేగతి పట్టింది పొమ్మ" న్నారు. వేకమీషన్, సుబ్రహ్మణ్యం కమిటీల సిఫార్సుల్ని పేర్కొని సోదాహరణంగా యీ సాంప్రదాయాన్ని రుజువుచేశారు. వినేవాళ్ళ తెలివి తక్కువగాని కమిటీల్ని ఎందుకువేస్తారో పాలకులకు తెలియదంటారా?

అన్నిరోడ్లూ రోమునగరానికే దారి తీసినట్లు అన్నిశక్తులూ ఆంధ్రప్రభుత్వాస్తమయానికే పనిచేస్తున్నాయి. గత ఎన్నికల్లో ఓడిపోయిన అతిరథ మహారథులువూడగొట్టిన నాటిదుంపలై ఆంధ్ర కాంగ్రెసు నాయకత్వంలో కూర్చున్నారు. వస్తే ఏదైనా రావటం గొప్ప యింత కన్నా చెడేదేమీలేదనే వూపుమీదున్నారు. మంత్రివర్గంలో నున్న కాంగ్రెసు నాయకులు పదవీ రక్షణార్థం నీరావరకూ మెత్తబడినా వీళ్లు మాత్రం వూరుకోనిచ్చేలాలేరు. ఇటు వీళ్ళబాధ అటు మంత్రివర్గంలో కుమ్ములాట పెట్టుకోలేక మద్యపాన నిషేధం సిసలుగా అమలు జరపాల్సిందేననే ధోరణికి వచ్చారు. ప్రజలకు అవసరమైన అనేక పనుల్లో చేసిన సేవ ఎటూ లేదు. మద్యపాన నిషేధాన్నయినా పట్టుకొని వ్రేళ్లాడితే ఆచరణతో నిమిత్తం లేకుండా నీతి సూత్రాలు వల్లించే ఛాందసులూ, మద్యపాన నిషేధంతో బాగుపడే లంచగొండి ఉద్యోగులూ దొంగ వ్యాపారులూ అయినా సపోర్టు చేస్తారని ఆశిస్తున్నట్లుంది. చెప్పుకునేందుకు ఒక నీతి అయినా తమకు మిగులుతుందని భ్రమిస్తున్నట్లున్నారు.

ఆచరణలో అరిష్టదాయకంగా పరిణమించిన మద్యనిషేధానికి వచ్చే శాసన సభలో ఓటమి ఎటూ తప్పక పోవచ్చు. ముందుగానే భయపడి ప్రకాశంపంతులుగారి మంత్రివర్గం ఒకవేళ పన్నులబిల్లుల్ని తీసుకురాకపోయినా యితర సమస్యల మీద ఓటమీ, ప్రభుత్వ పతనమూ అనివార్య మేననిపిస్తోంది.

— "కిశోర్"

భారతదేశంలో విదేశీ సైనిక స్థావరాలు

వాటికి తావివ్వకుండా నెహ్రూ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి

రెంటపాళ్ళ, ఏప్రిల్ 28

భారతదేశంలో సామ్రాజ్యవాదుల యుద్ధ యత్నాలకుగాని, సైనిక స్థావరాలకుగాని తావు లేకుండా చేసేవిధంగా ప్రజానీకం నెహ్రూ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని శాసన సభ్యులు శ్రీ కొల్లా వెంకయ్యగారు ఇక్కడ జరిగిన బహిరంగసభలో విజ్ఞప్తి చేశారు.

సత్తెనపల్లి తాలూకా రెంటపాళ్ల గ్రామంలో భారత కమ్యూనిస్టుపార్టీ ఆదేశానుసారం 25 వ తేదీ రాత్రి 9 గంటలకు 'ఆసియాదినోత్సవం' జరిగింది. బహిరంగ సభకు శ్రీ మక్కెపాటి మస్తానురావుగారు అధ్యక్షత వహించారు. సభకు పూర్వం గ్రామంలో జరుగుతున్న రాజకీయ పాఠశాల విద్యార్థులు స్థానిక యువకులు 100 మందితో ఊరేగింపు జరిగింది.

సభలో తాలూకా రైతు వ్యవసాయ కూలీ నాయకులు ఆసియా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. తరువాత జిల్లా కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి, శాసనసభ్యులూ అయిన శ్రీ కొల్లా వెంకయ్యగారు ఆసియాలో సామ్రాజ్యవాదుల కుట్రలు ఎంత గుర్తాంగా వున్నాయో వివరిస్తూ వుపన్యసించారు.

ఆయన యిలా అన్నారు:

"రెండవ ప్రపంచ యుద్ధానంతరం సోవియట్ రష్యా, నవచైనా, తూర్పు యూరపు ప్రజాస్వామిక దేశాల మార్కెట్లు అమెరికన్ సామ్రాజ్యవాదులకు లేకపోవటంతో, ఆసియా దేశాలలోని ఇండో చైనా, ఇండోనీషియా, కొరియా దేశాలను కబళించడానికే అమెరికన్ సామ్రాజ్యవాదులు కుట్రలు పన్నుతున్నారు. కొరియా, కాశ్మీరులలో అమెరికను సామ్రాజ్యవాదులు దెబ్బతినడంతో తాము ప్రత్యక్షంగా ఇండో చైనా యుద్ధంలో ప్రవేశించాలని ప్రయత్నిస్తున్నారు. పాకిస్తాన్‌తో సైనిక సంధి చేసుకున్నారు. అణుబాంబు ప్రయోగాలతో ప్రపంచ ప్రజానీకాన్ని భయపెట్టి లొంగదీయ ప్రయత్నిస్తున్నారు.

"కాని ప్రజాస్వామిక శక్తులు, శాంతి వుద్యమం రోజు రోజుకూ బలవత్తరం కావటంతో కొరియాలో అటంబాంబులు వేయ సాహసించ లేదు. అమెరికాతో సైనిక సంధి చేసుకున్న లీగ్ ప్రభుత్వం తూర్పు బెంగాలులో 9 స్థానాలు మాత్రం దక్కించుకొని మైనారిటీ పార్టీగా తయారైంది. రెండవ ప్రపంచ యుద్ధానంతరం సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు మలయా, ఇండో-చైనా, ఇండోనీషియాలలో అత్యున్నతస్థాయి నందుకున్నాయి. ఇండో-చైనాలో 90 వంతులు భూమి హోచిమిన్ నాయకత్వాన ఫ్రెంచి సామ్రాజ్యవాదుల నుండి విముక్తి అయింది. ఆసియాలో అభివృద్ధి అవుతున్న శాంతిశక్తులు ఆసియాలో సామ్రాజ్యవాదులకు శాశ్వత సమాధి కట్టుతారు.

"భారతదేశంలో సామ్రాజ్యవాదుల స్థావరాలకు, యుద్ధ ప్రయత్నాలకు అవకాశంలేకుండా ప్రజానీకం నెహ్రూ ప్రభుత్వంమీద ఒత్తిడి తీసుకురావాలి జెనీవా సమావేశం ఇండో - చైనాలో యుద్ధాన్ని, విరమింపచేటట్లు చేయాలని భారత ప్రజలు తీవ్రాందోళన చేయాలి" అంటూ తమ ఉపన్యాసం ముగించారు.

ఉరవకొండ

అనంతపురంజిల్లా ఉరవకొండ పట్టణ శాంతి సంఘం ఆధ్వర్యాన ఈ నెల 25 వ తేదీ సాయంకాలం "ఆసియా దినోత్సవ" సందర్భంలో మహాత్మా గాంధీ చౌకువద్ద బహిరంగసభ జరిగింది. శాంతి సంఘ కార్యదర్శి శ్రీ బంకా చినరామప్పగారు అధ్యక్షతవహించారు. రోజురోజుకు పెరుగుతున్న యుద్ధ వాతావరణం, సామ్రాజ్యవాదుల దుశ్చర్యలను గురించి, శాంతి ఆవశ్యకతను గురించి శ్రీబంకా చిన్నరామప్ప శ్రీయం. రమణారావు(ఎం. బి. బి.యస్. విద్యార్థి శ్రీ ఆర్. సి. మల్లేశ్వర్‌గార్లు ప్రసంగించారు. తర్వాత ఇండోచైనా సమస్యపై జెనీవా సభకు ప్రధాని నెహ్రూ ప్రతిపాదించిన షట్సూత్ర ప్రణాళికను సమర్థిస్తూ, చైనాకు ఐక్య రాజ్య సమితిలో సభ్యత్వమివ్వాలని కోరుతూ, గోవా, ఫ్రెంచి ఇండియా ఉద్యమాలను బలపరుస్తూ, హైడ్రోజన్, ఆటంబాంబులను నిషేధించాలని, అమెరికా-పాకిస్తాన్ మిలిటరీ ఒడంబడికను రద్దుచేయాలని కోరుతూ ఏకగ్రీవంగా తీర్మానాలు చేయబడ్డాయి.

యల్లాయపాళెం

నెల్లూరుజిల్లా కోవూరు తాలూకా యల్లాయపాళెం గ్రామంలో "ఆసియా దినోత్సవ" సందర్భంలో శ్రీ గుజ్జుల క్రిష్ణయ్యగారి అధ్యక్షతను బహిరంగ సభ జరిగింది. సభలో శ్రీయుతులు కాలేషా, మేకల మస్తానయ్యగార్లు మాట్లాడారు. సభలో అణ్వాయుధాలను నిషేధించాలని, నెహ్రూ సూచన మేరకు అగ్రరాజ్యాలు యధాస్థితి ఒడంబడిక చేసుకోవాలని తీర్మానాలు చేయబడ్డాయి. హైడ్రోజన్ బాంబు దుష్ఫలితాల్ని గురించి, శాంతి వుద్యమావశ్యకతను గూర్చి వివరిస్తూ వీధి వీధినా సెంటర్లలో బొకాలలో చెప్పబడింది.

కొత్తగూడెం

అఖిలభారత శాంతిసంఘం పిలుపు నందుకుని కొత్తగూడెంలో సింగరేణి కొలైరీస్ వర్కర్సు యూనియన్ తరఫున 'ఆసియా దినోత్సవం' జరుపబడింది.

శ్రీయుతులు బాలయ్య, పి. సత్యనారాయణ, టి. బి. విఠలరావు, నూతి వర్సయ్య, యం. కొమరయ్యగార్లు ఈ సందర్భంలో జరిగిన సభలో ప్రసంగించారు.

శిథిలమైపోతున్న తమ స్థానాన్ని కాపాడుకోవడం కోసం, హైడ్రోజన్ బాంబుద్వారా అమెరికన్ సామ్రాజ్యవాదులు చేసే ప్రయత్నాలను ఎక్కడికక్కడ తుత్తునియలుగా చేసేశక్తి కార్మిక వర్గానికి కలదని, అందుచేత అమెరికన్ సామ్రాజ్యవాదులు చేసే ప్రయత్నాలన్నీ కార్మికులు సంఘటిత శక్తితో ఎదుర్కోవాలని వక్తలు ఉద్బోధించారు.

సభలో జెనీవాసభ జయప్రదం కావాలని, మిత్రరాజ్యసమితిలో చైనాకు ప్రాతినిధ్యం యివ్వాలని, ఇండోచైనాలో యుద్ధం ముగించాలని, హైడ్రోజనుబాంబును నిషేధించాలని తీర్మానాలు చేయబడ్డాయి.

ఇండోచైనాలో ఫ్రాన్సుకు సహాయం ఇవ్వకూడదు

జెనీవా సభలో అమెరికాకు చౌ-ఎన్-లై హెచ్చరిక

పారిస్, ఏప్రిల్ 28

ఫార్మోజానుంచి కుమింటాంగు సేనలను తొలగించాలనీ, ఇండో-చైనాలోని ఫ్రెంచి సైన్యాలకు అమెరికా సహాయం పంపడం మానాలనీ నేడు చైనా విదేశాంగమంత్రి జెనీవా సమావేశంలో స్పష్టపరిచారు.

(ఈ ఉపన్యాసంలో కొంతభాగాన్ని నిన్నటి పత్రికలో యిచ్చాము. తరువాయి యిప్పుడిస్తున్నాము.)

"నూరుకోట్ల మంది ప్రజలుగల 20 దేశాలు చైనా రిపబ్లికును ఏర్పడీ ఏర్పడడంతోనే గుర్తించాయి.

"కాని, కొన్ని ప్రభుత్వాలు - వానిలో ప్రథమం, ప్రధానం అయినది అమెరికా - చైనా ప్రజాప్రభుత్వాన్ని నేటికీ గుర్తించలేదు. చైనా ప్రజలకు తమ యిష్టం వచ్చిన ప్రభుత్వాన్ని ఏర్పరచుకొనే హక్కున్నదని కూడా వారు గుర్తించడం లేదు.

"చైనా పాల్గొంటున్న మొట్టమొదటి అంతర్జాతీయ సమావేశం ఇదే. ఇప్పుడుకూడా కుమింటాంగు ముఠాను చైనా ప్రజల నెత్తిన రుద్దేటందుకు అమెరికా తన ప్రయత్నం మానలేదు.

"కొరియాలో యుద్ధం ఆఖరయినా అక్కడింకా శాంతిఏర్పడలేదు. కొరియా సమస్య పరిష్కారం కావాలనీ, ఇండోచైనాలో శాంతిని నెలకొల్పాలనీ ప్రపంచ ప్రజలంతా కోరుతున్నారు.

"1950 జూన్‌లో అమెరికా ఉత్తర కొరియా మీద దాడి ప్రారంభించింది. తర్వాత అమెరికా విమానాలు ఈశాన్య చైనా ప్రాంతాలలో బాంబులు వేశాయి. చైనా ఓడలపై దాడులు చేశాయి.

"చైనా ప్రభుత్వం దేశాభివృద్ధి కార్యక్రమాల్ని సాగించేటందుకై శాంతి పరిస్థితులను కోరుతూంది. కాని, దాని మీద దురాక్రమణ చేయగల ప్రమాదం ఒక్క క్షణంకూడా తొలగలేదు. ఈ పరిస్థితులను తొలగించేటందుకు యీ సభలో పునాదులు పడాలి.

38 వ అక్షాంశరేఖ అతిక్రమణ

"చైనా హెచ్చరికల్ని లెక్కచేయకుండా అమెరికా 38 వ అక్షాంశరేఖన్ని దాటింది. యాలూనదిని సమీపించి చైనా క్షేమానికి ప్రమాదం కలిగించింది.

"కొరియాను ఆక్రమించి, అక్కడ సేనలను కూర్చుకొని, చైనా భూభాగం మీద దాడి చెయ్యాలని, ఇదివరలో జపాను చేసిన ఎత్తే అమెరికా కూడా ఆలోచించింది."

"చరిత్ర చైనా ప్రజలకిదివరకో మారు గుణపాఠం నేర్పింది. అందుచేత తమ మాతృదేశ రక్షణకై కొరియన్ ప్రజల అండగా నిలబడివారుయుద్ధానికి దిగారు.

"చైనాపై దాడికి ఒక మెట్టుగా కొరియా వుపయోగపడే స్థితిని చైనా ప్రజలు సహించరు.

"కొరియా సమస్యను శాంతి యుతంగా పరిష్కరించ వలసిందని సోవియటు ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. దాని ననుసరించి శాంతి సాధనకు గల ఆటంకాలను తొలగించేటందుకై కొరియా, చైనా ప్రజలు ప్రయత్నాలు చేశారు."

యుద్ధఖైదీలపై నిర్బంధాలు

"అమెరికా, దక్షిణ కొరియాలు 48 వేలమంది యుద్ధఖైదీలు ఇళ్ళకు పోకుండా బలాత్కారంగా ఆటంకపరిచాయి. యుద్ధఖైదీల సమస్య ఇంకా ముగియలేదు. దానిని ఈ సమావేశం పరిశీలించాలి.

"కొరియాలో యుద్ధవిరమణ జరిగాక అమెరికా దక్షిణ కొరియాలో "పరస్పర సహకార సంధి" అంటూ చేసుకొని, అక్కడ అమెరికా సేనల నట్టిపెట్టేటందుకో దారి చూసుకొంది. ఆ సంధి చేసుకోవడం యుద్ధవిరమణ సంధినిబహిరంగంగాఅతిక్రమించడమే."

"కొరియాను ఏకముఖం చేయడానికీ, ఎన్నికలు జరిపించడానికీ జనరల్ నామ్-ఇల్ చేసిన సూచనలను చైనా ప్రభుత్వ ప్రతినిధులు పూర్తిగా సమర్థిస్తున్నారు.

"చైనాకు సంబంధించిన తైవాన్ (ఫార్మోజా) ద్వీపాన్ని కొరియాయుద్ధ కాలంలో అమెరికా ఆక్రమించింది.

"ఫార్మోజాను చైనా భూభాగం మీద దాడులు చేసేటందుకై వుపయోగిస్తున్నారు. చైనాభాగాల్ని ఆక్రమించిన ప్రభుత్వం ఏదిగానీండి, చైనా ప్రజసహించదు.

"కొరియా యుద్ధ ప్రారంభంనాడే అమెరికా పసిఫిక్ రక్షణ కూటాన్ని నిర్మించింది. ఇప్పుడు ఆగ్నేయాసియా రక్షణ కూటమి నొకదానిని తయారు చేయడానికై ఇండోచైనా యుద్ధాన్ని సాకుగా చూపుతూంది.

"అటువంటి దురాక్రమణోద్దేశాలతో నిర్మింపబడుతున్న కూటమి వలన ఆసియా స్వాతంత్ర్యం భగ్నం అవుతుంది. మూడో ప్రపంచయుద్ధం వచ్చే ప్రమాదాన్ని కల్పిస్తుంది.

"అమెరికా దురాక్రమణ ప్రయత్నాలను వెంటనే నిలుపుదల చేయాలనీ, ఆసియా దేశాల స్వాతంత్ర్యం, ఆసియా ప్రజల హక్కులు కాపాడబడాలనీ మా అభిప్రాయం. ఆసియాదేశాల ఆంతరిక వ్యవహారాలలో ఇతరులు జోక్యం పెట్టకుండా నివారించాలి. ఆసియాలోని విదేశీయ సైనిక కేంద్రాలను రద్దు పరచాలి.

"జపాను తిరిగి ఆయుధాలను ధరించేటందుకు జరుగుతున్న ప్రయత్నాలను నిలపాలి. ఆర్థిక నిర్బంధాలు, నిషేధాలు రద్దు కావాలి.

"చైనా ప్రజలు, ఆసియా ప్రజలు ఒక్క ఆసియా శాంతి కోసమే గాక యూరోపులో శాంతికోసం కూడా ఆసక్తి చూపుతున్నారు.

"శాంతిని కాపాడాలంటే పశ్చిమ జర్మనీచేత ఆయుధధారణ జరగకుండా నిలపడం అవసరం. యూరోపు దేశాలన్నీ కలిపి యూరోపు రక్షణకు సహకరించి ప్రయత్నించడం అవసరం.

"శాంతిస్థాపనకోసం ఆయుధాల నిర్మాణంలో సాగుతున్న పోటీని నిలపాలి. సైన్యాలను తగ్గించాలి. హైడ్రోజన్, ఆటంబాంబులను, ఇతర ప్రజానిర్మూలనకర అస్త్రాలను నిషేధించాలని మా కోరిక.

"శాంతి విషయమై ఉత్సాహం చూపిన ఇండియా, ఇండోనీషియా, బర్మావంటి దేశాలు ఈ సమావేశంలో పాల్గొనలేక పోతున్నందుకు చైనా విచారం తెలుపుతూంది.

"ఈ సమావేశం ఆసియాలోనూ, ప్రపంచంలోనూ శాంతిని సుస్థిరం చేయడానికై ప్రయత్నించాలనీ, అజెండాలోని సమస్యలపరిష్కారానికై మార్గాల నన్వేషించగలదనీ ఆశిస్తున్నాను."

ఈనాటి సమావేశంలో డల్లెసు ఇచ్చిన వుపన్యాసాన్ని గురించి మాట్లాడుతూ "అది ఆసియాప్రజల క్షేమానికి వ్యతిరేకం. దానికి మేము అంగీకరించం"- అని చౌ ఎన్-లై అన్నారు.

హైడ్రోజన్ బాంబును వెంటనే నిషేధించాలి

ఆంధ్ర రాజధానినుండి అమెరికన్ రాయబారికి అసమ్మతి పత్రాలు

కర్నూలు, ఏప్రిల్ 28

హైడ్రోజన్‌బాంబును తక్షణం నిషేధించాలనీ, కాశ్మీర్ నుండిఅమెరికన్ పర్యవేక్షకులను వెంటనే వుపసంహరించాలనీ కోరుతూ ఆంధ్రరాజధాని కర్నూలునుండి 200 మంది, అమెరికన్ రాయబార కార్యాలయం,ఢిల్లీకి జాబులు వ్రాశారు.

స్థానిక కమ్యూనిస్టు కమిటీవారు పోస్టు కార్డులపై, నిరసనపత్రం ప్రచురించి వివిధ వ్యక్తులవద్దకువెళ్ళి కార్డులు అమ్మి సంతకాలు సేకరించారు.

సంతకాలు చేసినవారిలో రాష్ట్ర కాంగ్రెసు సభ్యుడు, కర్నూలు జిల్లా కాంగ్రెసు కార్యదర్శి, కర్నూలు తాలూకా కాంగ్రెసు కార్యదర్శి, జిల్లా కమ్యూనిస్టుకమిటీ కార్యదర్శి, 20 మంది న్యాయవాదులు, 10 మంది డాక్టర్లు వర్తకులు, విద్యార్థులు, ప్రజాసంస్థల నాయకులు మొదలయిన వారున్నారు.

(వి. వి.)

ఉత్తర కొరియా సూచనలకు అమెరికా తీవ్ర వ్యతిరేకత

కొరియా ఎన్నికలపై ఐ. రా. స. పెత్తనం ఉండాలని డల్లెస్ వాదం

జెనీవా, ఏప్రిల్ 28

ఉత్తర దక్షిణ కొరియా శాసన సభల సంయుక్త సమావేశం తయారు చేసిన ఎన్నికల చట్టంక్రింద ఎన్నికలు జరగాలని, జెనీవా సమావేశం జరిగిన ఆరునెలలలోగా విదేశీసేనలన్నీ వైదొలగాలని ఉత్తరకొరియా ప్రధాని జనరల్ నామ్-ఇల్ చేసిన సూచనలను డల్లెస్ తీవ్రంగా వ్యతిరేకించాడు.

నామ్ ఇల్ చేసిన సూచనలు దక్షిణ కొరియా 'ప్రజా' ప్రభుత్వాన్ని నాశనం చేసి దాని స్థానంలో కమ్యూనిస్టుల 'కీలుబొమ్మ' ప్రభుత్వాన్ని ఏర్పరచడానికి ఉద్దేశించబడ్డవని డల్లెస్ అన్నాడు.

డల్లెస్ యింకా యిలా అన్నాడు: 1950 అక్టోబరు 7 న ఐక్యరాజ్య సమితి చేసిన తీర్మానాన్ననుసరించి సమితిచే నియమింపబడ్డ పరిశీలక సంఘం ఆధ్వర్యాన ఉత్తర కొరియాలో ఎన్నికలు జరగాలి. కమ్యూనిస్టులు సూచించిన ఎన్నికల చట్టం క్రింద కమ్యూనిస్టులు ఎన్నికలను త్రోసి రాజనవచ్చు. (వీటో చేయవచ్చు.)

ఎలాంటి విదేశీజోక్యం లేకుండా ఎన్నికలు జరపాలని కమ్యూనిస్టులు సూచిస్తున్నారు. ఇది మిత్రరాజ్యసమితి యొక్క పరిశీలనను అరికట్టేందుకు వుద్దేశించబడి వుండవచ్చు.

కమ్యూనిస్టుల సూచనలను అంగీకరించి నట్లయితే స్వేచ్ఛాయుతమైన ఎన్నికలద్వారా ఎన్నుకోబడ్డ కొరియా రిపబ్లిక్ (దక్షిణ కొరియా - సం॥) ప్రభుత్వానికి, దేశంలో ముప్పాతిక వంతు ప్రజానీకానికి ప్రతినిధ్యం వహిస్తున్న కొరియా రిపబ్లిక్ ప్రభుత్వానికి - ఉత్తర కొరియాలో కొద్దిమంది ప్రజలకు ప్రాతినిధ్యం వహించే కమ్యూనిస్టు ప్రభుత్వానికి ఒకే సమాన ప్రతిపత్తి యిచ్చినట్లవుతుంది.

కాల నిర్ణయం లేకుండా కొరియాలో అమెరికను సేనలను ఉంచాలని అమెరికా ప్రభుత్వ వుద్దేశంకాదు. లోగడ ఒకసారి అమెరికా తన సేనలను ఉపసంహరించింది. తరువాత ఘటనల వల్ల ఆ ఉపసంహరణ అకాలంలో జరిగినదని తేలింది. తిరిగి అలాంటి పరిస్థితి ఏర్పడకూడదు.

ఉత్తరకొరియా ప్రతిపాదనల సారాంశం యిదే. ఈ ప్రతిపాదనలు ఐక్య స్వతంత్ర స్వేచ్ఛాయుత కొరియా నిర్మాణానికి దోహదమివ్వవు గనుక అంటే మనం యే లక్ష్యంకోరకైతే యింత రక్తాన్ని ధారబోసి అష్టకష్టాలు పడ్డామో ఆ లక్ష్యం సాధించబడటం లేదు గనుక అమెరికా ఈ ప్రతిపాదనలను తిరస్కరించి తీరుతుంది.

కొరియా ఐక్యతకు మనం కొత్త ప్రతిపాదనలు చేయాల్సిన అవసరమేమీ లేదు. 1950 అక్టోబరు 7 న ఐక్యరాజ్య సమితి తీర్మానంలోనే కొరియా ఏకీకరణ ప్రతిపాదనలు సూచించబడ్డవి. మిత్రరాజ్యసమితి పరిశీలకసంఘం దాని కర్తవ్యాలను నిర్వహించడానికి సమితి ఆదేశాలను పాటించడానికి సిద్ధంగా వుంది.

అమెరికన్ విదేశాంగమంత్రి డల్లెస్ జెనీవా సభ మూడవనాటి సమావేశంలో తన ప్రసంగాన్ని యింకా కొనసాగిస్తూ కొరియాలో అమెరికా కేటువంటి ప్రయోజనాలు లేవనీ, జపాను దురాక్రమణశక్తి కానేకాదని అన్నాడు.

దక్షిణ కొరియాకు కూడ దాని సరిహద్దులు దాటి దురాక్రమణ చేసే వుద్దేశం లేదన్నాడు. చైనా, రష్యాలు వాటి దురాక్రమణ ఉద్దేశాలను వదలుకో సిద్ధంగా ఉన్నవా? అని ప్రశ్నించాడు. కొరియాలో గత 7 ఏండ్లనుండి మిత్ర రాజ్య సమితి ద్వారా ప్రతిబింబిత మౌతున్న అంతర్జాతీయ శాంతి భద్రతలకు వ్యతిరేకంగా అవిరామ పోరాటం సాగుతున్నదనీ, యీ పోరాటం యింకా సాగాల్సిందీ లేనిదీ జెనీవాసభ నిర్ణయించాలని డల్లెస్ అన్నాడు.

జాతులన్నిటినీ మిళితం చేయాలనే లెనిన్ సిద్ధాంతం ద్వారాను, ప్రపంచంలోని ప్రజలందరినీఒకే రాజ్యంలో ఐక్యపరచాలనే స్టాలిన్ సిద్ధాంతంద్వారాను కమ్యూనిస్టులు యితరదేశాలలో తమ పరిపాలన నెలకొల్పుకో చూస్తున్నారని డల్లెస్ అవాకులు, చెవాకులు వాగాడు.

వ్యతిరేకత తీవ్రంగా వున్నప్పుడు కొంత తగ్గాలని కమ్యూనిస్టుల సిద్ధాంతం. కనుక మనం యిప్పుడు మన బలాన్ని ప్రదర్శించి స్వేచ్ఛాయుత ఐక్య కొరియా ఏర్పడటానికి కమ్యూనిస్టులు అంగీకరించేటట్లు చేయాలని డల్లెస్ చెప్పాడు. నేటిసమావేశానికి ఈడెన్ అధ్యక్షతవహించాడు.

చందాదారులకు మనవి

[illegible]

— మేనేజరు
"విశాలాంధ్ర"

1954 మే 1 శనివారం
జయ సంవత్సర
చైత్ర – బహుళ
చతుర్దశి తె. 4–45
రేవతి రా. 7–3

ఓరియంటల్ గవర్నమెంటు సెక్యూరిటీ లైఫ్ అష్యూరెన్సు కంపెనీ లిమిటెడ్, బొంబాయి వారి ప్రకటన.

1954 మార్చి 6 న మా కంపెనీ ఇన్స్యూరెన్సు స్కీములలో ప్రజామోదం పొందిన ఎక్కువ ప్రీమియము రేట్లలో గణనీయమైన తగ్గింపులు చేశాం. మార్చి 15 న యీ తగ్గింపులను అన్ని స్కీములకు వర్తింపచేశాం. అయితే మార్చి 30 న లైఫ్ ఇన్సూరెన్సు కౌన్సిల్ యిచ్చిన డైరెక్టివు ప్రకారం (ఏప్రిల్ 30 వ తేదీ లోగా పై తగ్గింపులను రద్దుపరచుకోవటం) ఓరియంటల్ వారిచే అన్ని డినామినేషన్ల పాలసీలకువర్తించు తగ్గింపులను, అనగా ఆర్డర్ ప్రకారం హక్కువున్న రు. 1000 కనిష్ట మొత్తముతోసహా కౌన్సిల్ వారి తీర్మానం దృష్ట్యా, అన్ని రకాల జీవిత భీమా పట్టాల ప్రీమియం రేట్లను హెచ్చు చేయుటకై అవసరమైన మార్పులను ఇపుడు ప్రవేశపెట్టినాం. ఇది ఏప్రియల్ 29 నుండి అమలుపర్చబడును. ఈ మార్పు ఆ యా పాలసీల క్రింద సాంప్రదాయంగా ఏజెంట్లకిచ్చే కమీషనులను యధాస్థితికి దెచ్చుచూ, జీవితపర్యంతం ప్రీమియములు చెల్లించే యావజ్జీవిత భీమా పట్టాలకు, యావజ్జీవిత మితివాయిదాల పట్టాలకు, ప్రత్యేక యావజ్జీవిత పట్టాలకు, పిల్లల డిఫర్డు లిమిటెడ్ యావజ్జీవిత భీమాపట్టాలకు, పూర్తిరక్షణ యావజ్జీవిత భీమా పట్టాలకు, మార్చుకొనదగు యావజ్జీవిత భీమా పట్టాలకువర్తించును.

అయితే మార్చిలో ప్రవేశపెట్టబడిన యీ తగ్గింపులు పై తరగతిక్రిందికి రాని ఇతరస్కీములైనఎండోమెంటు అష్యూరెన్సు పట్టాల అన్నిరకాలకు వర్తించును ప్రస్తుతం అమలులోవున్న తగ్గింపురేట్లు ముందుకూడా లభ్యమగును.

చెరుకలై లంక విముక్తి

ప్రజా నాయకుల అభినందనలు

పెల్లిచేరి, ఏప్రిల్ 28

ఫ్రెంచి ఇండియా లంక చెరుకలై విముక్తం చేయబడింది. ఫ్రెంచి మాహే మహాజనసభ వలంటీర్లు నిన్న రాత్రి చెరుకలైలోకి ప్రవేశించారు. సభ అధ్యక్షులు శ్రీ కుమారన్ భారత పతాకం ఎగురవేశారు.

పుదుచ్చేరిలోని జాతీయ,కమ్యూనిస్టు నాయకులు, త్రిభువన్ కమ్యూన్ ప్రజా ప్రభుత్వం చెరుకలై ప్రజలను అభినందిస్తూ సందేశాలు పంపారు. శ్రీ సుబ్బయ్య ఒక సందేశం పంపుతూ, ఆ గ్రామంలోనే ఫ్రెంచి పోలీసులు కాల్పులు జరపడాన్ని ఖండించారు. ఇలాంటి చర్యలను నిరోధించడానికి భారత ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ కాల్పులను బట్టి చూస్తే, ఇండియా ప్రభుత్వంతో ఫ్రెంచి ప్రభుత్వం స్థావరాల విషయమై సంప్రతింపులు జరుపుతా మనడం విముక్తి ఉద్యమాన్ని నీళ్లు కార్చడానికి స్వాతంత్ర్య యోధులపై నిర్బంధ చర్యలు అధికం చేయడానికి ఉద్దేశించబడినట్లు తేలుతోందని సుబ్బయ్య గారన్నారు. విముక్తి పోరాటాన్ని ఉధృతం చేయడంద్వారా ఫ్రెంచి ప్రభుత్వ చర్యలకు తగు జవాబు చెప్పాలని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు.

త్రిభువన్ కమ్యూన్ ప్రజా ప్రభుత్వం కూడా పోలీసు కాల్పులను ఖండించి, అంతిమ విముక్తి పోరాటానికి ప్రజలను సన్నద్ధం కమ్మని కోరింది.

శాశ్వత ప్రయోజనాలకై చేనేత సెస్‌నిధి వినియోగం

కడపజిల్లా చేనేత పారిశ్రామిక మహాసభ తీర్మానాలు

[విశాలాంధ్ర విలేఖరి]

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 26

"చేనేత సహాయార్థం మిల్లుబట్టమీద వసూలు చేసిన 5 కోట్లసెస్సు నిధి చేనేత పారిశ్రామికులకు ఏమీ వినియోగపడ లేదు. అందుచేత శాశ్వత ప్రయోజనాల సాధనకే ఈ నిధి వినియోగించాలి" అని యిచ్చట జరిగిన కడపజిల్లా ప్రథమ చేనేత మహాసభవారు తీర్మానించారు.

ఈనెల 22 వ తేదీన దేవీహాలులో జరిగిన ఈ సభకు జిల్లా అంతటనుండి 150 మంది ప్రతినిధులు వచ్చారు. ఆంధ్రరాష్ట్ర చేనేతసంఘ ఉపాధ్యక్షులు శ్రీ పుత్సల సత్యనారాయణగారు అధ్యక్షత వహించారు.

ఆహ్వానసంఘాధ్యక్షులు శ్రీ కంభం చెంగ్రాయుడుగారు ప్రతినిధులను, సభా ప్రారంభకులును, అధ్యక్షులను ఆహ్వానించుతూ సభ జయప్రదం చేయవలసిందని కోరారు. సభకు విరాళాలిచ్చినవారికి అభివందనలు తెలిపారు.

శ్రీ ఎన్. శివరామిరెడ్డి బి. ఎ. బి. యల్. సభను ప్రారంభించుతూ రాయలసీమ కరువుతో పీడింపబడుతున్నంతవరకు ప్రజలలో కొనుగోలుశక్తి లేనంతవరకు చేనేత పరిశ్రమకు దుస్థితి తప్పదన్నారు. వ్యవసాయ సంస్కరణలు, ఇరిగేషన్ సౌకర్యాలు ద్వారా ప్రజాజీవితం బాగుపర్చాలని అన్నారు. చేనేత పారిశ్రామికులు రైతు-కూలీలతో చేతులు కలిపి ఇందుకు పోరాడాలని అన్నారు.

శ్రీ వడిశా నరసింహులుగారు తదనంతరం కార్యదర్శి రిపోర్టు ప్రవేశపెట్టారు. రిపోర్టు ఆమోదించబడిన తర్వాత శ్రీ బుధారపు మల్లిశెట్టిగారుపన్యసించారు.

అధ్యక్షోపన్యాసం

శ్రీ పుత్సల సత్యనారాయణగారు తమ అధ్యక్షోపన్యాసంలో ఆంధ్రలో చేనేత ఉద్యమ చరిత్ర వివరించుతూ ఉప్పాడ (తూ॥ గో॥)లో 1936 లో ప్రథమ ఆంధ్రరాష్ట్ర మహాసభ జరిగిందని, అది మొదలు అన్ని జిల్లాలలోను అనేకమంది కార్యకర్తలు నిర్విరామకృషి గావించుతున్నారని తెల్పారు. ఇంకా యిలా తెలిపారు:

మద్రాసులో తొలి కాంగ్రెసు మంత్రివర్గం రాజాజీ నాయకత్వం క్రింద ఏర్పడిన వెంటనే రాయబారం నడుపబడింది. 1938 లో రెండవ రాష్ట్రసభ నంద్యాలలో జరిగిన పిమ్మట మిల్లు గుడ్డపై 0-1-0 సెస్సు వెయ్యాలని కోరాము. ఆ సెస్సు నిధితో నే మద్రాసు రాష్ట్ర సహకార సంఘం నెలకొల్పబడింది కూడా. కాని పరాయి ప్రభుత్వం చేనేత పరిశ్రమకు తగు రక్షణ యివ్వలేదు. చేనేత పారిశ్రామికులు ఎంతో ఆందోళన చేసినమీదట 1944 లో పరిశ్రమ స్థితిగతుల పరిశీలనకు కమిటీ నియమించబడింది. కాని ఏదీ అమలుజరుగలేదు. మద్రాసు ప్రభుత్వం నియమించిన బి. వి. నారాయణ స్వామి కమిటీ సూచనలు కూడా అమలుజరుగలేదు. ఇప్పుడు మధ్యనిషేధంపై రామమూర్తి కమిటీ నివేదికకు పట్టిన గతే దానికి పట్టింది. 1953 లో ప్రారంభమైన చీరలు ధోవతులు కేటాయింపు ఆందోళన పర్యవసానంగా కేంద్ర ప్రభుత్వం కన్నీళ్ళ తుడుపుగా మిల్లుబట్టపై 0-0-3 సెస్సు విధించింది. ఇందు వలన వచ్చే 5 కోట్ల ఆదాయం వలన జరిగేదేమీ లేదని చేనేత పారిశ్రామికులు అసంతృప్తి వెల్లడించారు. నాగపూరులో 10 వేలమంది ప్రదర్శనలు జరిపారు. ఈ ప్రదర్శనలపై ప్రభుత్వం తుపాకులు కాలిస్తే ఒకరు మరణించారు. ఆంధ్రలో రేపల్లెలో చేనేతపారిశ్రామికులు సాగించిన సత్యాగ్రహాన్ని అణచడానికి పసుబలం ప్రయోగించింది. చేనేత ఉద్యమంలో చీలికలు లేకుండా ఉంటే ఈ పోరాటం ఎంతో విజయవంతంగా సాగేది.

చేనేత సెస్సు నిధి

చేనేత సెస్సునిధి 5 కోట్లు ఇటీవల ఖర్చుపెట్టారు. కాని చేనేత పారిశ్రామికుని ఆదాయం ఎంత పెరిగింది? మూలపడిన చేనేత సహకార సంఘాలు ఎన్ని పునరుద్ధరించబడ్డాయి?

యీ పరిస్థితులలో చేనేత పారిశ్రామికులు పోరాడనైనా పోరాడాలి, లేదా కృంగి కృశించవలసిన పరిస్థితి ఏర్పడింది. ఆంధ్ర చేనేత ఉద్యమములో చీలికలు బలంగా ఉన్నాయి. ఆంధ్రరాష్ట్ర చేనేత పారిశ్రామిక సంఘం, చేనేత కాంగ్రెసు ప్రధానంగా పనిచేస్తున్నవి. ఒక వృత్తికి రెండు సంఘాలుండటం అరిష్టదాయకం. ఈ సంఘాలకు రాజకీయాలు ప్రాధాన్యతగా ఉండరాదు. ఆ ఎవరైనా సభ్యులుగా చేరాలని వెడితే నీవు ఏ రాజకీయ పార్టీకి చెందినవాడవని ప్రశ్నించి తమకనుకూలమైన- వాడైతేనే చేనేత కాంగ్రెసువారు చేర్చుకుంటున్నారు. చేనేత పారిశ్రామికసంఘం తరఫున ఐక్యఉద్యమ నిర్మాణానికి తగు సూచనలు చేశాము. అంతిమ లక్ష్యాల్లో కొంత విభేదం ఉన్నా తక్షణ సమస్యలపై కలసిపనిచేయవచ్చునని ప్రతిపాదించాము. చేనేత పారిశ్రామికుల తక్షణ కోర్కెలపై రెండు సంఘాలు ఒకేవిధమైన అభిప్రాయాలు కల్గి వున్నాయి కూడా.

అందరూ అంగీకరించే ఈ సాధారణ సమస్యలపై అందరూ సమిష్టిగా ఒకే వృత్తి సంఘంలో పనిచేయవలసిందని చేనేత కాంగ్రెసును ఆహ్వానించాం. కాని ప్రగడ కోటయ్యగారు ఈ ఐక్యతా ప్రయత్నాలను కొనసాగనివ్వకుండా చేస్తున్నారు.

ఈ జిల్లాలో చేనేత పారిశ్రామికులను ఎదుర్కొంటున్న అనేక సమస్యలను సభలో చర్చించి జిల్లా సంఘాన్ని బలంగా నిర్మించాలని కోరుతున్నాను" అని పుత్సల సత్యనారాయణగారు ముగించారు.

మహాసభ తీర్మానాలు

మహాసభలో ఈ ప్రధాన తీర్మానాలు ఆమోదించబడినవి.

భారత దేశానికి స్వతంత్రం వచ్చి 7 సంవత్సరాలైనా ప్రజలు కొనుగోలు శక్తి పెరగలేదు. పరిశ్రమలు మూలపడుతున్నాయి. నిరుద్యోగ సమస్య ఎక్కువైంది. ఈ సమస్యలు పరిష్కరించాలంటే భూస్వామ్య విధానం రద్దుచేసి దున్నేవానికే భూమి హక్కు యివ్వాలి. ఈ సంస్కరణలద్వారానే ప్రజలు కొనుగోలు శక్తి పెరుగుతుంది. ఇట్టి సంస్కరణల కోసం మన సంఘం ఆందోళన చేయాలి.

చీరలు, ధోవతులు చేనేతకు కేటాయించాలని రాష్ట్ర శాసన సభలలో యిందు విషయమై తీర్మానాలుచేయబడినప్పటికి కేంద్రం అమలు జరపనందుకు సభవారు నిరసిస్తున్నారు.

సెస్సు నిధి వినియోగం

చేనేత సెస్సునిధిని చేనేత పారిశ్రామికులకు ప్రయోజనకరంగా ఉండేటట్లు ఖర్చు పెట్టాలని సూచిస్తూ మహాసభ ఈ విధంగా తీర్మానించింది:

ఈనిధితో చేనేతవారియాజమాన్యం క్రింద ఉండగల నూలు మిల్లు నిర్మాణానికి ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలి.

అఖిలభారత చేనేత బోర్డును ఆంధ్రా స్టేటు చేనేత బోర్డు, జిల్లా చేనేత సలహాసంఘములు, ఎక్కువగా నిరంకుశ ప్రభుత్వోద్యోగులతో నిండిపోవడం జరుగుతూయున్నది. మంత్రుల యొక్క పక్షపాతపూర్వకమైన నామినేటెడ్ మెంబర్లతో కూడియుంటూన్నది. చేనేత ప్రజలలో చిరకాలమునుండి వేలాది గ్రామాలలో నిర్మాణయుక్తంగా పనిచేస్తూయున్న ఆంధ్ర రాష్ట్ర చేనేత సంఘానికి ఇంతవరకూ ఆయాబోర్డులలోనూ, కమిటీలలోనూ, ప్రాతినిధ్యమును ప్రభుత్వము యివ్వకపోవడాన్ని యీ సభవారు తీవ్రంగా నిరసిస్తూయున్నారు.

ప్రజాస్వామిక రాజ్యమని నోటితో చెప్పుకొంటూ, ఆచరణలో నిరంకుశంగా అమలు జరిపే యీ ప్రభుత్వ [illegible] యీ సభవారు ఖండించుతున్నారు.

ప్రభుత్వం వద్ద ఏర్పాటుచేసిన, [illegible] బోర్డులలోనూ, కమిటీలలోనూ, ఆంధ్రరాష్ట్ర చేనేత ప్రతినిధులను తీసుకొని ఈ సెస్సు వినియోగంయొక్క ముఖ్యమైన విషయములలో చేనేత ప్రజాకోటి అభిప్రాయమును కమిటీలలో ప్రజాస్వామికంగా ప్రతిబింబించేటట్లు చేయవలసిందని యీ సభవారు కోరుతున్నారు.

రాష్ట్ర చేనేత సహకార సెంట్రల్ బ్యాంకు

ఈ జిల్లాలోని సుమారు 50 చేనేత సహకార సంఘములలో ఇంచుమించు 40 వరకు ప్రస్తుతం పనిచేయకుండా మూలపడి యున్నవి. గత నాలుగు సంవత్సరముల కరువు కాలములో అనేకమంది సొసైటీ మెంబర్లు అప్పులలో పడిపోయినారు. యిప్పటికి వాటిని తీర్చుకొనే స్థితిరాలేదు. కావున ఆ బకాయలతో నిమిత్తం లేకుండా తిరిగి ఆ మెంబర్లందరికి పని చెప్పేటట్లుగా సొసైటీలన్నిటిని పునరుద్ధరించుటకు సెస్సు నిధినుండి కొంత డబ్బు కేటాయించమని యీ సభవారు కోరుతున్నారు.

ఆంధ్రలోని సుమారు 3 లక్షల మగ్గాలకు నిరుద్యోగం లేకుండా పని జరిగితే మొత్తం సంవత్సరానికి 50కోట్ల రూపాయల విలువగల బట్ట వుత్పత్తి అవుతుంది. ఆంధ్రలో బియ్యం వుత్పత్తి తరువాత యింత పెద్ద మొత్తం యింకే వస్తువు లేదు. ఇదివరకే నూటికి 30 వంతులు చేనేతవారు సహకార వుద్యమంలో యీనాడు అనేక కోట్ల రూపాయల సహకార చేనేతవ్యాపారం జరుగుతూ వుండడంవల్ల ప్రత్యేకంగా ఒక రాష్ట్ర చేనేత సహకార సెంట్రల్ బ్యాంకును స్థాపించుకొనుటకు తగిన అర్హతలన్నీ యున్నవి.

ప్రస్తుతం వున్న జిల్లా సెంట్రల్ బ్యాంకులమీద చేనేతవారు ఆధారపడడంవల్ల సరిగా అభివృద్ధి పొందలేకపోతున్నారు. అనేక అడ్డంకులను కూడా యెదుర్కొనవలసి వస్తున్నది.

కాబట్టి ప్రభుత్వం వెంటనే పూనుకొని రాష్ట్ర చేనేత సహకార సెంట్రల్ బ్యాంకును స్థాపించుటకు తగు చర్యలు తీసుకోవలసిందని యీ సభవారు కోరుతున్నారు.

ప్రభుత్వమే చేనేత బట్టను కొనాలని కూడా మహాసభవారు మరొకతీర్మానం చేశారు.

ఆటం హైడ్రోజన్ బాంబును నిషేధించాలని ఈవిషయంలో ప్రధాని నెహ్రూ సూచించినట్లు యథాతథ ఒడంబడికను చేసుకోవాలని మహాసభవారు మరో తీర్మానంలో కోరారు.

జిల్లా కార్యవర్గం

జిల్లా చేనేత పారిశ్రామిక సంఘానికి అధ్యక్షులుగ శ్రీ వడిశా నరసింహులు ఉపాధ్యక్షులుగ శ్రీ అవ్వారు వెంకటసుబ్బయ్య శ్రీ పేకూరు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగ శ్రీ బుధారపు మల్లిశెట్టి సహాయ కార్యదర్శిగ శ్రీ జింక చిన సుబ్బన్నగార్లు సభ్యులుగా శ్రీ కంభం చెంగ్రాయుడు, బడిగంచెల వెంకటసుబ్బయ్య, బత్రెంకల అశ్వద్ధమయ్య, కంచెన వెంకటయ్య, బత్రెంకల చిన నరసింహులు, వేల్పుల చిన నరసింహులు, గండికోట సుబ్బన్న, సత్యాల కుళ్లాయప్ప, తమిశెట్టి నారాయణగార్లు ఎన్నుకోబడ్డారు.

ఆహ్వానసంఘం తరఫున శ్రీ కంభం చెంగ్రాయుడుగారు వందన సమర్పణతో సభ జయప్రదంగా ముగిసింది.

కృష్ణాజిల్లాలో 110000 కమ్యూనిస్టునిధివసూలు

మరొక 75 వేలు మే 15 వ తేదీకి వసూలు చేయాలని జిల్లా కమిటీ నిర్ణయం

విజయవాడ, ఏప్రిల్ 29

కృష్ణాజిల్లాలో కమ్యూనిస్టుపార్టీ నిధిక్రింద సుమారు లక్షా ఎనభై అయిదు వేల రూపాయలు వాగ్దానాలు చేయబడ్డాయని, అందులో సుమారు లక్షా పదివేల రూపాయలు నగదు రూపంలో వచ్చాయని జిల్లాకమిటీ తెలియజేస్తున్నది. వచ్చే నెల 15 వ తేదీనాటికి తక్కిన విరాళం ప్రోగుచేయాలని పార్టీ సభ్యులను ఆదేశిస్తున్నది.

జిల్లాకమిటీ చేసిన ప్రకటన యీ విధంగా వుంది:

"రాష్ట్ర కమ్యూనిస్టు కమిటీ పిలుపు ప్రకారం గత మూడుమాసాలుగా జిల్లా అంతటా పార్టీనిధి వసూలుచేయబడుతోంది. జిల్లాలో 2 లక్షలు వసూలు చేయాలనే లక్ష్యంతో పార్టీ నిధి వసూళ్ళ వుద్యమం ప్రారంభమయింది. ప్రారంభించిన నాటికంటే ప్రజల ఆదరణ గమనించిన తరువాత మరింత వుత్సాహంతో యీ వుద్యమం ముందుకుపోయింది. ఇప్పటికి లక్షా ఎనుబది అయిదు వేల రూపాయలు వాగ్దానం చేయబడ్డాయి. అందులో లక్షా పదివేల రూపాయలు వసూలయినాయి.

తాలూకాల వారీగా పార్టీ నిధి వాగ్దానాలు, వసూళ్ళ వివరాలు యీ క్రింది విధంగా వున్నాయి:

గన్నవరం రు 57,390 వాగ్దానం, రు 34,576 వసూలు; గుడివాడ రు 35,000 వాగ్దానం, రు 23,000 వసూలు; దివి 25,500 వాగ్దానం, రు 17,000 వసూలు; బందరు రు 6,700 వాగ్దానం, రు 4,500 వసూలు; బందరు పట్టణం రు 1,800 వాగ్దానం; కైకలూరు రు 8,000 వాగ్దానం, 4,000 వసూలు; విజయవాడ రు 28,200 వాగ్దానం, రు 17,606 వసూలు; నూజివీడు రు 3,287 వాగ్దానం, రు 800 వసూలు; తిరువూరు రు 4,000 వాగ్దానం, రు 1,500 వసూలు; నందిగామ రు 9,096 వాగ్దానం, రు 4,000 వసూలు; మునగాల రు 5,500 వాగ్దానం, రు 3,500 వసూలు; మొత్తం రు 1,84,473 వాగ్దానం, రు 1,10,482 వసూలు.

పైనయిచ్చిన లెక్కల ప్రకారం జిల్లాలో యింకా 75 వేల రూపాయలు వసూలు కావలసివుంది. ఈనెల 16, 19 తేదీలమధ్య సమావేశమయిన జిల్లాకమిటీ అంచనాల ప్రకారం, ఇంకా [illegible] వేల రూపాయలు చందాలు వేయించవలసివుంది. అందుచేత [illegible]గా వేయించవలసిన చందాలుగాని, యిదివరకే వాగ్దానాలు చేయించబడి, వసూలు కావలసిన మొత్తంగాని లక్షరూపాయలకు పైగా వుంది.

కాబట్టి ఆయా తాలూకా కమిటీలు తగిన కార్యక్రమం వేసికొని కృషి చేయాలి. ఫిబ్రవరి, మార్చి మాసాలలో కృషి చేసినట్లే దళాలుగా యేర్పడి పెద్దయెత్తున కృషిచేసి రు 2 లక్షల నిధి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లాకమిటీ విజ్ఞప్తి చేస్తోంది. కృష్ణా జిల్లాలో రు 2 లక్షలనిధి కార్యక్రమం మే 15 వ తేదీతో పూర్తిచేయాలని జిల్లాకమిటీ నిర్ణయించింది. పార్టీ అంతా కదలి పై తేదీ లోపల ఈ కార్యక్రమాన్ని పూర్తిచేయకపోతే పార్టీ ముందరవున్న అనేకయితరసమస్యలపట్ల మన కర్తవ్యాన్ని నిర్వహించలేము. అందువల్లప్రతిపార్టీ సభ్యుడు, సానుభూతి పరుడు ఎట్టి పరిస్థితిలోను, మే 15 నాటికి పార్టీనిధి వసూళ్లు పూర్తి కావాలనే లక్ష్యంతో తమ వంతు వాగ్దానాలు వెంటనే చెల్లించాలని, తమకు సన్నిహితులుగా వున్నవారివద్ద సేకరించాలని జిల్లాకమిటీ విజ్ఞప్తి చేస్తోంది".

బళ్లారి స్కూళ్లలో తెలుగు భాషబోధన

రద్దు చేయరాదని మైసూరు ముఖ్యమంత్రికి ఆంధ్ర ఆర్థిక మంత్రి జాబు

కర్నూలు, ఏప్రిల్ 28

బళ్ళారి పాఠశాలలో తెలుగు భాషాబోధనకు స్వస్తిచెప్ప నిర్ణయించినందుకు అసమ్మతి తెలియచేస్తూ, ఆంధ్ర ఆర్థికమంత్రి శ్రీ తెన్నేటి విశ్వనాథంగారు మైసూరు ముఖ్యమంత్రి శ్రీ కె. హనుమంతయ్యగారికి ఒక జాబువ్రాసినట్లు తెలుస్తోంది. మైసూరు ప్రభుత్వ నిర్ణయం లక్షలాది బళ్ళారి ఆంధ్రులకు అశనిపాతంలా వుందనీ, వెంటనే పై నిర్ణయం రద్దుగావించి, యథాపూర్వంగా తెలుగు భాషాభ్యాసానికి సౌకర్యాలు కలుగచేయాలని విశ్వనాథంగారు పై జాబులో అభ్యర్థించారట. (వి. వి.)

ఆంధ్ర వ్యాయామ కళాశాల వార్షికోత్సవాలు

విజయవాడ, ఏప్రిల్ 29

విజయవాడ ఆంధ్రవ్యాయామ కళాశాల ద్వితీయ వార్షికోత్సవం నిన్న సాయంకాలం కళాశాల ఆవరణలో జరిగింది. వార్షికోత్సవ సభకు కళాశాల మేనేజింగు కమిటీ అధ్యక్షులు శ్రీ మాగంటి సీతారామదాసుగారు అధ్యక్షత వహించారు.

ఆంధ్రరాష్ట్ర వ్యాయామ శిక్షణ చీఫ్ఇన్స్పెక్టరు శ్రీ ఆర్. వి. సత్యనారాయణరాజుగారు ప్రసంగించుతూ విజయవాడ ఆంధ్ర వ్యాయామకళాశాల విద్యార్థులకు యివ్వబడ్డ శిక్షణ సక్రమ పద్ధతులమీద వుందని, ప్రాక్టికల్ పరీక్షలలో విద్యార్థులు చూపిన ప్రతిభ దానిని నిరూపిస్తున్నదనీ, కళాశాల ఉపాధ్యాయులు కూడ చాలఅనుభవజ్ఞులైనవారని ప్రశంసించారు. ఇక్కడ శిక్షణ పూర్తి అయి హైస్కూళ్ళలో వ్యాయామ శిక్షకులుగా ప్రవేశించినపుడు అక్కడ ఆటస్థలాలు ఆటలపరికరాలు కొరతగా వుండటం, ప్రధానోపాధ్యాయులు సహకరించకపోవడంచూచి నిరుత్సాహం పొందవద్దనీ, పాఠశాలలో వున్న కనీస వసతులు ఉపయోగించుకుంటూవిద్యార్థులకుఆటలలోశిక్షణయిస్తూ క్రమాభివృద్ధికి తోడ్పడితేనే వారి ఉద్యోగాలలో జయప్రదమవగలరని సలహాయిచ్చారు.

తరువాత శ్రీ మాగంటి సీతారామదాసుగారు, మాట్లాడుతూ కళాశాల ఆర్థికంగా లోటులో వున్నదనీ, విద్యార్థులు, ప్రజలు విరివిగా విరాళాలిచ్చి తోడ్పడాలన్నారు. కళాశాల ఉపాధ్యాయ వర్గ సభ్యులొకరు రెండుమూడు నెలలనుండి జీతాలు అందలేదని చెప్పి పస్తులుండటం కళాశాలకు కళంకమనీ, జీతాలు అందకపోతే పొరుగువారి వద్ద అప్పు పుచ్చుకోవాలే గాని పస్తులుండి కళాశాలకు కళంకం తేవద్దని సలహాయిచ్చారు. కళాశాలకు 20 వేలు సహాయమిచ్చిన ఆంధ్ర ప్రభుత్వాన్ని అభినందించారు.

కళాశాలకు రెండు సంవత్సరాలు ప్రిన్సిపాలుగ పనిచేసి రాజీనామా ఇచ్చి వెళ్ళిపోతున్న శ్రీ ఎ. కె. సింగ్ గారు వార్షిక నివేదిక చదివారు.

కళాశాల మేనేజింగు కమిటీ కార్యదర్శి శ్రీ యం. గోపాలస్వామిగారి అభినందనలతోను, కళాశాల విద్యార్థి సంఘ అధ్యక్షుని ముగింపు వాక్యాలతోను సభ ముగిసింది.

తిరువూరు కో ఆపరేటివ్ యూనియన్ ఎన్నికలు

తిరువూరు, ఏప్రిల్ 27

తిరువూరు కో ఆపరేటివ్ యూనియన్ ఎన్నికలు నిన్న మధ్యాహ్నం ఒంటి గంటకు యూనియన్ ఆఫీసులో జరిగినవి. యూనియన్ డైరెక్టరుగా ఈక్రింద పేర్కొన్నవారు ఏకగ్రీవంగా ఎన్నుకోబడినారు.

శ్రీయుతులు కమదన వెంకట్రామ జగన్నాథరావు, దేవభక్తుని శీతారామయ్య, సువారపు కృష్ణమూర్తి, పూటుకూరు వెంకట్రామారావు, గద్దె ప్రభాకరరావుగార్లు.

విజయవాడ తాలూకా పంచాయితీఅధ్యక్షులసభ

కార్యవర్గం ఎన్నిక

ఉప్పలూరు, ఏప్రిల్ 29

విజయవాడ తాలూకా గ్రామ పంచాయితీ అధ్యక్షుల సంఘసమావేశం నిన్నటి దినం పునాదిపాడు పంచాయితీ ఆఫీసులో స్థానిక పంచాయితీ అధ్యక్షులు శ్రీ వి. హనుమంతరావుగారి అధ్యక్షతను జరిగింది.

నూతన సంవత్సరానికి ఉప్పలూరు గ్రామ పంచాయితీ అధ్యక్షులు శ్రీ మునునూరు రామసుందరరావు గారు అధ్యక్షులుగాను, మరో 5 గురు కార్యనిర్వాహకవర్గ సభ్యులుగాను ఎన్నుకోబడ్డారు. తక్కినసభ్యులను కోఆప్టు చేసుకోడానికి తాలూకా అధ్యక్షునికి అధికారమిస్తూ తీర్మానించబడింది.

శ్రీ ప్రతాపగిరి రామమూర్తిగారి నిరశన దీక్ష

ఒంగోలు, ఏప్రిల్ 28

ఒంగోలు కళాశాలా ప్రిన్సిపాల్ శ్రీ ప్రతాపగిరి రామమూర్తిగారు నేటి ఉదయం నుండి 3 రోజులు నిరాహార దీక్ష సాగించుకున్నారు. కాలేజీ కమిటీకి రామమూర్తిగారికి మధ్య విభేదాలున్నవని ఇవి సమసిపోయేటట్లు చేయడానికే ఈ దీక్షఉద్దేశించబడిందని వారు తెలియజేశారు.

విజయవాడ విశేషాలు

హైద్రాబాద్ మోటారు కార్మికసంఘంవారి నాటక ప్రదర్శన

విజయవాడ, ఏప్రిల్ 30

హైద్రాబాద్‌రోడ్ ట్రాన్సుపోర్టు ఎంప్లాయీస్ యూనియన్ వైజ్ఞానిక దళంవారు 27 వ తేదీన విజయవాడ సిటీ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్, మోటార్ వర్కర్సు యూనియన్ వారి ఆధ్వర్యాన "శ్రమశక్తి" అనే నాటకమును ప్రదర్శించారు. కార్యక్రమం విజయవాడ మోటార్ కార్మికనాయకుడు శ్రీ వెల్లంకి సుబ్బారావుగారి పరిచయవాక్యాలతో ప్రారంభమైంది.

ఆంధ్ర మోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కర్సు ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ జోస్యభట్ల సత్యనారాయణగారు ప్రసంగించుతూ కార్మికులలో చైతన్యం కల్గించడానికి యీ వైజ్ఞానిక కార్యక్రమముకూడా ఒక మార్గమని, తరువాత యీవిధముగా ఒక రాష్ట్ర కార్మికులు మరొక రాష్ట్రంలో వైజ్ఞానిక ప్రదర్శనలిచ్చుట ద్వారా కార్మికసౌభ్రాతృత్వం పెంపొందుతుందని, ఐక్యపోరాటాలు జరుపుటకు నాందియని అన్నారు. యిట్టి కార్యక్రమాన్ని చేపట్టినందుకు హైద్రాబాదు రోడ్ ట్రాన్స్‌పోర్టు కార్మికుల నభినందించుచూ, సిటీ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్, మోటారు వర్కర్సు యూనియన్‌వారి తరఫున ఒక రజిత పాత్రను యీ దళంవారికి బహూకరించారు. తరువాత హైద్రాబాద్ రోడ్ ట్రాన్స్‌పోర్టు కార్మిక సంఘాధ్యక్షులు శ్రీ సయ్యద్‌ఖాసింగారు, తమకు విజయవాడ కార్మికవర్గం యిచ్చిన ఘనస్వాగతానికి అభివందనములను తెలియ చేశారు. పిమ్మట సమావేశమున కధ్యక్షులైన సిటీట్రేడ్ యూనియన్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి శ్రీ యన్. వి. ఆర్ సుబ్రహ్మణ్యశాస్త్రిగారి తుదిపలుకులతో కార్యక్రమము జయప్రదముగా ముగిసింది.

గుంటూరు జిల్లా బోర్డు హైస్కూలు పరీక్షలు

పరీక్షాపత్రాలు వెల్లడైనందున వాయిదా

తెనాలి, ఏప్రిల్ 28

గుంటూరు జిల్లా బోర్డు హైస్కూళ్లలో 3, 4, 5, ఫారములకు సాంవత్సరిక పరీక్షల ప్రశ్నా పత్రాలు వెల్లడి ఆయినందువల్ల వాయిదా వేయబడ్డాయి. యింతవరకూ జరిగిన పరీక్షలు రద్దుచేసి మళ్లీ మే నెల 17 వ తేదినుండి జరుపుతామని బోర్డు అధికారులు అన్ని స్కూళ్లకూ తెలియ జేశారు. పరీక్షా నిర్వహణాధికారుల అసమర్థతవల్ల ప్రశ్నా పత్రాలు వెల్లడి అయినట్లు తెలుస్తున్నది. మళ్ళీపరీక్షలు నిర్వహించడానికి 20 వేల రూపాయలవరకూ ఖర్చు అవుతుందని అంచనా. పరీక్షలు పూర్తయ్యేవరకూ ఉపాధ్యాయులెవరూ తమ స్థానాలు వదలి వెళ్ళరాదని ఉత్తరువు చేయబడింది.

పంచాయితీ వర్కర్లకు ఇంటి అద్దె

తాత్కాలికంగా రు 3 లు ఇవ్వాలని తుని బోర్డు నిర్ణయం

తుని, ఏప్రిల్ 27

తుని పంచాయితీబోర్డు వర్కర్లకు ఇంటి అద్దె రు 3 లు ఇవ్వాలని, ప్రభుత్వం నుండి శాంక్షను పొందేవరకు తాత్కాలికంగా రెండుమాసాలు ఇవ్వాలని నిన్న జరిగిన బోర్డు సమావేశంలో తీర్మానించబడింది. ఒకవేళ ప్రభుత్వం శాంక్షను చేయకపోతే, క్రమేపీ ఇచ్చిన డబ్బును జీతాలనుండి తగ్గించాలని తీర్మానం చేయబడింది. (వి.వి.)

వర్మా ఫిలిమ్స్‌వారి " పూజా " చిత్రంలో
భరత్‌భూషణ్ - పూర్ణిమ

పేదలు సాగుచేసే బంజరు భూములు

పట్టా లివ్వాలని దెందులూరు ఫిర్కా వ్యవసాయకూలీ సభ డిమాండు

ఏలూరు, ఏప్రిల్ 26

పశ్చిమ గోదావరిజిల్లా దెందులూరు ఫిర్కా వ్యవసాయకూలీ మహాసభ మొన్నను జరిగింది. శాసన సభ్యులు శ్రీ మొటపర్తి కూనేరావుగారు అధ్యక్షత వహించారు. తాలూకాలోని వివిధ గ్రామాలనుండి 30 మంది ప్రతినిధులు హాజరైనారు. రాష్ట్ర వ్యవసాయకూలీ నాయకులు,శాసనసభ్యులు శ్రీగుంటూరు బాపనయ్యగారు సభలో మాట్లాడుతూ బలవత్తరమైన వ్యవసాయకూలీఉద్యమం నిర్మించనిదే వ్యవసాయ కూలీలు తమ దైనందిన కోర్కెలను సాధించడంసాధ్యపడదని అన్నారు.

అధ్యక్షులు మాట్లాడుతూ రైతు-కూలీలు ఐక్యపోరాటాల ద్వారా తమ కోర్కెలను సాధించాలనీ, అందుకు రైతుకూలీ సామరస్య మెంతైనా అవసరమనీ అన్నారు.

చర్చల అనంతరం దిగువతీర్మానాలు ఆమోదించబడినాయి.

ప్రప్రథమంలో దెందులూరుఫిర్కా మృతవీరులకు జోహార్ లర్పిస్తూ తీర్మానించారు.

అనేక సంవత్సరాలనుండి ఎన్నో వ్యయప్రయాసలకు లోనై బంజరు భూములు సాగుచేస్తున్న వ్యవసాయ కూలీలకు పట్టాలివ్వాలని కోరుతూ తీర్మానించారు.

కనీస కూలీరేటు నిర్ణయిస్తూ చట్టం చేయాలనీ, కౌలుదార్లకు రక్షణ కల్పించాలనీ, అణు ఆయుధాలను నిషేధించాలని కోరుతూ మరికొన్ని తీర్మానాలు ఆమోదించారు.

అనంతరం ఏలూరు ప్రజానాట్య మండలి వారిచే "కనువిప్పు" నాటిక ప్రదర్శించబడింది.

రెంటపాళ్ల రాజకీయ పాఠశాల ముగింపు

సత్తెనపల్లి, ఏప్రిల్ 29

సత్తెనపల్లి తాలూకా రాజకీయ పాఠశాల రెంటపాళ్ళలో ఈనెల 15 వ తేదీ నుండి 25 వ తేదీ వరకు జరిగింది. ఈ పాఠశాలలో, తాలూకాలో రైతు, వ్యవసాయకూలీ, యువజన, మహిళా రంగాలలో పనిచేస్తున్న కమ్యూనిస్టు పార్టీ సభ్యులు, సానుభూతి పరులు 19 గ్రామాల నుండి 62 మంది పాల్గొన్నారు. స్కూలులో తత్వశాస్త్రం, అర్థశాస్త్రం, రాజకీయ భూగోళం, జాతీయోద్యమ చరిత్ర, వ్యవసాయ సమస్యలు, కమ్యూనిస్టుపార్టీ కార్యక్రమాన్ని గురించి పాఠాలు చెప్పబడ్డాయి.

స్కూలు ముగింపు రోజున, విద్యార్థులు వివిధ రంగాలలోని ప్రధాన సమస్యలు - ముఖ్యంగా బంజర్లు, కౌలుదారి, కూలీ పాలేరు సమస్యల మీద తక్షణ కర్తవ్యాలు చర్చించారు. తమ వంతు కర్తవ్యాలు నెరవేర్చడానికై ప్రతిజ్ఞ తీసుకున్నారు. (వి. వి)

కాశ్మీర్ లోయలో కాస్మిక్ కిరణాల కేంద్రాన్ని నెలకొల్పుతామని అణుశక్తి కమిషన్ అధ్యక్షుడు శ్రీ భాభా తెలిపారు.

చిత్ర సమీక్ష

నేషనల్ ఆర్టు థియేటర్స్‌వారి తోడు దొంగలు

ఒకరికిచేసిన అపకారం, అన్యాయం పిశాచంలా వెంటాడి మానవునికి మనశ్శాంతి లేకుండా పీడిస్తుందనీ, తానితరులకు కలిగించిన నష్టాన్ని సరిదిద్దడం వలననే మానవుడు మనశ్శాంతిని సంపాదించుకోగలడనీ ఒక నీతిని బోధించడానికి తోడుదొంగలు చిత్రం వుద్దేశించారు.

అన్నపూర్ణ ధాన్యంమిల్లు మానేజరు పరమేశం రాముడు అనే కార్మికుని మరణానికి కారకుడయ్యేడు. ఆ ఆలోచన ఆతనికి నిద్రాహారాలు లేకుండా పీడించింది. ఓ బుద్ధిహీనుడైన డాక్టరూ, కపటజ్యోతిష్కుడూ అతనికి ప్రాణభయం కలిగిస్తారు.

చనిపోయిన రాముడు కుటుంబానికి సహాయపడి పాపపరిహారం చేయించి పరమేశానికి మనశ్శాంతి కలిగించాలి. అంతేతయితే కథసాగేదెల్లా? అందుచేత నిర్మాతలు పరమేశాన్ని ప్రపంచంమీదికి తోలారు. అతడు రాముడికి చేసిన అన్యాయాన్ని గుర్తించేటట్లు చేసేటందుకై కార్మికులతో సఖ్యంగావుండే మానేజర్నీ, మానేజరు పాలనలో సర్వాత్మనా సంతృప్తులయిన కార్మికుల్నీ సృష్టించారు. పరపీడన పాపంయొక్క తీవ్రతనీ, పాపప్రాయశ్చిత్తం ఫలితంగా కలిగే ఆనందాన్నీ ప్రదర్శిస్తూ నరకాన్నీ, స్వర్గాన్నీ వాని వాని పరికరాలతోసహా తెర ఎక్కించారు.

ఈ విధంగా నిర్మాతలు మాధవమ్మకాల భయాల్నీ, 20 వ శతాబ్దంనాటి వర్గసామరస్య భావాల్నీ జోడించి, కలగా పులగంగా చిత్రాన్ని తయారుచేశారు.

రాముని మరణానికి కారకుడనయ్యాననే విచారంతో మానేజరుమనశ్శాంతిని కోల్పోయి బాధపడుతున్నట్లు చూపిన సగభాగం చిత్రం సహజంగా, సాఫీగా నడిచింది.

మిగిలినభాగం చూస్తుంటే నిర్మాతలు కథ మరిచిపోయి కంటికి కనిపించినదీ, మనస్సుకి తోచినదీ చిత్రం తీసినట్లనిపిస్తుంది. దానిని చూశాక ప్రథమ భాగం కలిగించిన సంతృప్తి కాస్తా పోతుంది.

దీనిలోని ప్రధానపాత్రలు రెండే రెండు, మిల్లుయజమాని, మానేజరు. మిగిలిన పాత్రలన్నీ చుట్టపు చూపుగా వచ్చి పోయేవే.

ప్రధానపాత్రధారులయిన శ్రీ ఎన్. టి. రామారావు(మానేజరు), శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావు (యజమాని) గార్లు తమ పాత్రలను సమర్థంగా నిర్వహించారు.

మనిలా పోటీలకు ఆంధ్ర ఆటగాండ్రు

తప్పక పంపబడాలని విద్యామంత్రి విజ్ఞప్తి

కర్నూలు, ఏప్రిల్ 29

మనిలాలో జరిగే అఖిల ఆసియా ఆటలలో బరువు ఎత్తే పోటీలలో పాల్గొనేందుకు శ్రీ దండమూడి రాజగోపాల్, కామినేని ఈశ్వరరావు, యస్. వి. శీతారామన్ గార్లను పంపించాలని ఆంధ్ర విద్యాశాఖ మంత్రి శ్రీ బలుసు ప్రభాకర పట్టాభిరామారావుగారు భారత వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ కార్యదర్శికి తంతి పంపారు.

ఈ ఛాంపియన్లు ఆసియాలో బరువు ఎత్తే పోటీలలో రికార్డులు స్థాపించారని, వారిని మనిలాకు పంపకపోవడం అన్యాయమని పట్టాభిరామారావుగారు పేర్కొన్నారు. వారికి ప్యాసుపోర్టులు కూడా వచ్చిన వన్నారు.

వర్మా ఫిలిమ్స్‌వారి " పూజా " చిత్రంలో
భరత్‌భూషణ్ - శకుంతల

న్యూఇండియాక్లబ్
కాఫీ అండ్ మిలటరీభోజనహోటల్
మెయిన్ రోడ్, గుంటూరు.

ఫ్రెంచి ఇండియా విముక్తి పోరాటానికి సంయుక్త సంఘటన

కమ్యూనిస్టుపార్టీ, తదితరసంస్థలతో స్థాపన

పుదుచ్చేరి, ఏప్రిల్ 29

ఫ్రెంచి ఇండియా స్థావరాల విముక్తిసమరాన్ని ఉధృతం చేయడానికి ఫ్రెంచి ఇండియా కమ్యూనిస్టుపార్టీ, కేంద్ర విలీనీకరణ కాంగ్రెస్, తదితర సంస్థలతో సంయుక్త సంఘటన ఏర్పడిందని జాతీయ వర్గాలు నేడు తెలిపారు.

కమ్యూనిస్టు నాయకుడు శ్రీ సుబ్బయ్య, విలీనీకరణ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ సెల్లాన్ నాయకెర్, ఫ్రెంచి ఇండియా వామపక్ష పార్టీల ప్రతినిధులు, విద్యార్థి కాంగ్రెస్ ప్రతినిధి నిన్న విల్లిపురంలో సమావేశమై, ప్రత్యక్ష కార్యాచరణకు ఉమ్మడి కార్యక్రమం నిర్ణయించుకున్నారని వారన్నారు. స్వాతంత్ర్య పోరాటం సాగించడానికి విలీనీకరణ పార్టీల ప్రతినిధులతో సంయుక్త కార్యాచరణ సమితి ఏర్పరచబడుతున్నదని అన్నారు.

ఈలోగా పుదుచ్చేరిలో ఆయుధాల కోసమంటూ ఫ్రెంచి పోలీసులు జాతీయ నాయకుల ఇండ్లు సోదా చేస్తునే వున్నారు. ఈ సాయంత్రం వరకు 12 ఇళ్లు సోదా చేశారు కాని ఏమీ దొరకలేదు.

విముక్తి పోరాటం సాగించడానికి అఖిలపక్ష కార్యాచరణ సమితిని నియమించాలని, పుదుచ్చేరిలో గతఆదివారం అఖిలపక్ష సమావేశంలో చేయబడిన తీర్మానం దృష్ట్యా, విల్లిపురం చర్చలు జరిగినవని పైవర్గాలవారన్నారు. విముక్తి పోరాటంలో పార్టీ విభేదాలు అడ్డు రాకూడదని నాయకులు భావించారు.

నిన్న జరిగిన సమాలోచనలలో నాయకులు ఇంతవరకు జరిగిన పురోగతిని సమీక్షించి, సత్యాగ్రహులు పోలీసు జులుమును ఎదుర్కొన్న పద్ధతికి సంతృప్తి వెలిబుచ్చారు.

ఇకమీదట జరిగే సత్యాగ్రహం, ఎక్కువమంది వలంటీర్లతో జరుగుతుంది. ప్రజలుకూడా వలంటీర్లతో కలుస్తారు.

గతవారంలో జరిగిన సంఘటనలను సమీక్షిస్తూ జాతీయవర్గాల ప్రతినిధి ఒకరు ఇలా అన్నారు:

"ఢిల్లీలో జరుగుతున్న సంప్రతింపులు కొంతవరకు ఉద్యమ స్తబ్ధతకు కారణం కావచ్చు. ఫ్రెంచి ప్రధాని ప్రత్యేకదూత ఫ్రెంచి స్థావరాలకు స్వాతంత్ర్యం తెచ్చాడని కొన్ని పత్రికా వార్తలలో తెలుపబడింది. అందువల్ల కొంతకాలం అందరి దృష్టి అటువైపు మళ్ళించబడింది."

పోలీసు నిర్బంధంగాని, రౌడీ చర్యలుగాని, ప్రజలపట్టుదలను సడలించలేవని పైవర్గాలవారన్నారు. ప్రజలు కడవరకూ పోరాటం సాగించాలని ఇంకా కృతనిశ్చయులై వున్నారని అన్నారు.

మాహే కాల్పులపై అధికార రిపోర్టు

మద్రాసుప్రభుత్వాని కందిందట

మద్రాసు, ఏప్రిల్ 30

మాహేవద్ద భారత పౌరులపై ఫ్రెంచి ఇండియా పోలీసులు జరిపిన కాల్పులను గురించి అధికార రిపోర్టు ప్రభుత్వానికందిందని మద్రాసు ముఖ్యమంత్రి శ్రీ కామరాజనాడార్ నేడు విలేఖరులకు చెప్పారు.

మాహే సరిహద్దుపై ఈ వరకే ప్రభుత్వం పోలీస్ కాపలాను పెట్టిందని ఇకవేరే చర్యలు అవసరంలేదని ఆయన అన్నారు.

"ఫ్రెంచి స్థావరాల" ప్రజలకు తక్షణం సహాయపడాలి

ప్రభుత్వానికి తమిళకమ్యూనిస్టు కమిటీ-కార్యదర్శి విజ్ఞప్తి

విల్లిపురం, ఏప్రిల్ 29

మహేవద్ద భారతపౌరులపై ఫ్రెంచి పోలీసుల కాల్పులను ఖండిస్తూ తమిళనాడు కమ్యూనిస్టుకమిటీ కార్యదర్శి శ్రీ యం. ఆర్. వెంకట్రామన్ నేడొక ప్రకటన చేశారు.

ఆ ప్రకటనలో ఆయన ఇలా అన్నారు:

"మాహేవద్ద ఫ్రెంచిపోలీసులకాల్పులనుగురించి, మన దేశమంతా దిగ్భ్రాంతి చెందివుంటుంది. దీనినిబట్టి ఒకవైపు భారత ప్రభుత్వంతో సంప్రతింపులు సాగిస్తున్నట్టు నటిస్తూ, విలీనీకరణ ఉద్యమంపై ఫ్రెంచి ప్రభుత్వం అమానుష హింసాకాండ సాగిస్తున్నది. మన గడ్డపై ఏమైనా చేయగలమని ఫ్రెంచి సామ్రాజ్య వాదులు భావిస్తున్నారు. ఆత్మగౌరవం గల ఏ భారతీయుడూ ఈ చర్యలను సహించజాలడు. వారితో సంప్రతింపుల సమస్యలేదు. వారు తక్షణం ఇక్కడ నుంచి వెళ్ళిపోవాలి.

ఈవరకే విముక్తం చేయబడిన ప్రాంతాలను భారత యూనియన్‌తో కలుపుకోవాలని, భారత ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఈ ప్రాంతంలోని ప్రజలకు మనం ఆహారం, నీరు, ఆరోగ్య సౌకర్యాలు ముఖ్యంగా అందజేయాలి.

పోరాటం సాగిస్తున్న ప్రజలకు మనం ధన, మనుష్యసహాయం పంపాలి. వలస పాలనకు అంతం చేయడానికి జరిగే పోరాటంకన్న పవిత్రమైనదేదీ ఉండబోదు. ఈవిషయంలో కేంద్రంగాని, మద్రాసుప్రభుత్వంకాని, జాప్యం చేస్తే, ప్రజలు నిరుత్సాహ పడతారు. ఫ్రెంచి సామ్రాజ్య వాదులుకూడా దానిని అవకాశంగా తీసుకుంటారు. ఇందులో పార్టీ సమస్య ఏమీలేదు. భారత ప్రజలంతా ఐక్యంగా విలీనీకరణను కోరితే, దానిని అడ్డగలశక్తి ఏదీ లేదు. ప్రజలంతా అలాంటి చర్యలు తీసుకుంటే, ప్రభుత్వంకూడా ఇంకా హాని జరగడానికి ముందే చర్య తీసుకోడానికి వీలవుతుంది.

మాహేలో ఫ్రెంచి పోలీసులు జరిపిన హత్యలను ఖండించాలని, ఇండియాతో ఫ్రెంచి స్థావరాల తక్షణ విలీనాన్ని కోరాలని, తమిళనాడులో ప్రతి ఒక్కరినీ కోరుతున్నాను. విముక్తి ఉద్యమానికికూడా అందరూ సహాయపడాలి."

బజారు ధరలు

విజయవాడ, ఏప్రిల్ 30

(మధ్యాహ్నం x.1-0)

బంగారం ధరలు

		రూ.	అ.	పై
మేలిమి : పొట్లా		93	12	0
మూసా		93	4	0
నవరసు		61	8	0
వెండి : 100 తులములు		173	0	0
1 తులము		1	12	0
ధాన్యం ధరలు				
24 నెంబరు		23	8	0
కంకసన్నాలు		21	0	0
12 నెంబరు		20	4	0
అక్కుళ్ళు		20	0	0
కుసుమ		19	12	0
కొజామణి		19	12	0
బియ్యం ధరలు				
24 నెంబరు		55	0	0
కంకసన్నాలు		49	0	0
12 నెంబరు		46	0	0
అక్కుళ్ళు		45	8	0
కుసుమ		45	0	0
కొజామణి		45	0	0
అపరాల ధరలు				
మినుములు 240 శే॥	46/-8	47	0	0
కందులు	24/-8	25	0	0
వల్లిపెసలు (మాగాని)		36	0	0
పచ్చపెసలు 230 శే॥		34	8	0
పచ్చపెసలు (మెట్టవి)	37/-	38	8	0
శెనగలు		37	8	0
,, పంజాబు		35	0	0
ధనియాలు 90 శేరులు		27	0	0
ఉలవలు	29/-	30	0	0
ఆముదాలు		32	0	0
పంచదార (ఉయ్యూరు)		92	4	0
బెల్లం మణుగు	6/-	6	4	0
మిర్చి దేశవాళీ మణుగు	25/-	26	0	0
మిర్చి పైజాము	18/-	20	0	0
వేరుశెనగపప్పు 177 శేరులు		58	12	0
,, నూనె మణుగు		15	6	0
,, చెక్క 160 శేరులు		16	8	0
,, మడ్డిపిండి 160 ,,		18	0	0
కొబ్బరినూనె డబ్బా	29/-12	30	0	0
పసుపు పుట్టి	215/-	220	0	0
పుంచులు 100		104	8	0
నీరుల్లిపాయలు మ॥		1	5	0
వెల్లుల్లి మణుగు	6/-	6	8	0

కృష్ణాజిల్లా విద్యార్థి యువజన వేసవి పాఠశాల
పెదఓగిరాలలో, మే 10 నుండి 20 వరకు
సుందరయ్య, చంద్రం, రమేషచంద్ర, బలరామమూర్తి
యన్. ఆర్. దాసరిగార్లు ఆహ్వానించబడినారు.

పుదుచ్చేరిలో మేదినోత్సవ సన్నాహాలు

పుదుచ్చేరి, ఏప్రిల్ 29

పుదుచ్చేరిలో 30000 మంది మిల్లు కార్మికులు మే దినోత్సవాలలో పాల్గొనడానికి సన్నద్ధులవుతున్నారు.

మే దినం జరపడానికి వివిధ ఫ్యాక్టరీలు తమ స్వంతకమిటీలు స్థాపించినవని ఒక కార్మిక నాయకుడు చెప్పారు. బహిరంగసభకు ప్రభుత్వాన్ని అనుమతి కోరామన్నారు.

కర్నూలులో పోస్టల్ కార్యాలయం

స్థలం ఇవ్వడానికి మున్సిపల్ కౌన్సిల్ నిరాకరణ

కర్నూలు, ఏప్రిల్ 29

పోస్టు టెలిగ్రాఫ్ కార్యాలయం నిర్మించేందుకు కొండారెడ్డి బురుజువద్ద గల బహిరంగ స్థలాన్ని పోస్టు టెలిగ్రాఫ్ శాఖకు ఇచ్చేందుకు కర్నూలు మున్సిపల్ కౌన్సిల్ నిరాకరించింది. ఈ స్థలం బహిరంగసమావేశాలకు ఉపయోగపడే ప్రాంతంలో వున్నందున దానిని ఇవ్వరాదని మున్సిపల్ కమీషనర్ చేసిన సిఫార్సును కౌన్సిల్ ఆమోదించింది.

ఇండియాలో ఫ్రెంచి అమెరికన్ మిలిటరీ విమానాల నిలుపుదల

రాజ్యసభలో ప్రస్తావన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29

ఇండోచైనాకు ఫ్రెంచి సైనికులను చేరవేస్తున్న అమెరికా, ఫ్రెంచి మిలిటరీ విమానాలు కలకత్తావద్ద డమ్‌డమ్ విమానాశ్రయంలో ఆగిన విషయమై కలకత్తా పత్రికలు ప్రచురించిన వార్తను నేడు కమ్యూనిస్టు సభ్యుడు భూపేష్ గుప్త రాజ్యసభలో ప్రస్తావనకు తెచ్చారు.

[కలకత్తా పత్రికా వార్త వివరాలు నిన్నటి సంచికలో ప్రచురించాం-సం॥]

నేడు రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయం ముగిసిన వెంటనే శ్రీ భూపేష్‌గుప్త లేచి జాతీయ ప్రాముఖ్యతగల-బహుశా అంతర్జాతీయ ప్రాముఖ్యతగల విషయాన్ని తాను సభవారి దృష్టికి తీసుకొనిరాదలచానని తెలుపుతూ ఇలా చెప్పారు:

ఇండోచైనాకు ఫ్రెంచి సైనికులను చేరవేస్తున్న ఒక అమెరికన్ గ్లోబ్ మాస్టర్ విమానం డమ్ డమ్ విమానాశ్రయంలో ఏప్రిల్ 24 వ తేదీ ఉదయం ఆరుగంటలకు దిగినట్లు కలకత్తా నుండి వెలువడే "స్వాధీనత" దినపత్రిక ఒక వార్తను ప్రచురించింది. అలాగే ఏప్రిల్ 27 వ తేదీన ఒక ఫ్రెంచి మిలిటరీ విమానంకూడా ఆగినదని వార్త ప్రచురితమైంది. ఇంతవరకూ ఈ రెండువార్తలు అబద్ధమని ప్రభుత్వం ప్రకటించలేదు. ఇది చాల అతిముఖ్యమైన విషయం.

సభాధ్యక్షులు: ప్రభుత్వం ఈ విషయమై విచారణ సలుపుతోంది.

ఆ తరువాత సభవారు మామూలు శాసనసభా కార్యక్రమాన్ని ప్రారంభించారు. (వి. వి.)

'ఎవరెస్టు విజేత టెన్సింగ్ బొంబాయిలో 5 రోజులున్న తర్వాత ఢిల్లీ పయనమై వెళ్ళారు.

నెల్లూరు, రాయలసీమ జిల్లాలపై ఆధిపత్యం

తిరుపతి యూనివర్సిటీ బిల్లు వివరాలు

కర్నూలు, ఏప్రిల్ 29

తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ స్థాపనకు ఆంధ్ర ప్రభుత్వం నేడు బిల్లు ప్రచురించింది. ఈ యూనివర్సిటీకి అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు, నెల్లూరు జిల్లాలపై ఆధ్వర్యం వుంటుంది. దీనికి సెనేట్, సిండికేట్, అకడమిక్ కౌన్సిల్ వుంటాయి.

ఆంధ్రరాష్ట్రగవర్నరు వెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి ఛాన్సలర్‌గాను, విద్యామంత్రి ప్రోఛాన్సలర్‌గాను వుంటారు. వైస్‌ఛాన్సలర్‌ను సెనేట్ ఎన్నుకుంటుంది.

ఉన్నతవిద్యను ప్రోత్సహించడానికి ముఖ్యంగా ప్రాచీనభాషలలో, భారతీయ కళలలో, సంస్కృతిలో పరిశోధనను పురికొల్పడానికి ఈయూనివర్సిటీ స్థాపించ బడుతున్నదని బిల్లులో పేర్కొనబడింది. అంతేగాక, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక యూనివర్సిటీ స్థాపించాలని ప్రజలు కోరుతున్నారని కూడా తెలుపబడింది. రాయలసీమలో 8 కాలేజీలు మాత్రమే వున్నవని, వీటిలో కూడా ఆనర్సు కోర్సులు, పరిశోధన వసతులు లేవని, అందుచేత ఉన్నత విద్యకు ఆ ప్రాంత విద్యార్థులకు మరింత అవకాశాలు కలిగించాలని బిల్లులో వివరించారు.

యూనివర్సిటీ సెనేట్‌లో ఛాన్సలర్, ప్రోఛాన్సలర్, వైస్‌ఛాన్సలర్, విద్యాశాఖ డైరెక్టర్, వైద్య, పారిశ్రామిక, వ్యవసాయక శాఖల డైరక్టర్లు, యూనివర్సిటీ ప్రిన్సిపాల్, ఇతర కాలేజీల ప్రిన్సిపాల్స్, యూనివర్సిటీ ప్రొఫెసర్లు, సిండికేట్ సభ్యులు, తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సభ్యులుగా వుంటారు. విద్యాభివృద్ధికి గొప్పసేవ చేశారని సిండికేట్ చేసిన సిఫార్సు చేయబడిన ముగ్గురు, 25 వేలకు పైగావిరాళం ఇచ్చేవారు జీవిత సభ్యులుగా వుంటారు. 33 గురు సభ్యులను వివిధ ఎలక్టరల్ కాలేజీలనుండి ఎన్నుకుంటారు. రాయలసీమ, నెల్లూరు మున్సిపాలిటీలు కలిసి ఇద్దరు సభ్యులను ఎన్నుకుంటాయి. యూనివర్సిటీ ప్రాంతంలోని పంచాయితీబోర్డులు ఒక సభ్యుని ఎన్నుకుంటాయి. తెలుగు, తమిళం, కన్నడం, సంస్కృతం, ఉర్దూ భాషలకు ప్రాతినిధ్యం లభించే 6 గురిని ఛాన్సలర్ నియుక్తి చేస్తారు.

యూనివర్సిటీ సిండికేట్‌లో వైస్‌ఛాన్సలర్‌గాక, 11 మంది సభ్యులుంటారు. అకడమిక్ కౌన్సిల్‌లో వైస్‌ఛాన్సలర్, విద్యాశాఖ డైరక్టర్, యూనివర్సిటీ ప్రిన్సిపాల్, వివిధ కాలేజీల ప్రిన్సిపాల్స్, యూనివర్సిటీ కాలేజీలలో వివిధ శాఖల అధిపతులు, సిండికేట్ సభ్యులు వుంటారు.

యూనివర్సిటీలో ప్రాచీన భాషలు ప్రాచీన భారతీయకళ, వాస్తుశిల్పం, సంగీతం, నాట్యం, ఇతర లలితకళలు ఆర్ట్సు, సైన్సు, కామర్సు, టెక్నాలజీ, ఇంజనీరింగ్, టీచింగ్ శాఖలుంటాయి. ప్రతిశాఖకు ప్రత్యేక విద్యాబోర్డు వుంటుంది.

యూనివర్సిటీ నిర్వహణకు తిరుపతి దేవస్థానంవారు ఏటా కనీసం రెండున్నర లక్షల రూపాయ లివ్వాలి.

ఆంధ్ర, వెంకటేశ్వర విశ్వ విద్యాలయాలు తమ వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకుంటూ, మొత్తం ఆంధ్ర ప్రజల అవసరాలను తీర్చగలవని, తమ కార్యకలాపాలను సమన్వయ పర్చగలవని బిల్లులోని ఉద్దేశ్యాలలో ఆశాభావం వెలిబుచ్చబడింది.

తిరుపతిలో యూనివర్సిటీ స్థాపనను ఆమోదిస్తూ దేవస్థానం ట్రస్టీలు ఏప్రిల్ 17 న తీర్మానం చేశారు. యూనివర్సిటీకి ఆరున్నరలక్షల రూపాయలు నగదు, 18½ లక్షల రూపాయల విలువగల స్థిరాస్తులను ఇవ్వ వీలవుతుందని అప్పుడు తెలుపబడింది.

మే 10 న [illegible] ఆంధ్రశాసనసభ సమావేశమైనపుడు ఈ బిల్లు ప్రథమంగా చర్చకువస్తుంది.

బొంబాయి రాష్ట్రంలో బియ్యంపై నిబంధనలన్నిటినీ తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు చేసింది.

◆ ◆ ◆

కర్నూలు రైల్వేస్టేషన్‌లో ప్రయాణీకులకు ఎక్కువ సౌకర్యాలు కల్పించ బడుతున్నాయి.

ఇండియా-టిబెట్‌లమధ్యవ్యాపారానికి భారత - చైనాల సంధి

టిబెట్‌పై జనచైనా ఆధిపత్యానికి ఇండియా ప్రభుత్వం గుర్తింపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29

చైనాప్రాంతమైన టిబెట్‌కు - భారతదేశానికి మధ్య వాణిజ్య వ్యాపారాలకోసం నేడు పెకింగ్‌లో భారత - చైనా ప్రభుత్వాల ప్రతినిధులు ఒక ఒడంబడిక పత్రంపై సంతకాలు చేశారు. ఈ ఒడంబడిక ఎనిమిది సంవత్సరాలపాటు అమలులో వుంటుంది.

ఈ ఒడంబడికను ఉభయ ప్రభుత్వాలు ధృవపరచిన మరునాటినుండి అది అమలులోకి వస్తుంది. ఈ ఒడంబడికకోసం గత నాలుగు మాసాలుగా పెకింగులో భారత - చైనా ప్రతినిధుల మధ్య సంప్రతింపులు కొనసాగుతున్నాయి. భారత ప్రతినిధి వర్గానికి చైనాలోని మన రాయబారి శ్రీ యన్. రాఘవన్, చైనా ప్రతినిధి వర్గానికి విదేశాంగ వ్యవహారాల ఉపమంత్రి చాంగ్-హన్-ఫూ గార్లు ఈ సంప్రతింపులలో నాయకత్వం వహించారు.

ఉభయ దేశాల ప్రాంతాలపై వారి వారి సర్వస్వాతంత్ర్య ప్రతిపత్తిని పరస్పరం గౌరవించుకొనే ప్రాతిపదికపై ఈసంప్రతింపులు, ఒడంబడికజరిగాయి.

భారత - చైనా దేశాలు ఒకరిపై ఒకరు యుద్ధం చేయరాదనీ, ఒకరి ఆంతరంగిక వ్యవహారాల్లో మరొకరు జోక్యం కల్పించుకోరాదనీ, పరస్పరం లాభదాయకంగా ఒకరి సరసన మరొకరు శాంతియుతంగామనాలనే సూత్రాలను ప్రాతిపదిక చేసుకొని ఈ ఒడంబడిక చేసుకోబడింది.

ఈ ఒడంబడిక ద్వారా ఇండియా టిబెట్ పై చైనాకు గల ఆధిపత్యాన్ని అంగీకరించింది.

ఈ ఒడంబడికలో ఆరు అంశాలున్నాయి. ఒడంబడిక పాఠం హిందీ, చైనీస్, ఇంగ్లీషుభాషల్లో తయారుచేయబడింది. ఈ మూడుభాషల్లోఒడంబడిక పాఠాలకు సమానంగావిలువవుంటుంది. ఒడంబడికపై ఉభయదేశాల ప్రతినిధివర్గ నాయకులు సంతకాలుచేశారు.

ఒడంబడికలో ఇండియా - టిబెట్ సరిహద్దులలోని వ్యాపార కేంద్రాలు వ్యాపారస్తులు, యాత్రికులు వెళ్లే బాటలు వివరంగా పేర్కొనబడినాయి.

ఈ ఒడంబడికతో పాటు టిబెట్‌లోని యాటుంగ్, గ్యాన్‌సిలలో ప్రస్తుతం ఉన్న భారతీయ రక్షణ మిలిటరీ దళం ఆరునెలల లోపల ఉపసంహరింప జేయాలని అంగీకరింపబడింది. అయితే చైనాలోని భారతీయ వ్యాపారస్తులకు, వారి ఆస్తిపాస్తులకు, యాత్రికులకు రక్షణ యివ్వడానికి చైనా ప్రభుత్వం గ్యారంటీ నిచ్చింది. అలాగే ఇండియాలో చైనా వ్యాపారస్తుల యాత్రికుల రక్షణకు భారత ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చింది.

టిబెట్ ప్రాంతంలోని యాతుంగ్, గ్యాన్‌సి; గార్టక్‌లలో ఇండియా, వాణిజ్య కేంద్రాలను స్థాపించుకోడానికీ, భారతదేశంలో న్యూఢిల్లీ, కలకత్తా, కాళింపాంగ్‌లలో చైనా వాణిజ్య కేంద్రాలను స్థాపించుకోడానికీ ఈ ఒడంబడిక అవకాశం కల్పిస్తుంది.

ఈ ఒడంబడిక ఎనిమిదేండ్ల గడువు తరువాత ఆరునెలల నోటీసులో ఇంకా పెంచుకోడానికి అవకాశం ఉంది.

చిత్తూరుజిల్లాలో వివాద ప్రాంతాలు

సరిహద్దు సంఘం విచారించాలని మద్రాసు ప్రభుత్వ సూచన

మద్రాసు, ఏప్రిల్ 29

చిత్తూరుజిల్లాలో వివాదగ్రస్త ప్రాంతాల భవిష్యత్తును సరిహద్దు సంఘానికి నివేదించాలని మద్రాసు ప్రభుత్వం ఇండియా ప్రభుత్వాన్ని కోరినట్లు శ్రీ కామరాజనాడార్ నేడు తెలియజేశారు.

ఉభయ ప్రభుత్వాలు సంప్రతింపుల ద్వారా ఈ సమస్యను పరిష్కరించుకోవాలని ఇండియా ప్రభుత్వం ఇటీవల మద్రాసు ప్రభుత్వానికి సూచించిందని, తాను సరిహద్దుసంఘం వేయాలని జవాబు పంపామని శ్రీ కామరాజ్ తెలిపారు. వివాదగ్రస్త ప్రాంతాల భవిష్యత్తు నిర్ణయించడానికి మద్రాసు ఆంధ్ర ప్రభుత్వాల ప్రతినిధుల సమావేశం జరిపే ముందు భాషా ప్రాతిపదికపై గ్రామాల వారీగా జనాభా లెక్కలు సేకరించాలని కూడా తాను సూచించామన్నారు. ఈ వివరాలు సేకరించడానికి కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఏర్పాట్లు చేస్తున్నన్నారు.

పార్లమెంటు సభ్యులకు రైల్వే ప్రయాణ ఖర్చులు

సెలక్టు కమిటీ సిఫార్సుకు కాంగ్రెసు సభ్యుల అసంతృప్తి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30

పార్లమెంటు సభ్యులకు తమ నియోజక వర్గాలనుండి ఢిల్లీకి రెండు సెకండ్ క్లాసు, ఒక మూడో తరగతి ప్రయాణపు ఖర్చులు చెల్లించాలని ఉభయ సభ సభ్యులతో కూడిన సంయుక్త సెలక్టు కమిటీ ఇటీవల పార్లమెంటుకు చేసిన సిఫార్సు కాంగ్రెసు సభ్యులకు అసంతృప్తి కరంగా ఉన్నట్లు తెలుస్తోంది.

పార్లమెంటు సభ్యులందరికీ ఆలిండియా రైల్వే పాస్‌లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఒక వందమంది కాంగ్రెసు సభ్యులు మెమొరాండంను సమర్పించబోతున్నారు. (వి. వి.)

ఇండోచైనా యుద్ధంలో అమెరికా జోక్యం

ఐసెన్‌హోవర్ వివరణ

వాషింగ్‌టన్, ఏప్రిల్ 29

ఇండోచైనా యుద్ధంలో ధనం, సామగ్రిని పంపడం తప్ప అంతకుమించి వ్యవహరించడానికి అమెరికా శాసనసభ అంగీకరించలేదని అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ నేడు పత్రికావిలేఖరులకు తెలియజేశాడు.

ఇండోచైనా యుద్ధానికి అమెరికా సేనలను పంపుతుందా అని ప్రశ్నించగా ఐసెన్‌హోవర్ పైవిధంగా జవాబు చెప్పాడు.

చట్టరీత్యా తప్ప అమెరికా యే యుద్ధంలోనూ పాల్గొనదని అనేకసార్లు తాను చెప్పానని ఐసెన్ హోవర్ అన్నాడు. అందుకు అమెరికా కాంగ్రెస్ అనుమతి అవసరం అన్నాడు.

ఆ ప్రాంతంలో కమ్యూనిస్టు వ్యతిరేక కూటమి అంతా కూలిపోతుందని తాను నమ్మడం లేదని అన్నాడు.

ఇండోచైనా యుద్ధంలో అమెరికా జోక్యం కలుగచేసుకోవలసిందిగా ఫ్రాన్సు కోరగా బ్రిటన్ అంగీకరించనందున అమెరికా తన అభిప్రాయం మార్చుకొన్నదా అని ఐసెన్‌హోవర్‌ను ప్రశ్నించారు.

అమెరికా ఏమిచేయాలో అని బ్రిటన్ ఎలాంటి సలహా ఈయలేదని ఐసెన్ హోవర్ జవాబిచ్చాడు.

జెనీవా సభ జరుగుతున్న యీ కాలంలో ఇండోచైనా భవిష్యత్తును గురించి ఊహాగానం చేయబోవడం లేదని ఐసెన్ హోవర్ అన్నాడు.

ప్రత్యేక వివాహాల బిల్లుపై రాజ్యసభలో చర్చలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29

ప్రత్యేక వివాహాలబిల్లుపై పార్లమెంటు ఉభయసభల సంయుక్త సిఫార్సుల కమిటీ నివేదికపై నేడు రాజ్యసభలో చర్చ జరిగింది.

న్యాయశాఖామంత్రి శ్రీ బిశ్వాస్ నివేదికను సభవారికి సమర్పిస్తూ బిల్లులో సిఫార్సు కమిటీ చేసిన మార్పులను, మెజారిటీ అభిప్రాయంతో విభేదించిన వారి అభిప్రాయాలను వివరించారు.

ఈ సందర్భంలో ప్రభుత్వానికి ఒక ప్రత్యేక అభిప్రాయం లేదనీ, సభ్యుల అభిమతానుసారం నడుచుకోడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

సిఫార్సుల కమిటీ నివేదికలో ఒక ప్రత్యేకత ఉంది. కమిటీ సభ్యులలోని 45 మందిలో 18 మంది కమిటీ రిపోర్టుతో విభేదించి, ప్రత్యేకనోట్‌ను సమర్పించారు. కమిటీలో 11 మంది స్త్రీసభ్యులలోను ఎనిమిదిమంది ప్రత్యేక నోట్‌లో సంతకాలు పెట్టారు.

న్యాయశాఖా మంత్రి బిల్లులోని క్లాజులను వివరించుతూ ఇందులో నిర్బంధం ఏమీలేదు గనుక దేశంలోని అన్ని మతాలవారు ఈ చట్టం ప్రకారం వివాహం చేసుకోవచ్చునన్నారు. ఇష్టంలేనివారు తమ తమ ఆచారాలకు అనుగుణ్యంగా వ్యవహరించే అవకాశం ఉంది.

వివాహానికి కనీసం ఎంత వయస్సు ఉండాలన్న విషయంలో చాల భేదాభిప్రాయాలున్నాయనిమంత్రి తెలుపుతూ, సిఫార్సుల కమిటీ యువతీయువకులకు-ఉభయులకు 18 ఏండ్లుఉండాలని నిర్ణయించినదన్నారు.

ప్రత్యేక వివాహాలబిల్లుక్రింద వివిధ మతాలకు చెందిన దంపతులకు కలిగిన బిడ్డలు ఏమతానికి చెందుతారన్న విషయంలో కమిటీ ఒక నిర్ణయానికి రాలేకపోయిందన్నారు. ఇలాంటి విషయాన్ని దంపతులు సంప్రదించుకొని నిర్ణయించుకోవడం అవసరమనే అభిప్రాయాన్ని శ్రీ బిశ్వాస్ వెలిబుచ్చారు. అలాంటి ఒడంబడికలేని పక్షంలో తండ్రి ఏమతానికి చెందినవాడైతే ఆ మతానికే బిడ్డలు కూడా చెందుతారని నిర్ణయించవచ్చునన్నారు. ఈ విషయంలోకూడా సభవారి అభిప్రాయాన్ని అనుసరించి ప్రభుత్వం నడుస్తుందని ఆయన తెలిపారు.

ఈవేళ బిల్లుపైచర్చలో పాల్గొన్న వారిలో ఒక్క మహంతి (గణతంత్ర పరిషత్ - ఒరిస్సా) తప్ప తతిమ్మా అందరూ బిల్లుకు తమ సాధారణ ఆమోదాన్ని తెలిపారు.

కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ భూపేష్ గుప్త బిల్లును బలపరుస్తూ బిల్లునే ఇంకా అభివృద్ధిపరచాలని కోరారు. ప్రత్యేక వివాహాల బిల్లుక్రింద వివాహం చేసుకొన్న వారు హిందూ అవిభక్త కుటుంబంతో వేరుపడిపోయినట్లేనని బిల్లులోవున్న క్లాజును శ్రీ భూపేష్ గుప్త నిశితంగా విమర్శించారు.

విడాకులను గురించి శ్రీ గుప్త ప్రస్తావించి దంపతు లిరువురూ తామింకా కలసి కాపురం చేయలేమని గట్టిగాభావించినప్పుడు వెంటనేవిడాకు లిచ్చుకోడానికి ఎలాంటి అభ్యంతరం ఉండకూడదన్నారు. వివిధ మతాలకు చెందిన దంపతుల బిడ్డల మతంవిషయంలో తల్లి అభీష్టానుసారం జరగడం ఉచితమని సూచించారు. బిడ్డలను పెంచి, వారికి విద్యాబుద్ధులు గరిపే విషయంలో తల్లికి ప్రధానపాత్ర ఉండటమే తన సూచనకు గల కారణమని ఆయన వివరించారు.

శ్రీమతి లీలావతిమున్షీ (కాంగ్రెసు) శ్రీ పి. యస్. రాజగోపాలన్ (స్వతంత్ర-మద్రాసు) గార్లు మాట్లాడుతూ ఈ చట్టంక్రింద వివాహమాడే వారు అవిభక్త కుటుంబంనుండి విడిపోయినట్లేనని బిల్లులో ఉన్న క్లాజును తీవ్రంగా విమర్శించారు.

యువతీ యువకులు పెండ్లిచేసుకొనేముందు వైద్యపరీక్ష చేయించుకోవాలన్న క్లాజును బిల్లులో చేర్చడము అవసరమని శ్రీమతి లీలావతి [illegible] సూచించారు.

సభ రేపటికి వాయిదా పడింది.

గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌కు అదనంగా 3 వ తరగతి పెట్టె

మద్రాసు, ఏప్రిల్ 30

గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌కు ఎయిర్ కండిషన్ పెట్టెలులేని రోజులలో అదనంగా ఒక మూడవ తరగతి పెట్టెను వేయాలని రైల్వే అధికారులు నిర్ణయించారు.

మద్రాసునుండి మంగళ, శుక్ర, ఆదివారాలలో బయలుదేరే గ్రాండ్ ట్రంక్-ఎక్స్‌ప్రెస్‌కూ, ఢిల్లీనుండి మంగళ, గురు, ఆదివారాలలో బయలుదేరే గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌కూ అదనంగా మూడో తరగతి పెట్టె తగిలించ బడుతుంది.

జెనీవా సభకు వియత్‌మిన్ ప్రాతినిధ్యం

వియత్‌నామ్ అంగీకారం?

పారిస్, ఏప్రిల్ 29

జెనీవాసభలో వియత్‌మిన్ ప్రతినిధులు పాల్గొన్నా తమ కభ్యంతరం లేదని వియత్‌నామ్ తెలియజేసిందని ఫ్రెంచి అధికారి ఒకరు నేడు తెలియజేశారు.

అయితే ఇందుకు అది కొన్ని షరతులు విధించింది. ఆ షరతు లేమిటో అతడు వివరించలేదు.

కాని, వియత్‌మిన్‌కు సమాన హోదా ఈయరాదని వియత్‌నామ్ పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది.

వియత్‌మిన్ ప్రాతినిధ్యాన్ని అంగీకరించవలసిందని బావ్‌దాయిను ఒప్పించడానికి, ఫ్రాన్సు అమెరికాలు వేర్వేరుగా తమదూతలను పంపారట.

దుర్గావిలాస్
మిలటరీ భోజనహోటల్
గవర్నరుపేట సెంటర్
విజయవాడ2

నగరంలో సినిమాలు

1—5—54

శేష్ మహల్
బహదూర్
శ్యామ, సురేష్ మూడు ఆటలు

శ్రీ ఈశ్వర మహల్
మాయా మచ్ఛీంద్ర
కన్నాంబ, గౌరీనాథశాస్త్రి
సరికొత్త కాపి 2 ఆటలు

శ్రీ మారుతి సినిమా
జ్యోతి
జి. వరలక్ష్మి, సావిత్రి, శ్రీరామమూర్తి
రోజూ 3 ఆటలు

శ్రీదుర్గాకళామందిరం
చక్రపాణి
భానుమతి, నాగేశ్వరరావు
7 వ వారం 2 ఆటలు

శ్రీ లక్ష్మి టాకీస్
బాలానందం
బాలలమూరుకు, కొంటె కృష్ణయ్య, రాజయోగం
2 వ వారం మూడు ఆటలు

శ్రీ లీలామహల్
BABLA బాబ్లా
ప్రతిరోజూ 3 ఆటలు

శ్రీ విజయ టాకీస్
మాయా బజారు (తెలుగు)
రామిరెడ్డి, రాజేశ్వరరావు, శ్రీరంజని
2 ఆటలు

గుంటూరు సినిమాలు

కృష్ణ మహల్
బాలానందం
బాలలమూరుకు, కొంటె కృష్ణయ్య, రాజయోగం
2 వ వారం 3 ఆటలు

శ్రీలక్ష్మిపిక్చర్ ప్యాలెస్
జ్యోతి
సావిత్రి, జి. వరలక్ష్మి, శ్రీరామమూర్తి
రోజూ 3 ఆటలు

ప్రభాకర్ టాకీస్
తోడుదొంగలు
ఎన్. టి. రామారావు, గుమ్మడి,
3 వ వారం 3 ఆటలు

మంజూరైనది రు. 37 లక్షల్లో ఖర్చుపెట్టినది రు. 3½ లక్షలే

ఎనిమిదేండ్ల కాంగ్రెసుపాలనలో 'హరిజనాభ్యుదయం'

ఎనిమిదేండ్ల కాంగ్రెసు పాలనలో హరిజనుల యిండ్ల స్థలాలకై మంజూరైన రు. 37 లక్షలలో రు. 3½ లక్షలే ఖర్చు చేయబడ్డంచూస్తే హరిజనాభ్యుదయంపట్ల కాంగ్రెసు ప్రభుత్వాలెంత శ్రద్ధచూపుతున్నాయో తెలుసుకోవచ్చునని రచయిత యీ వ్యాసంలో స్పష్టచేశారు.

అవిభక్త మద్రాసు రాష్ట్రంలో 1946 నుండి 1952 వరకు హరిజనాభ్యుదయానికి కేటాయించిన మొత్తం రు. 37 లక్షలు. హరిజనులకు యిండ్ల స్థలాలు సంపాదించి పెట్టడానికి ఈ పద్దు ఉద్దేశింపబడింది. కాని మంజూరైన సొమ్ము ఏ సంవత్సరమూ పూర్తిగా ఖర్చు పెట్టబడలేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారం యీ ధనం క్రింది విధంగా ఖర్చుచేయబడింది :

సంవత్సరం	మంజూరైన సొమ్ము (రూపాయలలో)	ఖర్చు చేయబడిన సొమ్ము (రూపాయలలో)	నిల్వ ధనం (రూపాయలలో)	మంజూరైన యిండ్ల స్థలాలు
1946 - 47	5,00,000	18,652	4,81,384	444
1947 - 48	5,00,000	40,456	4,59,544	626
1948 - 49	5,00,000	32,571	4,67,429	497
1949 - 50	6,00,000	30,854	5,69,146	576
1950 - 51	6,00,000	2,35,716	3,64,284	3,500
1951 - 52	5,00,000	(వివరాలులేవు)	(వివరాలులేవు)	(వివరాలులేవు)
1952 - 53	5,00,000	,,	,,	,,
1953 - 54				
మొత్తం	37,00,000	3,58,249	23,41,751	5,643

ఈ పట్టికలో మంజూరైన యిండ్ల స్థలాలు 5643 అని వుంది. కాని వీటిలో ప్రభుత్వానికి ఖర్చేమీ లేకుండా లభ్యమైన బంజర్లుకూడా ఉన్నాయి.

ప్రభుత్వ లెక్కల ప్రకారమే, గత 8 సంవత్సరాల కాంగ్రెసు పాలనలో హరిజన ఇండ్లస్థలాలకు మంజూరయిన ఈ 37 లక్షలలో రు 33½ లక్షలు ఖర్చు కాకుండా మిగిలివుండటంటే, హరిజనాభ్యుదయంపట్ల కాంగ్రెసు ప్రభుత్వం ఎంత అనురాగం కనపరుస్తూందో తెలుసుకోవచ్చు.

ఆంధ్ర ప్రభుత్వం తలపెట్టిన స్కీము

ఈయేడు ఆంధ్ర ప్రభుత్వం గృహవసతి పద్దు క్రింద రు. 30 లక్షలు మంజూరు చేసింది. కాని యిందులో హరిజనులకు కేటాయించిన సొమ్ము రు. 8 లక్షలే. మరో రు. 2 లక్షలు యితర వెనుకబడియున్న కులాలకోసం వినియోగిస్తారట. మిగిలిన రు. 25 లక్షలతో ఎవరెవరికి యిండ్లు కట్టించాలనుకొంటున్నారో ఎవరికీ తెలియదు. గత సంవత్సరం ఉపముఖ్యమంత్రి సంజీవరెడ్డిగారికి అనంతపురంలో ఇంటి నిర్మాణం కొరకూ కర్నూలులో బంగారు వ్యాపారస్థుల భవనాలకూ లక్షల రూపాయలు అప్పుగా యివ్వబడిన సంగతి అందరికీ తెలుసు. ఇట్టి వారందరూ కాంగ్రెసు ప్రభుత్వపు దృష్టిలో పూటకూటికి గతిలేని నిరుపేదలుగా కనబడుతున్నారు! నిత్య దారిద్ర్యంతో కాలం గడిపే హరిజనులు అష్టైశ్వర్యాలతో తులతూగుతున్నట్లు వీరి అభిప్రాయం! లేనిచో, హరిజనులపట్ల యింత అపచార మెందుకు చేయాలి? కాంగ్రెసు పాలకులు నిజంగా హరిజనుల అభ్యుదయాన్నే కోరితే, మంజూరైన రు 37 లక్షలలో రు 3½ లక్షలే ఎందుకు ఖర్చుచేయాలి?

సంక్షేమశాఖ బండారం

ఇలాగే అవిభక్త మద్రాసు రాష్ట్రంలోని సంక్షేమశాఖవారి ఖర్చుల వివరాలు పరిశీలిస్తే వారి బండారంకూడా బయటపడుతుంది.

1952-53 లో జమా ఖర్చుల వివరాలు

వివరం	మంజూరైన మొత్తం సొమ్ము (రూపాయలలో)
1. విద్యార్థుల స్కాలర్ షిప్పులు	21,85,400
2. ప్రభుత్వం నడిపే హాస్టల్సు (మొత్తం 21)	2,36,000
3. బోర్డింగ్ గ్రాంట్లు	22,47,300
4. ఇండ్ల స్థలాలు	5,00,000
5. నూతులు, స్మశానాలు, పుంతలు, చెరువులు వగైరా	5,00,000
6. డిపార్టుమెంటు ఖర్చు	17,31,000
మొత్తం మంజూరైన సొమ్ము :	74,00,000

పై పట్టికలో యిండ్ల స్థలాలకు మంజూరైన సొమ్ము ఎంత ఎక్కువగా ఖర్చు చేయబడుతూందో యిదివరకే చూపాం. అలాగే యితర పద్దుల విషయమున్నూ. డిపార్టుమెంటు ఖర్చుకుచూపబడిన పద్దు మాత్రం రు. 17 లక్షలు దాటింది! లంచగొండి ఉద్యోగులు, 'మేనేజర్ల' పుణ్యమా అని హరిజన హాస్టల్సుకి మంజూరైన కొద్దిపాటి ధనమైనా విద్యార్థుల కందడంలేదు. చాలీచాలని రేషన్లతో వారిని ఊచకోత కోస్తున్నారు.

శ్రీ తప్పెట సుబ్బారావు

ప్రభుత్వ కర్తవ్యం

ఆంధ్ర ప్రభుత్వం నిజంగా హరిజనాభ్యుదయం కోరేటట్లయితే ఈ క్రింది చర్యలు తీసుకోవాలి :

ఈ సంవత్సరం బడ్జెటులో హరిజనాభ్యుదయానికి కేటాయింపబడిన రు. 8 లక్షలు రు. 5 లక్షలకు పెంచి, ఆ మొత్తమంతా ఖర్చు పెట్టాలి.

హరిజనాభ్యుదయ శాఖలో పని చేస్తున్న ఉద్యోగుల లంచగొండితనాన్ని నిర్మూలించాలి. పని సక్రమంగా జరపని ఉద్యోగుల్ని తొలగించాలి.

ప్రైవేటు మేనేజిమెంట్లను రద్దు చేసి విద్యార్థి కమిటీల సహకారంతో హరిజన హాస్టల్సును ప్రభుత్వమే నడపాలి.

హరిజన విద్యార్థులకు, హరిజన క్రైస్తవ విద్యార్థులకు మధ్య తేడా చూపరాదు.

ఎహ్రెన్‌బర్గ్ సాహిత్యవ్యాసం

(రెండో పేజీ తరువాయి)

ఒకానొక రచయిత విజయాన్నో, విఫలతనో విశదీకరించే పనికి పూనుకొనే మన విమర్శకులు, కళాత్మకరచన (గ్రంథం) ఎలాపుట్టిందో దానికి సంబంధించిన సమస్యలపైన ఏమైనా కొంత వివరణ చేస్తారా?

లేదు. దురదృష్టవశాత్తు మొదటిరకం విమర్శకులు సాహిత్య పండితులు ఇంకా మనకు కొద్దిమందే వున్నారు.

కొంతమంది విమర్శకులకు రెండే రెండు రకాల పుస్తకాలున్నాయి. బహుమతి పొందిన నవలలు, పూర్తిగా ఖండించదగిన నవలలు.

మొదటిరకం పుస్తకాలను సమీక్షించేటప్పుడు విమర్శకులు స్కూలు విద్యార్థిలాగా ఆపుస్తకాలలోని విషయాలను వర్ణించుతారు. చివరకు తమ స్వతంత్రతను నిలబెట్టుకోడానికి, "అతిగా పొగిడాడనే" నిందలను ముందుగా తప్పించుకోడానికీ, ఆనవలలలో ఫలానిది లోపించిందని చెబుతూ అందుకు రచయితను నిందించుతారు.

పూర్తిగా ఖండించదగినవని వారు అభిప్రాయపడ్డ నవలలను సమీక్షచేసేటప్పుడు అలాంటి విమర్శకులు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పాత్ర వహించుతారు. మంచి ఉద్దేశ్యాలతో ఒక రచయిత ఒక నవలను వ్రాశాడనుకోండి. అది జయప్రదం కాలేదనుకోండి. ఆ రచయిత చిత్తశుద్ధిని ఏమాత్రం సందేహించవలసిన అవసరం లేదనుకోండి. అయినా ఆ నవలను రచించడం ఒక నేరం అని ఆ విమర్శకులు భావిస్తారు.

అలాంటి నవలలను గురించి మాట్లాడేటప్పుడు విమర్శకులు, ఆ పుస్తకాలలోని విషయాలను ప్రస్తావించరు. అక్కడా ఇక్కడా కొన్ని వాక్యాలను లాగి వాటిని రచయితకు వ్యతిరేకంగా సాక్ష్యంగా ఉపయోగించి ఉదహరించుతారు.

ఒక నవలను స్తుతించేటప్పుడు లేక పూర్తిగా ఖండించేటప్పుడు, ఆ రచయిత వ్రాసిన ఇతర పుస్తకాలకూ ఈ నవలకూ సంబంధం ఏమిటి? అన్న విషయాన్ని తరచుగా ఆలోచించనే ఆలోచించరు. పరీక్షాధికారులలాగా వాళ్లు మార్కులిస్తారుగాని రచయిత విజయానికిగాని వైఫల్యానికిగాని కారణాలను విశదీకరించరు. కళాత్మక రచనలు ఎలా ఉత్పత్తి అవుతాయి? రచయిత స్వభావానికి అతని రచనకూ ఎంత సన్నిహిత సంబంధం వుంది — మొదలైన విషయాలను వివరించరు.

సోవియట్ యూనియన్ లో లాగా రచయిత లంటేను సాహిత్యం అంటేను ఉన్న అభిమానం ఎప్పుడూ ఇదివరలో ఎక్కడాలేదు. పాఠకులనుండి రోజూ వందలాది లేఖలు రాని రచయితలు సోవియటులో ఉన్నాడని నేననుకోను.

వినయభావంలేదని నిందించుతారనే భయాన్ని లక్ష్యపెట్టకుండా రచయితలు, తమ పాఠకులకు తమ గదనలను ఎలా ఊహించాలో చెబుతున్నారా? తమతోటి రచయితల పుస్తకాల గురించి వారు వ్రాస్తున్నారా? ఒక కళాత్మక రచనను ఎలా పోషించి బయటకు తెచ్చారో అనుభవం ద్వారా వారికి తెలుసు. తమ సోదర రచయితల పుస్తకాలను మంగళాచరణంతోనో శాపనార్థాలతోనో వీరుచూడ నవసరం లేదు. సృజనాత్మక కళకు మూలం ఏమిటో వారు విశదీకరించవచ్చు.

మన రచనానుభవం గురించి లేక ఇతరుల పుస్తకాలపై మన అభిప్రాయాల గురించి మన రచయితలు సాధారణంగా పాఠకులకు తెలియ జేయరు.

కొందరు విమర్శకుల వ్యాఖ్యలలో పాఠకునికి శాపనార్థాలు తప్పకుండా కన్పించుతాయి. చాలకాలం మౌనముద్ర వహించి ఏమీ వ్రాయలేదని ఒక్కొక్క రచయితను అతడు ఆడిపోస్తాడు.

మరొకరచయితయుద్ధంగురించి తాను వ్రాసిన నవలలో తమ మాతృభూమికి సంబంధించిన వీరులను సృజించనందుకు అతనిని దండించుతారు. తగినంత ఆశను వెలిబుచ్చే పాత్రలు లేవనో, లేక అతి ఆత్మవిశ్వాసం కలిగి యున్నాయనో మరొకరచయితను నిందించుతారు. ఇలాంటి వ్యాసాలతోపాటు పాఠకులకు రచయితలనుండి కొన్ని హామీలు కూడ పత్రికలలో కన్పించుతాయి. ఫలానా ఫలానా ప్రాజెక్టు నిర్మాణం గురించో లేక ఫలానా పరిశ్రమశాఖను గురించో తాము నవలలు వ్రాయదలచామని ఆ రచయితలు చేసిన వాగ్దానాలు అందులో కనబడతాయి. జాతీయ ఆర్థిక విధానంలోని ఫలానాశాఖను గురించి నవలలు వ్రాయవలసిందని పత్రికా సంపాదకులు తమను ఫలానాచోటికి పంపుతున్నారని కూడా వీరు వ్రాస్తున్నారు.

ఇక్కడ నా ప్రకటనను వెంటనే వివరించవలసిన అవసరం వుంది. ప్రయాణం చేయడంవల్ల రచయితకుండే లాభాలను నేను కాదనడంలేదు. కాని చేతిలో నోట్ బుక్ పెట్టుకొని ప్రయాణం చేసే రచయిత నవలకు కావలసిన "సామగ్రిని మాత్రం ప్రోగుచేయగలడు." సఖాలిన్ ను సందర్శించిన తర్వాత చెకోవ్ కొన్ని స్కెచ్ లు గల ఒక పుస్తకాన్ని వ్రాశాడు. ఆ ప్రయాణం చెకోవ్ ను విజ్ఞానవంతుని చేసింది. ప్రజలను మరింత బాగా తెలుసుకొనేటట్లు సహాయపడింది. కాని అతని కథలలో ఆయన సఖాలిన్ కు సంబంధించిన కథా వస్తువులను తీసుకోలేదు.

ఒకరచయితను మీరు మోల్డావియాకు లేక యాకూటియాకు పంపవచ్చు; లేక విదేశాలకు పంపవచ్చు. అతడు పత్రికా రచయితగా బాగా పనికి వస్తాడు, ఇతర స్థలాలకు యాత్రకు పంపిన మాత్రాన ఆ రచయిత వచ్చేటప్పుడు ఒక నవల ఆత్మనుఅతడు తన జేబులో వేసుకువస్తాడని భావించరాదు. ఒక నవల వ్రాసేటప్పుడు అతడు ఒక పట్టణాన్ని లేక ఒకఫ్యాక్టరీని చూడవలసిరావచ్చు. కాని అది అతను వ్రాయదలచిన పుస్తకానికి ప్రోత్సహించిన విషయాన్ని బలపరచుతుంది మాత్రమే.

ఆ విధంగా ఒక సాహిత్య రచన చేయడం పారిశ్రామికి వస్తువును ఉత్పత్తి చేసినట్లు కన్పించవచ్చు. వస్తువులను కొనేవాడు ఫలానా వస్తువు తనకు నచ్చలేదని, తనకు నచ్చిన డిజైనులో ఫలానా గుడ్డలేదని న్యాయంగా అతడు ఆగ్రహం చెందవచ్చు. అలాగే కొంతమంది రచయితలు ఫలానాఫలానా నిర్మాణ కార్యకలాపాలను వర్ణించలేదనో, ఫలానా ఫలానా వృత్తులను చిత్రించలేదనో, కొన్ని భావనల గురించి ప్రస్తావించలేదనో పాఠకులు ఆగ్రహించవచ్చు ఆ రచయిత తక్కిన విషయాలను బాగా చిత్రించినప్పటికీ.

(సశేషం)

చైనా కార్మికుడు

(రెండవపేజీ తరువాయి)

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే చాంగ్ దంపతులు నిబ్బరంగా హాయిగా సంసారం గడుపుతున్నారు. కాగా వారికి కీచులాటలుకూడా వస్తూవుంటాయి. రేడియోదగ్గర కూర్చున్నపుడు పెకింగువార్తలు, రాజకీయవార్తలూ పెడదామని చాంగ్ అంటాడు. కాదు పెకింగ్ నాటకశాల పాటలు పెట్టాలని ఆవిడ అంటుంది. ఇదీ వారికీచులాట.

చాంగ్ చదరంగం అంటే చెవి కోసుకొంటాడు. కార్మికుల క్లబ్బులో సాధారణంగా చదరంగం ఆడుతూ వుంటాడు. బాలురకన్నా ఇంకా శ్రద్ధగా పుస్తకాలు చదువుతాడు.

ఆ దంపతులకు కాని, వారి సంతానానికి కాని చింతలులేవు. ఇంత కాలానికి తమ స్వంతమైన ఈ మహా చైనా దేశానికి తమ సర్వశక్తులూ ధారపోసి హాయిగా జీవితం గడపడమే వారి పరమాశయం.

ఆ దంపతులకు వందనాలు అర్పించి మేం బయలుదేరాం. నిజమే చాంగ్ కుటుంబం చైనా కార్మిక కుటుంబాలకు ఒక మచ్చుతునక. అయినప్పటికీ ఆ కుటుంబానికొక ప్రత్యేకతా విశిష్టతా వున్నాయి.

చదవండి :
ఆంధ్ర ప్రజలు -
- సిరిసంపదలు
పేజీలు 205 వెల : 2-12-0

పత్తికొండ తాలూకా రైతు, కూలీప్రజల కడగండ్లు

విపరీతమైన వడ్డీలు : భూస్వాముల దోపిడీలు

విపరీతమైన వడ్డీ రేట్లతో భూముల కొరతతో రుణ భారంతో పత్తికొండ తాలూకా రైతాంగం క్రుంగిపోతున్నది. తాలూకాలోని గ్రామాలకు రహదారులు లేక, మంచి నీటి సౌకర్యాలు లేక, ప్రజలు అనేక బాధలు పడుతున్నారు. పేద రైతాంగ క్షేమం దృష్టిలో వుంచుకుని వెంటనే ప్రభుత్వం కౌలుదార్లకు రక్షణకల్పించాలనీ, తాలూకాలోని బంజర్లను పేదలకు సాగుకు యివ్వాలనీ వ్యాసకర్త సూచిస్తున్నారు.

పత్తికొండ తాలూకా రైతాంగం విపరీతమైన రుణభారంతో భూముల కొరతతో భూస్వామిక దోపిడీకి గురి అవుతున్నారు. వడ్డీరేటు నూటికి రెండున్నర, మూడురూపాయల వరకూవుంది. అప్పుగాను షాహుకార్లు రైతుల భూములను తాకట్టుపెట్టుకుంటున్నారు. అప్పుపుచ్చుకొన్నపుడు, తీర్చునపుడు భూమి విక్రయింపు ఖర్చులు రైతులే భరించుకోవాలి. ఇక ధాన్యం అప్పుగా తీసుకుంటే నూరుశేర్లకు 150 శేర్లు చెల్లించే షరతుకు ఒప్పందమవాలి. కటామణి సమయంలో రైతులకు అప్పును కావలసి వుంటుంది. షాహుకారు, వేరుసెనగకాయలు ధరమేరకు బేడ తక్కువ తోనూ నువ్వులు, పెసలు ధరమేరకు ½ శేరు లేక శేరు హెచ్చుగాను యిచ్చే పద్ధతి మీద బాకీలు యిస్తాడు. ఈ బాకీలకు మామూలు వడ్డీగూడా చెల్లించుకోవాలి.

వ్యాపారస్థులు హెచ్చు తూకము కొల్లలుద్వారా అమాయక రైతాంగాన్ని పీల్చి పిప్పిచేస్తున్నారు.

పేదరైతుల యిక్కట్లు

షాహుకారు వడ్డీలతోపాటు పేద రైతులను భూస్వాములు, పెత్తందార్లు ఇంకొక రూపాన పీడిస్తారు. విపరీతమైన జరిమానాలను రైతులవద్దనుంచి వసూలు చేస్తున్నారు. పగిడి రామిరెడ్డిగారి తోటలో ఒక పేద రైతు ఒక వంకాయ తెంచినాడన్న కారణాన అతనికి 50 రూ॥లు జరిమానా విధించారు. వుప్పరపల్లె రెడ్డివాండ్ల కళ్ళంలో జీతగాళ్ళు నాలుగు శేర్లు కొర్రలు దొంగిలించారని నలుగురు ఒక సంవత్సరం ఉచితంగా పని చేయునటుల తీర్పు యిచ్చారు. రైతులకు 10; 20; 25రూ॥లు అప్పులు పెట్టి హెచ్చువడ్డీలతో మొత్తం చేసి అప్పు తీర్మానం క్రింద రైతుల భూములను లాక్కొంటున్నారు.

యిక ధాన్యము అప్పుగా తీసుకుంటె 100 శేర్లకు 150 శేర్లు చెల్లించు షరతుపైన అనగా 100 శేర్లకు 50 శేర్లు నాగువంతున ఏర్పాటుతో యిస్తారు. యీ పద్ధతి సర్వసాధారణముగా తాలూకా అంతట అమలులో యున్నది.

యిక రైతులకు కటామణి సమయములో అప్పులు కావలసి వచ్చును. ఆ గ్రామముయొక్కరో ప్రాంత్యము యొక్కరో వ్యాపారి దగ్గరకు పోవుదురు. అతడు ధర మేరకు వేరుసెనగ కాయ అయితే మణుగు 1 కి 0-2-0 తక్కువతోను, నూలు, పెసలు వగైరాలు అయితే ధర మేరకు ½ శేరు లేక 1 శేరు హెచ్చుగాను యిమ్ము షరతుపైన బాకీలు యిచ్చెదరు. కొన్ని ప్రాంతములలో రైతు అప్పుకోరిన సమయములో వుండు ధరలో అర్ధ ధరకే రైతుల అప్పు మొత్తమును సరిపోవు వేరుశెనగ కాయ వేసము షరతుతో అప్పు యిచ్చెదరు. అనగా మణుగు 1కి 8-8-0ధర వుంటె 4-4-0 ధరకే సరుకు ఇచ్చుటకు సమ్మతించాలి. లేకుంటె అప్పు పుట్టదు. గత్యంతరం లేక, అప్పు దొరుకు మార్గం కనుపించక, దిక్కుతోచని టక్కు రైతు ఈషరతులతో అప్పు తీయును. పైగా యీ బాకీలకు మామూలు వడ్డీ కూడ వుండును.

10, 20, 50 రూపాయలాంటిస్వల్ప మొత్తము బాకీలకు వడ్డీలకు వడ్డీలు చక్రవడ్డీద్వారా మొత్తములు పెంచి అనేక మంది రైతుల భూములు కాజేసి యీ వడ్డీ వ్యాపారులు పెద్ద భూస్వాములయినారు. భూములు పోగొట్టుకొన్న రైతులు వారి భూములు కౌలుకు సాగు చేసుకొనవలసి వస్తున్నది.

యికవ్యవసాయకూలీల గోడు చెప్ప నవసరములేదు. తాతలు, తండ్రులు చేసిన బాకీలకుగాను, వారి తాతల, తండ్రుల లగాయతు నేటివరకు జీతాలు చేస్తున్నారు. ఎక్కువ కొల్లలు కడుపుకు సరిపడని కూలీల ద్వారాను, సంవత్సరములో ఎక్కువ భాగం పనులు లేకను బాధలుపడుతుంటారు. యింతేగాక పెద్ద గ్రామాలలో కూలీలు విధిగా పెద్ద రెడ్ల పొలాలలో వెట్టి చేయవలసి యుంటుంది. నోరెత్తితే కట్టేసి కొట్టడం, తప్పుడు కేసులుపెట్టి జైళ్ళకు పంపడంలాంటి ఘటనలు జరుగుతుంటాయి.

రవాణా సౌకర్యం : వైద్య సౌకర్యం

తాలూకాలో ఎక్కువ భాగము (కారుమంచి, దేవనకొండ, గోనెగొండ్ల) ఫిర్కాల గ్రామాలకు రోడ్లు లేవు. అన్నీ రాళ్ల రప్పలు, తుప్పలతోకూడిన పాడు రస్తాలు. యీ గ్రామాలకు పట్టణాలకు సంబంధాలు తక్కువ. కాన రైతు పండించిన పంటకు పట్టణముకు చేరవేసి సరియైన ధరకు తూకముకు కొల్లలకు అమ్ముకొను అవకాశము సాధారణ రైతుకులేదు. యీ తాలూకాలో సాధారణంగా పెద్ద భూస్వాములే పల్లె ప్రాంతముల వ్యాపారులగాను, వడ్డీవ్యాపారులుగాను గ్రామాధికార్లుగాను, పంచాయితీ బోర్డు ప్రెసిడెంట్లుగాను, సర్వాధికార్లుగాను వుంటారు. రవాణా సదుపాయములు లేక, పట్టణములు సమీపములో, అందుబాటులో లేనందున, ధరలు తెలియక గ్రామీణ ప్రాంతములలో సర్వాధికారులుగావుండు వ్యాపారులకు పండిన పంటను అడిగిన ధరకు సమర్పించుకొనవలసి వస్తుంది. యీ ప్రాంతీయ గ్రామ ప్రజానీకం (కారుమంచి, గోనెగొండ్ల, దేవనకొండ ఫిర్కాల ప్రాంతం) రోడ్డు రవాణా సదుపాయములు లేక పట్టణవాసుల సాహచర్యంలేని ఫలితంగా, అనాగరికులుగాను, అమాయకులుగాను వుంటున్నారు.

ఈ తాలూకా దాదాపు పూర్తి మలేరియా ప్రాంతము. పత్తికొండలో ఒక చిన్న గవర్నమెంటు ఆసుపత్రి, మద్దికెర-గోనెగొండలలో జిల్లాబోర్డు డిస్పెన్సరీలు మాత్రం యున్నవి. ఇవి తాలూకాలో 20 గ్రామాల ప్రజలకు మాత్రం కొద్దిగా అందుబాటులోవుంటున్నవి. మారుమూల గ్రామాల ప్రజలకు యీ ఆసుపత్రులు బొత్తుగా అందుబాటులోలేక, తుదకు రెండు క్వయినా మాత్రలు యిచ్చు దిక్కుకూడా లేక, వ్యాధుల నివారణకుగాను ఏ గ్రామదేవతకు మొక్కుకొని దేవర, దైవములు జరుపుకొందురు.

ఈ తాలూకాలో అనేక గ్రామములలో మైనరు పంచాయతీలు స్థాపించబడ్డాయి. కాని ఏ పంచాయితీ బోర్డు కూడా, ఆరోగ్యవిషయకంగాను, గ్రామ పారిశుధ్య విషయకంగాను, చూపు శ్రద్ధ శూన్యమనియే చెప్పవచ్చు.

శ్రీ కె. ఈశ్వరరెడ్డి

విద్యా తదితర సదుపాయాలు శూన్యం

తాలూకాలో చాలా గ్రామాలలో ప్రాథమిక పాఠశాల లున్నవి. కాని బోర్డు ప్రెసిడెంట్లుగాను, జిల్లా బోర్డు మెంబర్లుగాను, లేక వారి బంధువులు, మిత్రులుగా, యుండు పెత్తందార్ల యొక్క ఇష్టానుసరించి యీ ఉపాధ్యాయులు నడుచుకొనవలసి వుంటుంది. ఉపాధ్యాయులు యితరుల పిల్లలకు చదువు చెప్పకూడదనియు తన యింటి వసారాలోనో, గదిలోనో కూర్చొని తన పిల్లలకు మాత్రం చదువు చెప్పుతూ తమ ఇంటిలో నేతిండి తింటూ, వడ్డీ లెక్కలు చూసుకుంటూ వుండవలసిందిగా ఆజ్ఞాపిస్తారు. ఆ విధంగా నడుపుచుంటున్న గ్రామాలు అనేకం వున్నాయి. ఏదూర ప్రాంతాలనుంచో వచ్చిన ఉపాధ్యాయులు వారికి వచ్చు స్వల్పజీతాలతో పోషణకుగాను ప్రజాసహకారం లేక ఒక చోట నుండి మరియొక చోటికి ట్రాన్స్‌ఫరు కాబడుతూ, దాదాపు ఎప్పుడూ యీ స్కూళ్ళు మూతవేయబడియుండును. కాన పేద ప్రజా సామాన్యపు బిడ్డలకు విద్య శూన్యము.

గృహ సౌకర్యము, మంచినీటి వసతి ఏ గ్రామములో చూచినా అధ్వాన్నముగా యున్నవి. ఎప్పుడో వందల ఏండ్ల క్రిందట ప్రత్యేకించిన గ్రామకంఠ స్థలము జనాభా పెరిగిన యీ రోజుల్లో బొత్తుగా చాలడంలేదు. సమీపములో వున్న భూములన్ని సామాన్యముగా భూస్వాములే ఆకట్టుకొని వుంటారు. ప్రభుత్వం యిండ్లకు పట్టాభూములను సంపాదించి, గ్రామనత్తంస్థలముగా ప్రత్యేకించవలసిన అవసరం తాలూకా అంతటా యున్నది. ఏ గ్రామమునకు వెళ్ళినా గృహ సమస్య ప్రధానమయినదిగా వుంది.

చాలా గ్రామాలలో నేటికీ దిగుడు బావుల నీరేగతి. వారి కురుపులు వగైరావల్ల బాధపడుతుంటారు. ప్రతి గ్రామానికి ఒక చేదుడు బావి అవసరము కలదు. యీ రూపంగా పత్తికొండ తాలూకా రైతుకూలీ ప్రజాసామాన్యం రుణభారముతోనూ, మధ్యయుగాలనాటి వెట్టి, లంచము వగైరా వల్లను పంట భూస్వామికి దోపిడీలకు తగు మార్కెట్టు లేకను, పండిన పంటకు పట్టణ మార్కెట్లకు చేరవేయుటకు రోడ్డు రవాణా సౌకర్యములు లేకపోవడమువల్లను, తగు పరపతి సౌకర్యములు లేనందునను ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దయాధర్మాలకు లోనుగావలసి వచ్చుటవల్లను, తక్కువ ధరలు, హెచ్చు తూకములు, ఎక్కువ వడ్డీల వల్లను, మలేరియాలాంటి తీవ్రవ్యాధుల వల్లను, విద్యా, వైద్య, ఆరోగ్య సౌకర్యముల లోపము వల్లను చాలా నలిగిపోయినారు.

ప్రజాసామాన్యం సర్వ విధాలుగా పెత్తందార్లకు బానిసలుగా అణగిమణగి నికృష్ట జీవితం గడుపవలసి వస్తుంది.

కావున పత్తికొండ తాలూకా ప్రజాసామాన్యం అభివృద్ధికి రావలయునంటే యీ దిగువ పేర్కొనిన పనులు జరగాలి.

కౌలుదార్లకు రక్షణ కల్పిస్తూ నట్టం తేవాలి; తాలూకాలో సాగులాయకు ఫారెస్టు బంజర్లు పండ్రెండువేలు యెకరాలు వుండును. వాటిని పేదలకు సాగుకు యివ్వాలి; రైతుల రుణములపై మారిటోరియం ప్రకటిస్తూ, ప్రభుత్వం తక్కావీ అప్పులద్వారాను, కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలద్వారా రైతులకు అప్పులు యివ్వాలి; రోడ్లు నిర్మించి పట్టణాలకు రవాణా సౌకర్యములు కల్పించాలి; గాజులదిన్నె దగ్గర హంద్రీనదిపై ఆనకట్ట కట్టించాలి; యితర మైనరు ఇరిగేషను సదుపాయములు కల్పించాలి. డి. డి. టి. చల్లించి క్వయినా తదితర మలేరియా నిరోధక చర్యలద్వారా మలేరియా నివారణకు పూనుకోవాలి. ఆసుపత్రులు ఎక్కువగా కనీసం ప్రతి ఫిర్కా సెంటరులోను ఒక ఆసుపత్రిని నిర్మించాలి. ప్రతి గ్రామములోను మంచినీటి వసతి, గృహవసతి, ఎరువు గిర్బలకు స్థలం ఏర్పరచి ఆరోగ్య జీవితము కల్పించాలి.

గ్రంధపరిచయం

ముగ్గురు మిత్రులు

[నవల]
వెల : రు. 5—0—0
ప్రచురణ :
ఉమా పబ్లిషర్సు, విజయవాడ.

మాక్సింగోర్కీ వ్రాసిన ఒక నవలకిది శ్రీ గద్దె లింగయ్యగారి అనువాదం.

ముగ్గురుమిత్రులు ఇలియా, జాకోబు, మాషాలు ముగ్గురూ సామాజిక చక్రంలో పడి నలిగిపోయిన విషాద గాథ యిది. సమాజంలోని త్రాగుడు, వ్యభిచారం, మోసం, హత్యలు, నేరాలు మొదలైన వానికి మనుష్యులలోని రాక్షసత్వం కారణంకాదనీ, మానవునిలోని మానవత్వాన్ని, సత్సంకల్పాన్ని, శుభేచ్ఛల్ని సమాజంలోని ఆర్థిక వ్యవస్థ అడుక్కి తొక్కేసి వాళ్ళని రాక్షసుల్నిగా మారుస్తూందనే సత్యాన్ని గోర్కీ సునిశితంగా ప్రకటించాడు.

సమాజంలోని ఆర్థిక వ్యవస్థ వేరా, లీపా, జాకోబ్, ఫర్ఫిష్కాల వంటి శతసహస్ర సాధారణ ప్రజానీకాన్ని మురికిగుంటల కీడ్చింది. పెట్రోవా, టూసినా వంటి వారికి సంఘంలో గౌరవ మర్యాదలు కలిగించింది.

సంఘంలో గౌరవ మర్యాదలతో మానవుల్లాగే బ్రతుకుదా మనుకున్న జాకోబు, ఇలియా, మాషాలు సర్వ విధాలా నాశనము అవుతారు.

ఈ సమాజ వ్యవస్థ మారాలి. మారక పోతే మానవుడు మానవుడుగా జీవించలేడు.

మాక్సిం గోర్కీ యొక్క ఈ నవల ఇదివరకే తెలుగులో ఒక ముద్రణ పడి ప్రజాదరణ పొందింది.

స్వీకారం

నవీన హిందీ స్వయం శిక్షక్
రచన :
కంభంపాటి సత్యనారాయణమూర్తి
యం. యల్. సి. యం. హైస్కూలు
గుంటూరు
వెల : రూపాయి

కిష్కింధ
(హాస్య పక్ష పత్రిక)
సం : అక్షరమూర్తి
రాజమండ్రి
వెల : 2 అ॥లు

పాంచజన్యం
[కావ్యం]
రచన : కారుమంచి
వెల : 6 అణాలు
ప్రచురణ : నవయుగ పబ్లిషింగ్ హౌస్,
గుంటూరు.

కాశ్మీర్‌కు వ్యతిరేకంగా ఆంగ్లో - అమెరికన్ల కుట్ర
(ఆంగ్ల గ్రంథం)
రచన : విజయకుమార్
వెల : 3—12—0
ప్రచురణ : పీపుల్సు
పబ్లిషింగ్ హౌస్, బొంబాయి

ఆధునిక లోకం
(నాటకం)
రచన : రంగకవి
వెల : 1—4—0
ప్రతులకు :
వేంకట్రామా అండ్ కో; ఒంగోలు

తొలకరి
కైకలూరుబోర్డు హైస్కూలు పత్రిక

విశ్వగీతి
(గీతి కావ్యం)
రచన : సి. నారాయణరెడ్డి
ప్రతులకు : ఆంధ్ర బుక్ హౌస్
సుల్తాన్‌బజారు, హైద్రాబాదు

ఆంధ్రరాష్ట్ర విజయము
[పద్య కావ్యం]
రచన :
రామ సూర్యనారాయణమూర్తి
వీరవాసరం (ప. గో. జిల్లా).
వెల : 6 అణాలు.

తేటగుంట

తూర్పుగోదావరిజిల్లా తునితాలూకా తేటగుంట గ్రామ రైతు - కూలీ సంఘ కార్యకర్తల సమావేశం ఇటీవల జరిగింది. చర్చల అనంతరం మద్యనిషేధం రద్దుచేయాలనీ ఏలేరు, పంపా, తాండవ ప్రాజెక్టులు నిర్మించాలనీ, మంచినీటి వసతులు అభివృద్ధిచేయాలనీ కోరుతూ తీర్మానాలు చేసారు.

ప్రభాతప్రెస్-నెల్లూరు
అట్టపెట్టెలు - రబ్బరు స్టాంపులు
లిథో ప్రింటింగ్ - కలర్ ప్రింటింగ్
పుస్తకములు - పెండ్లిపత్రికలు

రత్నపురుషవేష్టం
(WITH CALCIUM & GOLD).
సువర్ణము మొదలగు భస్మములు చేర్చబడినవి. నిర్బలత, నిస్సత్తువ, శుక్లనష్టము, అతిమూత్రము, అజీర్ణము గుండెదడ, కాళ్ళు తీపులు మొదలగు సమస్త మేహములు హరించి బలమును, కాంతిని, నరముల పటుత్వము, అపరిమిత ధాతుపుష్టి నిచ్చును. అనేక రోగ్యతా పత్రములు గలవు.
20 రో. డబ్బి రు. 3-12-0 పోస్టేజి 1-0-0
అడ్వాన్సుగా పంపవలెను.
ఇండియన్ మెడిసన్ హౌస్,
లక్ష్మీటాకీస్ రోడ్డు - విజయవాడ-2.



PHONE 33-1621
కాన్వాస్ టార్పాలిన్లకు
A. S. SOOBASHAH Bros.
29and 21, Colootola Street
CALCUTTA-1

కుమార్ స్టుడియో
ఫొటోఆర్టిస్టులు, ప్రోసెస్ ఎంగ్రేవర్సు, ఫొటోగూడ్సు డీలర్సు. న్యూసిటీ టాకీస్ ప్రక్క,
రైల్వేస్టేషన్ రోడ్, గుంటూరు.
కెమెరాలకు, ఫిలిములకు, ఫొటోల ఎన్లార్జిమెంట్లకు మీరిచ్చు ఆర్డర్లు అతి జాగ్రతతో నిర్వహించబడును.

Just arrived ART IN RUMANIAN PEOPLES REPUBLIC Rs. 1-8-0 BUKHAREST (an album) Rs. 5- FOLK ART IN RUMANIA As. 6 (postage extra) Write Progressive Traders, 134. Shambazar St., Calcutta.

సులేఖా
ఫౌంటన్ పెన్ ఇంకి
లోకములో ప్రఖ్యాతిగాంచి వ్రాయుటకు తగిన ఇంకి.
(అన్ని షాపులలోను దొరకును)
SULEKHA WORKS LTD.
SULEKHA PARK • CALCUTTA-32

ఆసియాదేశాల అంతరంగిక వ్యవహారాల్లో అమెరికా జోక్యం

కొరియా-ఇండోచైనా ఉదంతాలు నిరూపించే పరమ సత్యం

—III—

ద్వితీయ ప్రపంచ సంగ్రామంనుండి నేటి వరకుఆసియాలో అమెరికాకుట్రలవివరణ

కొరియా ఇండో చైనా సమస్యలకు పరిష్కారమార్గాలు వెతికేందుకు జెనీవాలో అగ్రరాజ్యాలు అయిదూ సమావేశం అవుతున్నాయి. ఈ కొరియా – ఇండో చైనాలలో ప్రధాన సంఘటనలు ఎప్పుడెప్పుడు జరిగినదీ, ఆ సంఘటనలవల్ల ఏఫలితాలు కలిగినదీ ఈ వ్యాసంలో వివరించ బడింది.

కొరియా ఇండో చైనా సంఘటనల చరిత్ర ద్వితీయ ప్రపంచ సంగ్రామం ముగిసిననాటినుంచీ – అంటే 1945 నుంచీ ప్రారంభం అవుతుంది.

జపానుతో యుద్ధం ముగిసినతర్వాత కొరియా ప్రజలు తమదేశాన్ని స్వతంత్ర ప్రజాతంత్ర దేశంగా రూపొందించుకొందామనుకొన్నారు. కాని అమెరికా కొరియా వారి ప్రయత్నాలన్నింటికీ ఆటంకం కలిగిస్తూ వచ్చింది.

కొరియాను తనకు వలసను చేసుకోవాలనే అమెరికా దురాశ కొరియాను రెండుగా చీల్చడంలోనే ద్యోతకం అవుతుంది. ఆ తర్వాత అమెరికావారు కొరియాలో యుద్ధాన్ని రగుల్కొల్పడం, కని విని ఎరుగనంతటి విధ్వంసకాండకు పూనుకోవడం ఇవన్నీ అమెరికావారి పేరాసకు తార్కాణాలు. సోవియట్ సేనలు 1945 లో కొరియాకు విముక్తి సాధించిన నాటి నుంచీ స్వతంత్ర ప్రజాతంత్ర కొరియా నిర్మాణానికెంతగానో తోడ్పడుతూ వచ్చారు. సోవియట్ యూనియన్ దీక్ష ఫలితంగా రష్యా, అమెరికా, ఇంగ్లాండుల విదేశాంగ మంత్రులు 1945 లో మాస్కోలో సమావేశం అయి ఈ విషయంలో ప్రధానమైన నిర్ణయాలు చేశారు. అయితే అమెరికావారు ఆ తర్వాత ఆనిర్ణయాలను కాలదన్నడమే కాకుండా ఆ నిర్ణయాలకు పూర్తివ్యతిరేకంగా కూడా ప్రవర్తించారు. కొరియాలో ప్రజాతంత్ర ఉద్యమాలను, అభిప్రాయాలను నిర్దాక్షిణ్యంగా అణచివేశారు. మరోమూలనుంచి సింగ్మన్ రీలాంటి కరోత్కటులను ఉసికొల్పి వదిలిపెట్టారు. ఉభయుల సేనలను ఉపసంహరించి కొరియా ప్రజల స్వయం పాలనకు అవకాశం ఇవ్వాలని ప్రజల కోరిక మేరకు సోవియట్ ప్రభుత్వం చేసినసూచనను అమెరికావారు తిరస్కరించారు. అంతేకాకుండా దక్షిణ కొరియాలో ప్రజా వ్యతిరేకతనుకూడా సరకుగొనకుండా "ప్రత్యేక ఎన్నికల తతంగం" జరిపించి తమ కీలుబొమ్మ సింగ్మన్ రీ పాలనను వారి నెత్తిన రుద్దారు.

కావలసినంత డబ్బు కుమ్మరించి, అపారంగా ఆయుధాలు తెప్పించి సింగ్మన్ రీ కొకసేనను తయారు చేసి పెట్టారు. అమెరికా అధికారు లిచ్చిన సమాచారం ప్రకారం వారు సింగ్మన్ రీకి అప్పగించిన సేనలో లక్షన్నర సైనికు లున్నట్లు అంచనా.

యుద్ధభేరీ

అది 1950 జూన్ 25 వ తేదీ తెలవారుతోంది. సింగ్మన్ రీ ముఠావారు అమెరికా వారూ కలసి ప్రజాతంత్ర కొరియా రిపబ్లిక్ మీద దండయాత్ర ప్రారంభించారు. ఇదేదో యాదృచ్ఛికంగా జరిగిన దండయాత్ర కాదు. కొరియాను రెండుగా చీల్చి, సింగ్మన్ రీలాంటి ఒక కీలుబొమ్మను సంపాదించి, అతడి ఆధీనంలో ఒక పెద్ద సేననూ, అపార అయుధ సంపత్తిని పెట్టిననాడే అమెరికావారి కుట్రలు వాసన కొట్టాయి.

సింగ్మన్ రీ పరిపాలనను కొరియా కంతకూ వ్యాప్తి చేయడంకోసం 38 వ అక్షాంశరేఖ సరిహద్దును చెరిపివేయాలని అమెరికా అధికారులుబాహాటంగా ప్రకటనలు చేశారు. అదీకాక యింకా కొద్ది రోజుల్లో దండయాత్ర ఆరంభమౌతుందనగా ఉత్తర కొరియా మీద దాడికి మేం సిద్ధంగావున్నాం అని కీలుబొమ్మ రీ గోలచేశాడు.' ఈ విషయాన్ని "ఐ. రా. స. కొరియా కమిషన్" తన నివేదికలో స్పష్టంగా పేర్కొంది కూడా.

అయితేనేం అమెరికా వారి సాహసిక యాత్రకు అడుగులో హంసపాదు పడింది. అమెరికా వారి బెదిరింపులకు తుపాకులకు తూటాలకు వీర కొరియా ప్రజానీకం ధృతిచెడలేదు సరికదా ప్రతి పోరాటంలోనూ కాకలు తేరి ఇంకా గట్టిపడ్డారు. చైనా వలంటీర్ల సహాయంతో వారు అమెరికా వారిని చావు దెబ్బలు కొట్టారు. ఈ చావు దెబ్బలతో ఇంక "విజయం ఎక్కడా కనుచూపు మేరలో" కానరావడంలేదని అమెరికావారు నిశ్చయించారు. యుద్ధ విరమణకు సంప్రతింపులు ప్రారంభించాలన్న సోవియట్ ప్రతిపాదనను గతిలేక ఒప్పుకొన్నారు. అయితే అమెరికావారు తమకు ఎదురైన పరాజయాన్ని ఒక పట్టాన అంగీకరించలేదు. యుద్ధ రంగంలో తాము సాధించ జాలని వాటిని చర్చ కూటాలలో సాధించడానికి ప్రయత్నాలు చేశారు.

అడ్డుపుల్లలు

దీర్ఘకాలం సాగిన ఈ యుద్ధ విరమణ చర్చలలో చర్చలను నగ్నం చేయడానికి అడుగడుగునా అడ్డంకులు పన్ని నానాఅవస్థలూ పడ్డారు. వింత వింత ప్రతిపాదనలు విడ్డూరమైన సూచనలు చేశారు. అర్థరహిత వాదనలకు [illegible].

యుద్ధఖైదీలను వారి స్వేచ్ఛనిమీదే స్వదేశాలకు పంపాలనే ఒక ప్రతిపాదన చేశారు. ఈ ప్రతిపాదన అంతర్జాతీయ న్యాయసూత్రాలకు పూర్తి విరుద్ధం. అయినా అమెరికావారు ఆ ప్రతిపాదనలమీదే పట్టుపట్టారు.

కోజీదీవి మున్నగుచోట్ల యుద్ధఖైదీల నెందరినో చిత్రవధ చేశారు. ఊచకోత కోశారు. "యుద్ధఖైదీలు తమ దేశాలకు పోనొప్పడం లేద"ని అసంబద్ధ ప్రచారాలు సాగించారు. ఈ ఒక్క సమస్యపైననే అమెరికావారు సంవత్సరన్నరవరకు సంప్రతింపులను ఒక కొలిక్కి రాకుండా నానుస్తూ వచ్చారు.

ఇలాగ సంప్రతింపులలో ఒకమూల ప్రతిష్టంభన ఏర్పరచి మరోమూలనుంచి అమానుష క్రిమియుద్ధాన్ని ప్రారంభించారు. అమెరికావారు ఈయుద్ధంద్వారా సంప్రతింపులలో చైనా వారిని ఉత్తర కొరియా వారినీ "లొంగదీయాలని" ప్రయత్నించారు. కానిఅమెరికన్ల పన్నాగాలు ఒకటొకటిగా వమ్ము అవుతూ వచ్చాయి. నానాటికీ పెరుగుతున్న ప్రపంచ ప్రజాభిప్రాయం వల్లనైతేనేమి, కొరియాలో చైనా ప్రతినిధుల హేతువాదబలం వల్లనైతేనేమి కొసకు అమెరికన్లు యుద్ధ విరమణకు తలవొగ్గక తప్పిందికాదు. 1953 జులై 27 వ తేదీన పాన్ మున్ జాంలో యుద్ధ విరమణ ఒడంబడికపైన సంతకాలు జరిగాయి.

దానితో మూడు సంవత్సరాలకు పైగా జరిగిన కొరియా యుద్ధం దురాక్రమణదారులకు తలవంపులతో ముగిసింది. అమెరికా వారు నాలుగు లక్షల నిండు ప్రాణాలనూ అపార ఆయుధ సామగ్రినీ ఆహుతి చేసినప్పటికీ పరాజయాన్ని తప్పించుకొనలేక పోయారు.

యుద్ధ విరమణ ఒడంబడిక జరిగినా దాన్ని స్థిరంగా వుండనీయకుండా చేసేందుకు పన్నే ఎత్తులను మాత్రం అమెరికా వారు విడిచిపెట్టలేదు. సరిగా యుద్ధ విరమణ సమయాలలో అమెరికావారు సింగ్మన్ రీతో ఆలోచించి 27 వేల మంది కొరియా, చైనా ఖైదీలను "విడుదల" పేరుతో అపహరించారు. యుద్ధవిరమణ జరిగినతర్వాత తమ ఏజంట్లను ఖైదీలశిబిరాలకు పంపి స్వదేశాలకు తిరిగిపోగోరిన ఖైదీలను హింసించడం బెదిరించడం మొదలైన దుష్కృత్యాలకు పూనుకొన్నారు. తటస్థదేశాల మార్పిడి సంఘాలవారు ప్రచురించిన పత్రాలలో ఈ సంగతులన్నీ స్పష్టంగా పేర్కొనబడ్డాయి. కొరియా చైనా ప్రతినిధుల నిరసనలను, ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని ధిక్కరించి అమెరికా అధికారులు ఖైదీలమార్పిడి ఒప్పందాన్ని భగ్నంచేశారు. నచ్చజెప్పే కార్యక్రమానికి ఆటంకం కల్పించారు. కొసకు 21905 మంది చైనా కొరియా ఖైదీలను సింగ్మన్ రీకి చాంకైషేక్ కు అప్పగించారు. కొరియా రాజకీయ సభలో చర్చలను నిరంకుశంగా భగ్నపరిచారు.

అంటే అమెరికావారు ఇంకా తమ విజయకాంక్షను పేరాసను వదులుకోలేదన్నమాట. వారింకా కవ్వింపులను వదలలేదన్నమాట. కొరియాలో శాంతి స్థాపన అంటే తమకొంప మునిగిపోతుందనే అభిప్రాయాన్ని విడిచిపెట్టలేదన్నమాట.

ఇండోచైనాఉదంతం

ఇండో చైనాలో జపాను సేనలు 1940 లో అడుగుపెట్టిన నాటినుంచీ జాతీయ స్వాతంత్ర్యంకోసం ఇండో చైనా ప్రజలసమరం ప్రారంభమైంది.

ద్వితీయ ప్రపంచ సంగ్రామ కాలంలో ఫ్రెంచిప్రభుత్వం తన పలుకుబడిని తిరిగి ఇండో చైనాలో స్థాపించే నిమిత్తం అక్కడి ప్రజలతో యుద్ధం ప్రారంభించింది.

అమెరికా కుట్రలకు కూడా ఇండో చైనా నిలయం అయింది. ఇండో చైనాలో యుద్ధ జ్వాలలు చల్లారకుండా వుంటే ఆగ్నేయాసియాలో ఉద్రిక్తత అలాగే వుంటుందని, అవసరం పడినప్పుడు ఇండోచైనాను స్థావరంగా చేసుకొని చైనాపైన స్వేచ్ఛగా దాడి చేయవచ్చునని అమెరికావారు కలలు కంటున్నారు.

అసలు 19 వ శతాబ్దారంభం నుంచీ ఫ్రెంచివారు ఇండో చైనాను కబళించడం ప్రారంభించారు. ఈ శతాబ్దారంభం నాటికి ఇండో చైనాలోని మూడు రాజ్యాలను పూర్తిగా పుక్కిట పట్టారు.

1940 లో జపాను ఫాసిస్టులు చైనా మీద యుద్ధం సాగిస్తూ ఇండోచైనాలో చొరబడ్డారు. అంతవరకు ఇండో చైనా ప్రజలపై పెత్తనం చెలాయిస్తూన్న ఫ్రెంచి దొరలు జపానువారికి దాసోహం అన్నారు. 1945 మార్చి 9 నాటికి ఇండో చైనా నంతటినీ జపానువారు ఆక్రమించుకొన్నారు.

ప్రజా ప్రతిఘటన

కాని, అనేక పోరాటాలలో ఆరితేరిన ఇండో చైనా ప్రజలు జపాను దాడి మూకలను ప్రతిఘటించారు. 1941 మే లో వియత్నాం స్వాతంత్ర్య సంఘం (వియత్మిన్) ఏర్పడింది. ఈ వియత్మిన్ నాయకత్వాన ప్రజా సేనలు నిర్మించబడ్డాయి. విముక్తి ప్రాంతాలు, విముక్తి ప్రాంతాలలో ప్రజా ప్రభుత్వాలు నెలకొన్నాయి. వియత్నాంలో జపాను ఫాసిస్టులను వ్యతిరేకించే శక్తి వియత్మినేనని ప్రపంచ ప్రజలంగీకరించారు "లామార్సెయిజ్" అనే ఫ్రెంచి పత్రిక "ఫ్రెంచి ఉన్నవారలంతా 'సిగ్గు' అడుగుజాడల్లో నడుస్తూవుంటే వియత్నాం వీరుడు హోచిమిన్ నాయకత్వాన జపాను ఫాసిజాన్ని ధైర్యంతో ఎదుర్కొంటున్నారు" అని రాసింది.

జపాను 1945 సెప్టెంబరు 25 వ తేదీన శరణాగతి పొందిన తర్వాత వియత్నాం ప్రజాతంత్ర రిపబ్లిక్ అధ్యక్షుడు డాక్టర్ హోచిమిన్ హానోయ్‌లో 5 లక్షలమందితో ఒక బ్రహ్మాండమైన సభజరిపి వియత్నాం స్వాతంత్ర్యాన్ని ప్రకటించాడు. వియత్నాం జాతీయ ప్రజాసంఘంవారు రాష్ట్రీయప్రభుత్వానికి డాక్టరు హోచిమిన్ ను అధ్యక్షుడుగా ఎన్నుకున్నారు.

1946 జనవరి 6 వ తేదీన వియత్నాం ప్రజాతంత్ర రిపబ్లిక్ లో జాతీయ శాసనసభకు ఎన్నికలు జరిగాయి. వోటు హక్కుగలవారిలో నూటికి 90 మందికి పైగా ఎన్నికల్లో పాల్గొన్నారు. మార్చి 3 వ తేదీన జాతీయ శాసనసభ హానోయిలో సమావేశం అయి వియత్నాం ప్రజాతంత్ర రిపబ్లిక్ ప్రభుత్వాన్ని ఎన్నుకొంది. ఆ ప్రభుత్వానికి డా. హోచిమిన్ అధ్యక్షుడు. ఇలాగ ప్రజాతంత్ర పద్ధతిలో ఎన్నికలు జరిగిన మీదట న్యాయమైన ప్రభుత్వం ఏర్పడింది. ఈ ప్రభుత్వాన్ని సోవియట్ యూనియన్, చైనా, తూర్పు యూరపు నూత్న ప్రజాతంత్ర దేశాలూ గుర్తించాయి.

వియత్నాం స్వాతంత్ర్యాన్ని ప్రకటించిన సంవత్సరమే పథెట్ లావో, ఖ్మేర్ ప్రజలు కూడా తమ స్వాతంత్ర్యాన్ని ప్రకటించి స్వతంత్ర ప్రభుత్వాలను ఏర్పరచుకొన్నారు.

ఖ్మేర్ ప్రజా కాంగ్రెసు వారు ఖ్మేర్ ప్రతిఘటన ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు.

స్వతంత్ర పథెట్ లావో సంఘంవారు పథెట్ లావో ప్రతిఘటన ప్రభుత్వాన్ని 1950 లో ఎన్నుకొన్నారు.

ఫ్రెంచివారి పునరాగమనం

తమ వలస ఆధిపత్యాన్ని పునస్థాపించుకోవాలనే ఆశతో ఫ్రెంచి సేనలు బ్రిటిష్ సేనలతోపాటు ఇండోచైనాలో అడుగుపెట్టాయి. ఐతే దాడి చేయడానికి తగిన సమయం అవకాశం సంపాదించే ఉద్దేశంతో ఫ్రెంచివారు వియత్నాం ప్రజాతంత్ర ప్రభుత్వంతో సంప్రతింపులు ప్రారంభించారు. ఫ్రాన్సుతో ఏదో విధంగా శాంతియుత పరిష్కారాన్ని సాధించడానికి వియత్నాం ప్రభుత్వం సర్వవిధాలా ప్రయత్నించింది. 1946లో "ప్రాథమిక ఒడంబడిక" "అధికారుల ఒడంబడిక" మున్నగునవి జరిగాయి. ఈ ఒడంబడికల్లో ఫ్రెంచివారు వియత్నాం ప్రభుత్వాన్ని ప్రభుత్వము, పార్లమెంటు ఆర్థిక స్తోమత, స్వంత సైన్యము గల స్వతంత్ర ప్రభుత్వంగా గుర్తించింది. శత్రు చర్యలను ఇకమీదట జరపబోము అని వాగ్దానం చేసింది.

ఈ ఒడంబడికలమీద సంతకాలంటే చేసిందికాని ఫ్రాన్సుకు చిత్తశుద్ధిలేదు. అందుకని హైఫోంగ్, హానోయిలలో కవ్వింపులు ప్రారంభించింది. 1946 నవంబరులో ఫ్రెంచివారు సుంకాల ఘాటు సంఘటనను సృష్టించి హైఫోంగ్ లాంగ్ సాన్ లను ఆక్రమించారు.

డిసెంబరు 19వ తేదీన ఫ్రెంచివారు తమ యుద్ధ సన్నాహాలను పూర్తి చేసుకొని హానోయ్‌లో పెద్ద ఎత్తున దాడి ప్రారంభించారు.

అప్పటికి తాము చేసుకొన్న ఒడంబడికలన్నింటినీ ఫ్రెంచి వారు చింపి పారవేశారు.

ఇటు వియత్నాం ప్రభుత్వంమాత్రం సమాధానం కోసం శాంతియుత ప్రయత్నాలను నిరంతరంగా చేస్తూనేవచ్చింది. 46 డిసెంబరు 10 నుంచి 1947 మార్చి నెలాఖరువరకూ శాంతి స్థాపనకోసం 8 సార్లు హోచిమిన్ విజ్ఞప్తి చేశాడు. వాటికి ఫ్రెంచిప్రభుత్వం కొసకుజవాబు కూడా ఇవ్వలేదు.

అమెరికా వత్తాసుతో తన ఆధిపత్యాన్ని ఇండోచైనాపై పునస్థాపన చేసుకోవాలనుకొన్న ఫ్రెంచి ప్రభుత్వమే ఇండో చైనాలో యుద్ధాపరాధిగా నిలుస్తుందని చరిత్ర చాటుతోంది.

సామ్రాజ్యవాదులకు నష్టాలు

తమ మాతృభూమి రక్షణకోసం తమ స్వాతంత్ర్యాన్ని కాపాడుకొనడం కోసం ఇండో చైనా వీర ప్రజానీకం సర్వతోముఖప్రతిఘటన ప్రారంభించారు ఫ్రెంచి సామ్రాజ్యవాదులను దెబ్బపై దెబ్బతీస్తున్నారు. గత 7 సంవత్సరాల లోనూ ఫ్రెంచివారు 3 లక్షల 20 వేల మంది సైనికులను బలిపెట్టారు. లక్షా 80 వేలమంది ఫ్రెంచి సైనికులు ఇండో చైనా యుద్ధజ్వాలల్లో ఇరుక్కొని పోయారు.

అసలు ఫ్రెంచివారు అమెరికా సహాయంపై ఆశ పెట్టుకొన్నారు. అనుగుణ సేనానాయకులను మార్చారు. బావ్ దాయ్ ని శిశవాంగ్ వాంగ్ నీ, సిహానౌక్ నీ కీలు బొమ్మ రాజులుగా ముందుకు తీసుకొనివచ్చారు. వారికి కీలుబొమ్మ సేనలను ఏర్పరచారు. కాని ఏం లాభం పరాజయాలూ పరాభవాలూ మాత్రం వారికి తప్పలేదు.

ఫ్రెంచివారు పరాజితులవడంచూసి అమెరికా 1950 నుంచి ఇండో చైనాలో తన వలపన్నడం ప్రారంభించింది. కొరియాలో యుద్ధ విరమణ అయిన నాటినుంచీ అమెరికా ఇండో-చైనాలో ఇంకా ఎక్కువగా జోక్యం చేసుకొంటోంది. 1950 జూన్ 27 న కొరియాకు సేనలను విమానాలను పంపుతూ ఇండో-చైనాకు ఆయుధాలుకూడా సత్వరంగా అందించాలని ట్రూమన్ ఉత్తర్వులు జారీచేశాడు. నాటినుంచీ అమెరికా ఆయుధాలు ఇండో-చైనాకు శరపరంపరగా ప్రవహిస్తున్నాయి. 1950నుంచి 53 లోగా నాలుగు లక్షల టన్నుల మందుగుండు ఇండో చైనాకు ఎగుమతి అయింది. ఇండో చైనా యుద్ధ వ్యయంలో అమెరికా వాటా నానాటికీ పెరిగి ఇప్పుడు నూటికి 70 వంతులకు చేరింది. అమెరికా ఆయుధాలను పంపడమే కాకుండా వైమానికులను సాంకేతిక నిపుణులను కూడా ఇండో చైనాకు పంపించింది. అమెరికన్ సైనిక నాయకులు రాజకీయ వేత్తలూ ధారావాహికగా ఇండో చైనాలో పర్యటించారు. తాను అందించిన ఆయుధాలపై అజమాయిషీ చేసే అధికారం తమకు ఉందని అమెరికావారు ప్రకటించారు. తమ పెత్తనాన్ని క్రమంగా సాగించడం కోసం బావ్ దాయ్ మున్నగు కీలుబొమ్మలకు 'స్వాతంత్ర్యం' ఇవ్వాలని పేచీ పెట్టారు. వీటన్నింటినీబట్టి ఇండోచైనాను ఫ్రెంచివారి ఆధీనం నుంచి తాము స్వాధీనం చేసుకొని దాన్ని అమెరికా వలసగా చేసుకోవాలని డాలరు అధినేతలు కలలు కంటున్నట్లు విదితమౌతుంది. ఇండోచైనా నుంచి ఒక్క గెంతు గెంతి చైనాపై విరుచుకొని పడవచ్చునని వారి ఆశ.

ఇండోచైనాలో శాంతిని నెలకొల్పాలని ప్రపంచప్రజలంతా ఎలుగెత్తి ఘోషిస్తున్నారు. 1949 నాటినుంచీ ప్రపంచ శాంతి ఉద్యమం ఎడతెగకుండా ఈ విషయమై ఆందోళన చేస్తోంది. ఇండోచైనా సమస్యను శాంతియుత సంప్రతింపులద్వారా పరిష్కరించుకొనడమే తమ పరమాశయం అని హోచిమిన్ 1953 లో మరొకసారి స్పష్టంగా ప్రకటించాడు. కాని అమెరికా ఫ్రెంచివారిని బలవంతాన యుద్ధంలోకి నెట్టుతోంది. ఇండోచైనాలో శాంతి నెలకొనక పోవడానికి అమెరికావారే పూర్తి బాధ్యులని చరిత్ర నిరూపిస్తోంది.

ఆసియా రాజ్యాల అంతరంగ వ్యవహారాల్లో జోక్యం కల్పించుకొని ప్రతిచోటా సైనిక స్థావరాలను నిర్మించడానికి, అమెరికా ప్రయత్నిస్తోందని చారిత్రక ఘటనలు నిరూపిస్తున్నాయి. "ఆసియా వాసులతో ఆసియా వాసులే పోరాడా"లనే దుష్ట నినాదానికి అనుగుణంగా వారు జపానును పునరాయుధోపేతం చేస్తున్నారు. అమెరికావారి ఈ విధానంవల్ల ఆసియాలో శాంతికి భంగం ఏర్పడుతోంది. ఆసియా ప్రజలంతా ఈ ప్రమాదాన్ని సంఘటిత శక్తితో ఎదుర్కొనవలసి వుంది.

షాంఘై ప్రజా కాంగ్రెసుకు డెప్యూటీలుగా ఎన్నుకోబడిన ముగ్గురు చైనా కార్మికులు.

యూనివర్శిటీ విద్య అభివృద్ధి

సర్వే కమిటీ సిఫార్సులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29.

భారత విశ్వవిద్యాలయ విద్యా కమిషన్ సిఫార్సులు ఎంతవరకు అమలు పరచబడ్డాయో చూడడానికి కేంద్ర విద్యామంత్రి మౌలానా అజాద్ చే నియమించబడిన యూనివర్శిటీ సర్వే కమిటీ, తన రిపోర్టులో ఆర్థిక కారణాల వల్ల ఆ సిఫార్సులు అంతగా అమలు పరచబడలేదని పేర్కొన్నది. ఆర్థిక విషయాలపై ఆధారపడని సిఫార్సులు కూడా సరిగా పరిశీలించబడలేదని కమిటీ తెలిపింది.

ఈ కమిటీవారు ఆర్థిక విషయాలలోనూ, ఆర్థిక విషయాలకు సంబంధించని అంశాలలోనూ, అనేక చర్యలను సూచించారు. అయితే ఈ సిఫార్సు లన్నిటినీ అమలుపరిస్తేనే సత్ఫలితాలు కలుగుతాయన్నారు. యూనివర్సిటీ సంస్థలనుంచి రాజకీయ ప్రాబల్యాన్ని, కుట్రలను తొలగిస్తేగాని యూనివర్సిటీవిద్య బాగుపడదన్నారు.

సెనేట్ నిర్మాణంపై యూనివర్సిటీ కమిషన్ అభిప్రాయాలను బలపరుస్తూ, ప్రతికాలేజీనుంచి ఒకసీనియర్ టీచరును సెనేట్ లోకి తీసుకోవాలని ఈ కమిటీ సూచించింది. యూనివర్సిటీ సంస్థలకు సాధారణంగా ఎన్నికలు జరగకుండా చూడాలని పేర్కొన్నది. సిండికేట్ లో గాని, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ లో గాని 17 గురు సభ్యులకు మించరాదన్నది.

కామినియా
రిజిష్టర్డు ఆయిల్ రిజిష్టర్డు

ఇతర అనేకనూనెలకంటె పేరుపొందిన ఔషధములు కామినియా ఆయిల్ (రిజిష్టర్డు) ప్రసిద్ధికి తెచ్చినవి. వెంట్రుకల-అభివృద్ధికి పనికిరానివి అంటూ ఏమీ లేవు. [illegible] కామినియా నూనెపై ఖర్చుపెట్టేదబ్బుకు తగినట్లుగా [illegible] 4 అణాల స్టాంపులు పంపిన నమూనా పంపబడును.

ఆంగ్లో ఇండియన్ డ్రగ్ & కెమికల్ కంపెనీ, బొంబాయి - 2.

ఆంధ్ర స్టేటుకు డిస్ట్రిబ్యూటర్స్: మెస్సర్స్ విజయాఏజన్సీస్,
నంబిపాటివారి వీధి, విజయవాడ - 1.

FOR ALL
SOVIET BOOKS
& MAGAZINES

Please
visit
or
contact

VISALAANDHRA PUBLISHING HOUSE
VIJAYAWADA—ANDHRA

సంపాదకుడు, ముద్రాపకుడు, ప్రచురణకర్త:— కాట్రగడ్డ రాజగోపాలరావు—ముద్రణ: స్వతంత్ర ఆర్టు ప్రింటర్సు, బకింగ్ హాంపేట, విజయవాడ. సంపాదకవర్గం:— [illegible] [అధ్యక్షులు], [illegible], కాట్రగడ్డ రాజగోపాలరావు.